UNIVERSAL
LIBRARY
OU_204229
UNIVERSAL
LIBRARY

OUP—391 29-4-72—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 83 1 Accession No. T 1954

Author N23K

Title

This book should be returned on or before the date last marked below.

# కాంతం కైఫీయతు

వినోద కథల సంపుటి

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు బి. ఏ., యల్. టి.

పబ్లిషర్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,

బుక్ సెల్లర్సు అండ్ పబ్లిషర్సు

రాజమండ్రి.

అసలు కాపీరైటు హక్కులు
గ్రంథకర్తవి

శ్రీ కొండపల్లి ముద్రాశాల,
రాజమండ్రి.

Checked 1969

వెల
రూపా

1950

# విషయ సూచిక


| | |
|---|---|
| శ్రీ కాంతాయమ్మారావుగారు—కైఫీయతు | 5 |
| బహుముఖాల అద్దం | 18 |
| ప్రణయకలహం | 24 |
| గట్టినిశ్చయం | 36 |
| కోర్టులో కాంతం | 43 |
| ధర్మచక్రప్రవర్తన | 52 |
| లేచిపోవాలనుకుంటే | 66 |
| కిటికీకి అవతలా యివతలా | 76 |
| ఎండ—వాన | 87 |
| సముద్రస్నానం | 105 |
| కాంతమ్మగారి ఆవు | 117 |

# కృతజ్ఞత

ఈకథలు చిన్నప్పుడు మా శివశంకర శాస్త్రిగారు నాలో పెంపొందించిన ఉపజ్ఞకు ఫలితాలు. వారు చూపిన దారిలోనే ఇవి ఇంతవరకూ రాణించి ఆంధ్రుల అభిమానాన్ని పొందినవి.

నాకు దేశంలో కొద్దో గొప్పో పేరుప్రతిష్ఠలు తీసుకొచ్చింది, నన్ను కథకునిగా తయారుచేసింది, మా శివశంకరశాస్త్రిగారే.

అందుకని నిజంగా నేను పుస్తకం వ్రాసి కృతజ్ఞత చూపాలిసింది మా సాహితీసమితి సభాపతులకే. అప్పుడప్పుడు మిత్రులు బాగున్న విషయాలను మెచ్చుకొంటూ నాలో ఉత్సాహం పురికొల్పినా అవి క్షణికాలు.

నిజంగా చేయూతా, స్థానం యిచ్చింది మా శాస్త్రిగారే.

మా సాహితీసమితి సభాపతులూ, పండితులూ, దేశభక్తులూ, ఉత్తమకవులూ, నాకు గురుమూర్తులూ అయిన శ్రీ శ్రీ శివశంకరశాస్త్రిగారికి నాకృతజ్ఞతను విన్నవించుకొంటున్నాను.

# శ్రీ కాంతాయమ్మారావుగారు--కైఫీయతు.

అంతట పెదబాబు మహారాజులంగారు వృద్ధులై ప్రభుత్వంవదలి వెంకట్రాయనింగారికి పట్టంగట్టినారు. శ్రీవారు మహాపరాక్రమవంతులై క్షత్రీయమైనటువంటి ప్రతిష్టనూ, రాజ్యలక్ష్మినీపొంది, వైరివీరసంహారుడు అయియుండెను.

వెంకట్రాయనింగారు పాపరాధులయందు సహనము గలిగి యాచకులకు దానములున్నూ ఆపన్నులకు అభయమున్నూ ఇచ్చేది. వారినేత్రములు స్వస్త్రీయందు ఉండేషు వంటివి. శిరస్సు ఉత్తములకు వందనము చేసేషు వంటిది. వారి దేహము దీనులయెడ అనుకంపము గలిగినషు వంటిది. వారిపలుకు ఆహ్లాదము కలిగించేషువంటిది.

చినబాబు కాంతయ్యమ్మారావుగారిని వివాహమాడి రాజ్యలక్ష్మినీ కాంతంగారి మనస్సునూకూడా ఏకశాసనంగా పాలిస్తూ ఉన్నారు.

పుత్రపుత్రికా నృత్యగీత జనితరవాళిచేత ఒప్పుచున్నషు వంటిన్నీ, నర్తనశాలవలె అహ్లాదమైనషువంటిన్నీ, చక్రవాళి పరిమితమైనషువంటి భూచక్రమువలె ప్రకాసిస్తున్నషువంటిన్నీ కాంతాయమ్మారావుగారిచే పోషితమైనషువంటిన్నీ, గృహాన్ని మహావిష్ణువువలె పాలిస్తూ నిరంకుశాధికారము చలాయిస్తూ అయిదుగురు బిడ్డలున్నూ పంచరత్నములవలె శుద్ధమైన వర్ణములు గలిగినవారై ప్రసన్నమైనషువంటి పంచేంద్రియముల

వలె ఉంటూ ఉండంగా, వారితో కూడుకొని నెల నెలకూ దేవరవారికి వచ్చేటువంటి జీతంతో తృప్తిపడుతూ, సుఖిస్తూ ఉండేవారు. కాంతాయమ్మా రావుగారున్నూ విష్ణుభక్తుల యొక్క అనురాగమునందు కాంతిగలదై సతతా ఎప్పుడున్నూ, సాత్వికవాసన గలిగినటువంటిది. సత్యభామలు గలిగినటువంటిది. గుణరత్నములచాత అలంకరించబడినటువంటిది. మరిన్నీ పతియందు అనురక్తయై ధర్మమునందు ఆసక్తి కలిగినటువంటిదై నృసింహభక్తురాలైనటువంటిదై యుండెను.

ఇల్లాఉంటూఉండంగా శ్రీవారు బహుధర్మమూర్తులు కావటంచేత ముందు లెక్కలు ఖాతరుశాయక ఖర్చుశాయగా పిల్లలవివాహాది కార్యాలకుకావలసిన అర్థంయేమీ ప్రభుత్వం వారి అధీనంలో నిలువవై యుండకపోవటమే కాక రాజ్యం అప్పులపాలై యుండుకున్నమూలాన రాణీవారు బహు మనస్తాపం చెందినటువంటిదై శ్రీవారిచర్యలు హార్షంగాక బాబుగారు మీాజాబులు వ్రాయవలసినదిగా బహుపర్యాయములు సెలవు యిచ్చినారు. తదారభ్యం ఎన్నిసార్లు మనవి చేసినా శ్రీవారు వారిమాటలు ఖాతరుశాయక ముందురానున్న ఖర్చుఖరామతులకు అర్థం నిలువశాయక పోవటమున్నూ, పైగా దివాణం ఖర్చున్నూ, దొరగారి సన్తానమున్నూ వృద్ధి కావటమున్నూ, జరుగుతూ యుండటంమూలాన అమ్మగారికి మనఃక్లేశం యెక్కువ అవుతూవచ్చేది.

ఇంతలో శకవర్షంబులు, అగు నేటి భావ సంవత్సరం పుష్యబహుళ అమావాస్యరోజున సముద్రస్నానానికై కొందరుబంధువులు శ్రీవారి దివాణానికి రావటం తటస్థించిందాయెను.

ధోరవారి చెల్లెలుగారున్నూ, పెదతల్లి కుమారుడుగారున్నూ, కాంతాయమ్మారావు అక్కగారున్నూ అందు ముఖ్యమైనట్టువంటివారు.

వారితో కలిసి దివాణానికి చెందిన కష్టసుఖాలు మాట్లాడుకోటంలో కాంతాయమ్మా రావుగారు ప్రభుత్వానికి చెందిన విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పటమున్నూ, అంతట వారు ముగ్గురూ ఏకమై కొంత ఆలోచన చాయటమున్నూ జరిగినై. మరునాడు గభీలుమని చంద్రాస్తమయం అయినాక ప్రశస్తమైన చీకటిలో పెదబాబుగారూ, పెద అమ్మగారు, తదితరమైనటువంటి రాజ బంధువులునూ భోజనానంతరం మేడపైనికూర్చుని మాట్లాడుకొంటూన్నట్టువంటి సమయంలో అంతాచూస్తూ ఎవరా యని భావిస్తూఉండంగా బహు దొడ్డ పొడుగైనట్టువంటిన్నీ, సుందరమైన ముఖంకలిగినట్టువంటిన్నీ, కాంతగారు తెల్లని చీరగట్టు కొన్నట్టువంటిదై సిగలో పూలూ దవనమున్నూ, సువాసనను నలుదిక్కులా వెదజల్లుతూ వుండంగా తన రాణువతో కూడా వచ్చి శ్రీవారికి కొంచెం దూరంగా చాపపై నిడుపవేష్టించినట్టువంటిదాయెను.

అంతట ఈసంగతంతా గమనిస్తూఉన్న శ్రీచిన్నబాబు గారు తక్షణం అక్కడనుంచి లేచి అవతలకు వెడలిపోవాలని ప్రయత్నం చేశారు. కాని కాంతంగారి తీక్షణ వీక్షణము వల్లనూ, తమ్ముడుగారి వత్తిడి వల్లనూ, తిరిగికూర్చోవలసిన వారైనారు.

అపుడు దొరగారు కాంతంగారివైపు చూచి ఆమె వుద్దేశం ఎటువంటిదో తృటిలో గ్రహించారు. ప్రభువుగారిది బహుదొడ్డబుద్ధి!

ఆవిడగారి ఎత్తున్నూ మరిన్నీ ఈఫోజు అంతా అక్క గారికి మద్దత్తు రాగలదనిన్నీ, గ్రహించినటువంటివాడై ఏమీ మాట్లాడవద్దన్నట్లుగా సైగ చేసినారు.

అందుకు ఆవిడగారు ఏమిన్నీ లెక్కచేయక బట్టల కొట్టులోనున్నూ, ఇతర అంగళ్ళలోనున్నూ, ధొరవారు అప్పులు చేస్తూన్న సంగతిన్నీ, పది పన్నెండు సంవత్సరాల నుంచీ కాపురం చేస్తూన్నా, ఏమీ పొదుపుగా సొమ్మువాడు కొనే వైనం తెలియకపోవడమున్నూ దూబరాఖర్చులు చేస్తున్న సంగతిన్నీ, ఇత్యాది కష్టాలు యేకరువత్తూ అగుపర్చు కొన్నది.

ఈ వర్తమానం వినినంతనే వృద్ధులైన పెదబాబుగారు మిక్కిలిగా విసుగుకొన్నవారై అనిన మాటలు: అబ్బాయి గారూ, నేను చెప్పిన ఆలోచనమాత్రం ఎన్నటికీ వృథా పోయింది లేదు. ఏదైనా ఒకమాట నేను మనవిచేస్తే బాబు గారు వినకపోయిందీ లేదు. ఒకవేళ ఎప్పుడైనా ఆలాచేసినా

నామాట దాఖలాలో వచ్చి శిలాక్షరం అవటంవల్ల నా యొక్క ఆలోచన ప్రకారం నడ్చేవారు. కనుక బాబూ మీకు తెలియదు. ప్రాయవంతులు కాని మరి యొకటి కాదు. బాబుగారు తమజీవితం అంతా ఒక్కదమ్మిడీయైనా ఖర్చు చేయకుండా కోడలుగారి చేతిలో పెట్టడమున్నూ, ఆమె చేతిమీదుగా ప్రతియొక్క విషయమున్నూ జరిగించటమున్నూ, వుత్కృష్టమైన సంగతియని చెప్పేవరకు రాజుగార్కి నిండా ఖోపంవచ్చినది, కాని తలవంచుకొని ఊరుకొన్నారు.

కాంతాయమ్మారావుగారు అప్పుడు మనవిచేసిన దేమిటంటే: శ్రీవారు అల్లాగ చేస్తేనే శ్రేయస్కరమనిన్నీ, ఏలినవారికి చిన్నతనంనుంచీ కాసు, రువ్వగా వాడటమే గాని అర్థంయొక్క విలువ తెలిసి యుండలేదనిన్నీ, శ్రీవారు వృద్ధులైన తండ్రిగారిమాట అన్నివిధాల మన్నించవలసిందేననిన్నీ మద్దత్తుగా చెప్పేవరకు చినబాబుగారి మనస్సుకు చాలా చాలా కష్టం గలిగినా పెద్దలయెదుట ఏమీఅనలేక ఊరుకొన్నారు. శ్రీవారికి పెద్దలయెడలభక్తి చాలా మెచ్చుకోదగినదిగా ఉంటూఉన్నది.

అంతటబుల్లిబాబుగారు (శ్రీవారికి తమ్ములు) సంసారానికి శ్రీవారికి ఉండుకొన్న బాధ్యతనుగురించి పెద్దగాచెప్పి, మున్ముందురానున్న ఖర్చులనుగురించి కొండంతగాచూపి ఆదాయమంతా రాణీవారికి నెలనెలకూ ఇయ్యవలసిందిగా దొరగారిచేత ఖరారుచేయించు కొన్నారు.

తమ దొరతనానికి భంగంగలిగే ఈ యేర్పాటుకు ఒప్పుకోంటూ "కాఫీకైనా నెలకు ఇంతయని ఏదో కొంతసొమ్ము మేము తీసికొని మిగిలినదంతా రాణీవారికి ఇచ్చివేయంగల వారము" అని శ్రీవారు శెలవు ఇచ్చేవరకూ కాంతాయమ్మా రావుగారు అయిష్టాన్ని వెలిపుచ్చే చూపులుచూశారు. అప్పుడు శ్రీవారి భావమరుదులంగారున్నూ బుల్లిబాబుగారున్నూ, అన్నమాటలు: బాబుగారు ఏమాత్రమును మేము చెప్పే దానికి భిన్నంగా ఆలోచించవద్దు. ఎస్టేటు, ఆదాయములతో రాణీగారి పరం జేయాల్సింది. మాడుచెక్కలుతిని మంచినీళ్లు త్రాగి డబ్బు నిల్వాశాయాలె.

అని కచ్చితంగా శెలవుఇచ్చేవరకూ "సరే"నని చెప్పి ఘనతచెందిన చినబాబుగారు అక్కడఉండేందుకు ఇష్టంలేని వారై తత్క్షణం పడుకునేందుకు వెళ్ళిపోయినారు.

అంతట బుల్లిబాబుగారు శ్రీవారూ వెడుతూ ఉండంగా, వారి వెనక, వినిపించేలాగునే వచ్చేనెలనుంచీదొర వారుపైకం మీకే ఇయ్యగలరు. వారు ఆడినమాట తప్పేది లేదు. మీరు జాగ్రత్తగా వాడి సంస్థానం బాగుచేసేందుకు ప్రయత్నిస్తూ ఋణాలుతీర్చి, రాజ్యాంగం నడిపించవలసినదిగా వదినగారితో మేము మనవిచేసుకోంటున్నాము అని అన్నారు.

అక్కగారి మంత్రాంగంలో జమీ అన్ని విధాలా బాగుపడగలదని రాణీగారి తోబుట్టినవారు శెలవు చేసినారు.

ఇట్లా అంటూ ఉండంగానే కాంతం రాణీసాహేబా

వారు నిద్రాసక్తులై ఆవలించగా పెదబాబుగారు గమనించి, తత్‌క్షణం దేవిగారిని వెళ్ళిపోయి, నిద్రింపవలసినదిగా కోరి నారు.

ధొరగారు అంతఃపురములో హంసతూలికా తల్పాన పరుండి యుండగా, తరువాత ఒక్క అరగడియలో కాంతం గారు ఆభరణభూషితలైయ్యె, పుష్పాలంకృత కేశపాశలై... ...దభీమని తలుపుతీసికొని రాగా, శ్రీవారు మంచందిగినవషు వంటివారై, చేతులు కట్టుకొని నిలబడి "ఈరాజ్యానికి మీరే ఖామందులు అయి యున్నారు. కాబట్టి........." అని ఏమేమో చెప్పబోయి చెప్పలేక నిలువునా నిలబడిపోయి నారు.

అంతట ఆమెగారు, ఖామందుతనమున్నా, రాణి తన మున్నా, తీవినీ చూపుతూ, లక్షమల్లెలు ఒక్కసారి వికసించి నాయాఅన్నట్లు ఒక్క చిరునవ్వు నవ్వి, ఏలిన వారితో ఈవిధంగా ప్రసంగించినారు.

"మీరు నాకు ఈ రాజ్యంలో సర్వాధికారము ఇచ్చి నారు గదా? ఇచ్చినట్లేనా?"

"మా నోటివెంట మాటవచ్చెనా అంటే దానికి తిరి గేదిలేదు." అని ఏలినవారు బహు తీవిగా శెలవు చేశారు.

"మీరు ఈ ప్రభుత్వంనాకు దఖల్‌చేసి నన్ను అధి కారిని చేశారు?"

"అవును" అన్నారు ప్రభువువారు.

"నామాట మీరు ఆజ్ఞగా స్వీకరించివింటారు?"

"తమ అక్షరానికికూడా మేము ఇకనుంచీ విధేయులము"

"అట్లాగయితే శ్రీవారు కమలములవలె ప్రకాసిస్తున్న షువంటి నేత్రద్వయంతో ఇల్లా చూడగలరు."

"ఊఁ", అని శ్రీవారు చూశారు.

"కుడిపక్కకు రెండు అడుగులు వెయ్యగలరు మహాప్రభువులు."

చిత్తం."

ముందుకు మూడడుగులు వెయ్యండి మహారాజులంగారు."

"చిత్తము."

"వెనక్కు."

"చిత్తం"

"మంచం దగ్గరకు......మార్తాండతేజా."

"ఊఁ"

"పడుకోండి, ఆ హంసతూలికా తల్పాన పండితమాన్యా."

"ఉహు"

"ఏం......ప్రభూ."

"మాకు ఇష్టంలేదు" అన్నారు శ్రీదొరవారు. అంతటమహారాణీవారు వేలెత్తి పక్కవైపు చూపుతూ అన్న

మాటలు:

"మై రాణీ సాహెబా హూం. మేరాహుకుం హైకీ ఆప్ ఘూలోంసే సుసజ్జిత్ తల్పమే లేట్ జానా" అని ఠీవిగా, ఖామందులవారు, ఆ సేవకు ఘనత జెందిన (శ్రీ) చినబాబు గారు హిందీవలన అపకారం జరుగుతూన్న మాట నిజమే నని అనుకొంటూ రాణీకాంతాయమ్మారావుగారి ఆజ్ఞను మారు మాటలేకుండా నిర్వహించిన వారైనారు.

## బహుముఖాల అద్దం

అదీ మాపడకగది. ఒకప్రక్కన పందిరిమంచం దాని కెదురుగా గోడపైన నిలువుటద్దం. ఎదురుగా పుస్తకాలు. మంచానికి ప్రక్కన నేనుకుర్చీలో కూర్చుని వ్రాసుకొంటున్నాను. నాకు ఎడమవైపున ఉన్న బల్లపైన పుస్తకాలు కుప్పలు కుప్పలుగా ఉన్నాయి. గోడమీద అయిదారు చక్కని బొమ్మలున్నాయి.

గడియారంలో అప్పటి కప్పుడే తొమ్మిదైంది. ఆబల్ల మీద నున్న కాంపోజిషన్ పుస్తకాలన్నీ ఎప్పుడు దిద్దుతానా అని దిగులేసింది, అవన్నీ దిద్దేసి మర్నాడు పిల్లలకు ఇచ్చివేయాలె. పట్టుదలతో కూర్చుని ఒక్కొక్క పుస్తకమే దిద్దటం ప్రారంభించినాను సంవత్సరం పొడుగునా ఇట్లా దిద్దినా మొదటిరోజున ఏంతప్పులో చివరరోజునా సరీగ్గా

అవే తప్పులు. మరీ ఈకృషిఅంతా ఎందుకో మాఅధికారు లకే తెలియాలె. వివిధములైన మొక్కలు పెరిగే కొండలు వైద్యులకు మందులుచేయటానికి ఉక్కిలి ఉపయోగం అనే వాక్యం దిద్దటం ఎట్లాగా అని ఆలోచిస్తూ ఉండగా వచ్చింది కాంతం.

వచ్చిందన్న మాటేకాని నాగోలలో నేనున్నాను. కుర్రవాడి ఉద్దేశం మొక్కలు మందులు చేయటానికి ఉప యోగ పడతాయని కాని కొండలను మందులు చేస్తారని కాదు. ఇట్లాగే అవక తవకగా వ్రాస్తుంటారు కుర్ర కుంకలు. వాటిని సరిచేయటంలో మాప్రాణాలు హరించుకుపోతుంటవి. గొడవలో పడుండి వాక్యాన్ని కొద్ది మార్పుతో పూర్తిగా అర్థం వచ్చేలాగున ఎట్లా మారుద్దామా అని ఆలోచిస్తూ, ఆవిడ రావటాన్ని కళ్ళతో చూచాను............కాంతం వచ్చింది. సన్న గోరంచు పొందూరు చీర కట్టుకొని వయొలా క్రీంబాడీస్ వేసుకొన్నది. బన్నాముడి. దానిపైన అర్ధచంద్రా కారంగా పూలు.

వచ్చి అద్దానికి ఎదురుగా నిలబడి గాజులూ పమిటా సవరించుకొని ముంగురులు దిద్దుకోటం నేను చూస్తూనే ఉన్నా కళ్ళతో. కాని మనస్సుమాత్రం వాక్య రచనలో లగ్నం అయి ఉంది.

నావంక చూచి కాంతం నవ్వింది......నేను తలొం చుకొని వ్రాసుకొంటున్నాను. తర్వాత ఆవిడ అక్కడే

నిల్చొని కుచ్చెళ్ళు వదిలించటం నాకు వినిపించింది. నేను తల ఎత్తి చూడలేదు. పౌడరు కామాలు ముఖానికి అద్దుకొని అద్దంలో చూచుకొంటున్నది కాంతం. నేను ఇవన్నీ కనిపెడుతున్నా. తలెత్తకుండా వ్రాసుకుంటూ వుండటం మూలాన ఆవిడ "కొత్తదుప్పటి వేశా రేపక్కపైన" అన్నదిపరుపువంక చూస్తూ చిరు నవ్వుతో. నేను కలపుల్లం పళ్ళతో కొరుకుతూ "అవును" అన్నట్లు తలకాయ ఊపాను.

కాంతం మళ్ళీ అద్దం చూచుకొని తిలకందిద్దుకొన్నది. వడ్డాణం తీసి గజ్జలు గలగల లాడించి కటిస్థానం దగ్గర కుచ్చెళ్ళు సద్దుకొని వడ్డాణం పెట్టుకొని,

"ఏమిటి వ్రాస్తున్నారు" అన్నది.

"ఏముంది? బడిపంతులు చేసే మహాకార్యా లేము న్నాయి? కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకోటం, అమృతాంజనం రాచుకోటం" అన్నాను విసుగ్గా.

కాంతం పకా పకా నవ్వినది. అయితేనేం నామట్టుకు నేను స్పెల్లింగుతప్పులు దిద్దుతున్నాను. ఫీల్డు స్పెల్లింగు Field ఆ లేక Feild ఆ అని సందేహం తోచి డిక్షనరీ చూస్తున్నాను. ఇంతలో పసిపిల్ల మెసిలి దగ్గింది.

లేస్తుంది కామాలు, ఇప్పుడే నిద్రపుచ్చి వచ్చా అన్నది ఆవిడ.

నా కామాటలు వినిపించినా, నేనేం మాట్లాటలేదు. ఇంతలో కాంతం మేడ దిగి, వీధి తలుపు గభీలుమని వేసి

వచ్చి పట్టెమంచము దగ్గర నుంచుని పెద్దగా ఆవలించింది. పడుకొంటుంది కామోలు అనుకున్నాను. కాని ఆమె పడుకోక ఆరోజున చేసిన జిలేబీ వెండిపళ్ళెంలో పెట్టుకొని వచ్చి "తినండి" అని బల్లమీద పెట్టి వెండి గుండుచెంబుతో మంచి నీళ్ళుపెట్టి నావంక చూచి,

"తినరేం" అన్నది.

"అక్కడపెట్టు" అన్నాను నేను.

కాంతం మళ్ళీ అద్దం దగ్గరకు పోయి ఇంకోసారి సద్దుకొని,

"నాబ్రోచ్ చూశారా" అన్నది.

"అబ్బ! ఏమిటి నీప్రశ్నలూ, నివ్వానూ, నీ బ్రోచ్ సంగతి నాకెందుకూ? నన్ను రాసుకోని" అన్నాను.

"అహా, ఎందుకండీ అంతవిసుగూ? మీరాతకు నేనేం అడ్డంవచ్చాను. నాబ్రోచ్ ఎక్కడైనా చూశారేమోనని అడిగాను," అనిఅంటూ నవ్వింది. నవ్వితే నవ్విందని నేనుమళ్ళీ పుస్తకం తీసుకొని తప్పులు చూస్తుంటే, కాంతం అక్కడే నుంచుని బ్రోచ్ పమిటకు పెట్టుకుంది.

అప్పటికి నేను దిద్ద వలసిన పుస్తకాలు ఇంకా ఇరవై వున్నాయి బల్లమీద. ఒక్కొక్కటే తదేక దీక్షతో దిద్దేస్తున్నాను. కాంతం గడియారం వంక చూచి "అబ్బ పదైంది పడుకోవాలె. ఒక్కగడియైనా నిద్ర పోతాను. పన్నెండు కొట్టే టప్పటికల్లా రకీమని లేస్తుంది పసిముండ, ఎవరో కొట్టి

లేపినట్లు" అని స్వగతం కామాలు ప్రకాశంగా అన్నది. "ఎవరు పడుకోవద్దన్నారు" అన్నాను నేను. ఆమాటల్ని విని కాంతం నావంక ఏదో వింతగా చూస్తున్నా నేను గమనించక పురపాలక సభాధ్యక్షుడు చేసే పనులను గురించి వ్రాస్తూ కుర్రాడు "ఈయన ఆరోగ్య వారములో ఉత్సవములు జరు పును. పందులను కుక్కలను చంపించును. వోట్లకోసం తిరు గును," అని వ్రాయటం చూచి వీడి దుంపతెగ, ఇవేనా ఆయన విధులని వ్రాయాలసినవి అని అనుకొని, అంతా కొట్టే ద్దామా, లేకపోతే విషయాన్ని గురించి చూడక వాక్య రచ నలో ఉండే తప్పులు మాత్రమే దిద్దుదామా అని ఆలోచిస్తూ ఉండగానే కాంతం నా వెనకాల కొచ్చి, "ఇందాక మీరు తెచ్చిన గులాబి పువ్వు ఏక్కడ పెట్టారు" అన్నది.

అదేం, నీముందు బల్లమీద పళ్ళెములో కనబడటం లా" అన్నాను నేను ఆర్చుకు పోయిన గొంతుకతో.

ఎదురుగావున్న బల్లపై నున్న పువ్వును తీసుకొంటానికి ఆవిడ నాచుట్టూ తిరిగి పోయింది. అప్పుడే చాకలి మడత విప్పి కట్టడం మూలాన, చీర, గంజిబిగువున ఉండి నడుస్తుం టే రవ రవ శబ్దం అయింది. ఆవిడ తలకు రాచుకొన్న నూనె సంబంధమైన సువాసన నన్నూ నాకాంపోజిషన్ పుస్తకా లనూ ముట్టడేసింది.

శత్రువులు ముట్టడి వేసినా, సాధ్యమైనంత వరకు లొం గకపోవటం ధీరలక్షణంగదా అని అనుకొంటూ ఉండం

3

గానే ఆ ఇరువైపుస్తకాలు నావంక చూచినవి. ఆ ఇరువై ఒక్కమారు! విధి నెరవేర్చాలన్నమాటలు చెవులో రహస్యంగా వినిపించినాయి.

ఇంకా పదహేను పుస్తకాలున్నవి. తలఎత్తిచూద్దును గదా, కాంతం ఇంకా అద్దంముందే నుంచుని, తన సౌందర్యాన్ని చూచుకొని మురిసిపోతున్నది. నేనూ నవ్వుకొన్నాను.

"ఎందుకు నవ్వారు"

"ఊరికేనే"

"చెబుదురూ"

"ఏముంది చెబటానికీ, ఊరికేనే నవ్వాను" అని కలం విదిలించాను.

"అబ్బ! చెప్పరూ, ఎందుకు నవ్వారు."

"..........."

"అదిగో, మళ్ళీ నవ్వుతున్నారు... చెప్పరూ... అంత నవ్వు ఊరికేనే వస్తుందా?"

"చెప్పటంలా—ఎందుకూ లేదూ. నవ్వొచ్చిందినవ్వాను."

"..........."

"అబ్బ, ఎందుకమ్మా అంత నవ్వు?"

"ఏంచెప్పేది? ఏం కారణం లేదు."

"అట్లా కాదు, చెప్పాలె?"

"ఊరికేనే....."

"ఊఁ...అల్లాగేం? చెప్పాల...ఊఁ....తప్పదు...."

"వదులు, కలం వదిలేశెయ్యి"

"వదిలా, చెప్పండిమరి"

"నా తలలో......"

"ఆ, తలలో ఏమిటి?..."

"గులాబిపువ్వు..."

"అబ్బ, ఏమిటా విరగబడి నవ్వటం! తలలో గులాబి పువ్వు ఉంటె అట్లా నవ్వొస్తుందా?"

"మరేంజెప్పేది, గులాబిపువ్వును చూస్తే నవ్వొచ్చింది."

"ఆ, అల్లాగేం. చాల్లెండి గడుసుదనం, అసలుఏమిటో వుంది" అని అంటూ అద్దంలో చూచుకొని చెంపలు దిద్దుకొంది.

"నిజంగా, కొంతం ఆ గులాబిపువ్వును జూస్తే నవ్వొచ్చింది."

"చాల్లెండి మీ కవిత్వం. చెప్పకపోతే మిమ్మల్నిరాపుకోనివ్వను."

"కలం వదులు. ఇదిగో ఈ పుస్తకాలు దిద్దిందాకా ఉండు చెబుతాను,"

"అబ్బా! ఇప్పుడు చెప్పాలిసిందే"

"నీకు కోపంరాదుగదా?"

"కోపంలేదు, తాపంలేదు, చెప్పండి"

"మరీ...గులాబీ...పువ్వా..."

"అబ్బబ్బ, ఏమిటండీ ఆ విరగబడినవ్వటం. దేనికైనా కారణం ఉండాలె!"

"కారణం లేకే, బ్రహ్మాండమైన కారణం ఉంది"

"చెప్పండిమరి!"

"నీతలలో, ఆ నల్లటివెంట్రుకల మధ్యా..."

"గులాబిపువ్వుంది. అదేకాదు మీరంటం"

"కాదు."

"ఏమిటి మరి"

"ఆ నల్లటితుమ్మెద రెక్కలవంటి మృదువైన నున్నని నటువంటీ......"

"అబ్బబ్బ, ఏమిటండీగోల, తెలుగులో చెప్పండి."

"నల్లమేఘాలలో మెరుపు మెరుస్తున్నది."

"ఇస్సో, మీ కవిత్వం నాకర్థంగాదు"

"చెప్పేస్తాను ఉండు. నీతలలో ఒక తెల్ల వెంట్రుక మెరుస్తున్నది!—"

"ఓయబ్బ! ఈమాత్రానికేనా ఇంతనవ్వు. ఏదీ, తీసేద్దామంటే కనిపించటంలేదే? పోనీయండినాకేంతక్కువ?

"తక్కువ అనికాదు, వృద్ధాప్యంతొంగిచూస్తున్నది.

"అవునవును, కవిత్వంలో చెప్పాలిసొస్తే అంతే... చాల్లెండి, మీకవిత్వమూ మీరునూ..."

"ఉండు, నేను వ్రాసుకోవాలె"

ఇంకా పద్ధానుగు పుస్తకాలున్నవి. కాంతం మట్టుకు అద్దంముందు నుంచొని మళ్ళీ ఇంకోసారి కుచ్చెళ్ళు సద్దుకొని పమిట సవరించుకొంటున్నది. నేను ఒకసారి పుస్తకాలవంకం మరోసారి కాంతం వంకా చూచి తలొంచుకొని దిద్దట. సాగించాను. కాంతం అల్లాగే నిలవబడి అద్దంలో చూచుకొం. టున్నది. చెక్కిళ్ళు చిక్కనా గులాబిరంగులో మెరుస్తున్నవిం చెంపలపైని జుట్టు కొద్దిగా జారింది. తలలో నాలుగైదు వెంట్రుకలు నల్లటి ఆకాశంలో కనబడే మెరుపు తీగల్లాగ మెరుస్తున్నవి. తెల్లటిచీర, బ్రోచీ గులాబిపువ్వు మనోహ రంగా ఉన్నవి......సరే......పద్ధానుగు పుస్తకాలు అర గంటలో దిద్దుదామనుకొన్నాను. ఇంతలో కాంతం,

"ఏమండోయి" అన్నది అద్దంముందు నిలబడిఉండే.

"ఏమిటి?"

"ఇదేమిటి?" అన్నది కంపిస్తున్న గొంతుకతో.

"ఏ మొచ్చింది?"

"ఇల్లా ఒకమాటొచ్చి అద్దంలో చూడండి!"

"అద్దంలో నీకేం కనబడుతున్నది?"

"మీరు చూడండి తెలుస్తుంది."

"ఏమిటి చూశేది...అద్దంలో ముఖం కనబడుతుంది. నీముఖం నాకేం కొత్తది కాదు."

"అదిగాదండీ, చూడండి ఏదో...... తమాషాగానే ఉంది. ఇందాకటినుంచీ లేదా ఇప్పుడిల్లా కనపడటం ఏమిటి!

"ఎల్లా కనబడుతున్నదీ?...ఊరికే...ఏదో పెడతావు ...నాటకం! నా వ్రాతకు వచ్చింది ఇంతకూ?" అని తలెత్తి చూద్దునుగదా కాంతం వింతగా చూస్తున్నది అద్దంవంక. అటు జరిగి ఇటుజరిగి ఏమిటో పరీక్షిస్తున్నది. నేను ఎర్రసిరా కలం బల్లమీద పెట్టి.

"ఏమిటి అదీ!" అన్నాను.

"ఏమిటోనండీ రెండుముఖాలు కనిపిస్తున్నాయి"

"రెండుముఖాలా?"

"అవును రెండుముఖాలు!"

"నిజంగా వచ్చి చూడండి నామాట అబద్ధమైతే" అన్నది.

సరే, ఏమిటో సంగతి చూద్దామని లేచి వెళ్ళి అద్దం ముందు నిలబడ్డాను. కాంతం, "చూడండి నామాట అబద్ధమైతే" అని నాకు చెప్పితాను బల్లదగ్గర కెళ్ళింది. నేను అద్దంముందు నిలబడి చూశాను. ఏం విచిత్రం కనబడలేదు. చోటు మార్చి అటూ ఇటూ జరిగి నుంచొని, ముందుకెళ్ళి వెనక్కెళ్ళి అన్నివిధాల చూశాను. ఎక్కడా నాకు ముఖాలు కనిపించలేదు. ఇంతలో కాంతం బల్లదగ్గర జేరి పుస్తకాలు బోర్తిగా పెట్టేసి, కలం స్టాండులో పెట్టి, సిరాబుడ్డి పైనమూత పెడుతున్నది నేను చూచేసరికి.

"ఊఁ, తెలిసిందిలే వెళ్ళు."

"ఏమిటి తెలియటం, కనపడలా రెండుముఖాలూ

"ఉహూ, కనిపించలేదు. నాముఖమే నాకు కనిపించింది."

"అచ్చంగా ఒక్కమొగమే! బాగా చూడండీ"

"చాల్లే, చాలించు నాటకం."

అని విసుగ్గా అని మళ్ళీ కుర్చీలో కూలబడి పుస్తకం తీసి తప్పులు దిద్దటం సాగించాను.

"ఏమిటండీ...మీకు కనబడకపోవటం నాకళ్ళ కేమైనా ......ఏదీ చూడనీయండి మళ్లీ" అంటూ కాంతం అద్దం ముందుకుపోయి నిలుచున్నది.

"అదేమిటండీ, రెండుముఖాలూనూ, విడివిడిగా కనబడుతో ఉంటేనే,"అని కాంతం తెల్లపోయి చూడ్డం చూశాను నేను. ఆముఖ కవళికలు ఆ ముంగురుల చలనం అవీ నిజం చెప్పేమనిషి కున్నట్లే ఉన్నవి. భయం ఆమె కళ్లలో నుంచి తొంగిచూస్తున్నది. నేనూ కొంచెం భయపడ్డాను.తన నీడనుచూచి భయపడటం, తననీడలో రెండుముఖాలు కనబడటం ఏదో చెడ్డలక్షణం అని చిన్నప్పుడెక్కడో చదివిన జ్ఞాపకం. అందుకని నాకూ కొంచెంభయంవేసి,

"ఏమిటి నిజంగా రెండుముఖాల్లు బాగా కనిపిస్తుందా?"

"ఇక్కడ నుంచునిచూడండిమీరు నామాటలు అబద్ధం అయితే అవిగో ముఖాలు—ఒకటీ—రెండూ—విడివిడిగా కనుపిస్తూ ఉంటేనే" అన్నది.

నాకు ఏవో పిచ్చిఊహాలు పోయి ఒకక్షణంలో 'ఇదే మైనా నిజంగా చెడ్డలక్షణమా, లేకపోతే అద్దంలో ఏమైనా చెడ్డస్పిరిట్స్ దూరి ఇల్లా అల్లరిపెడుతున్నాయా?అనిపించింది. అప్రయత్నంగా లేచి వెళ్ళి అద్దం ముందు కాంతం వెనకాలె నుంచున్నాను.

చూశారా రెండుముఖాలు నామాట అబద్ధంఅంటిరే! నాకు భయమేస్తున్నదండీ, అంటూ కాంతం వెనక్కి జరిగింది నాకు దగ్గరసాగా.

అహా! రెండుముఖాలు ఏవీ అని నేను ఒకఅడుగు ముందుకు జరిగాను చూద్దామని.

కనపడటంలా అన్నది కాంతం.

నీముఖం అన్నాను నేను కోపంతో.

అవును, నెంబర్ టూ, మీ మొఖం అన్నది కాంతం వెనక్కి విరగబడి నవ్వుతూ—

## ప్రణయ కలహం

కాపరానికి వచ్చింది మొదలు ఇంత వరకూ ఒక్క సారయినా మా ఆవిడ ప్రణయ కోపం అభినయించ లేదు. ఆమాట నేను కావ్యాలలో చదవటం తరుచూ వినటం మూలాన మా ఆవిడిచేత ప్రణయకోపం పట్టించాలని బహు సరదాగా ఉంటూ ఉండేది. అడపా దడపా నేను"ఏం కాంతం, నీవు ఒక్కసారైనా ప్రణయకోపం పట్టావు కావు"

అని అంటూంటే ఆవిడ "ఎప్పుడో ఒకప్పుడు పడతా లెండి ఇప్పుడేం తొందరొచ్చింది" అని అంటూ ఉండటంమూలాన రోజులు గడిచి పోయినై యి. అంతేగాని పట్టుమని కూర్చుని శాస్త్రయుక్తంగా ఒక్క రోజైనా ప్రణయ కలహం జరిగించలేదు.

అనుకోటమే కాని శాస్త్రోక్తమైన ప్రణయ కలహం ఎట్లా జరపాలో నాకూ తెలియదు. నిజంమాటకు! ఆడదాన్ని చేసి ఆవిడను ఒక్కదాన్ని పట్టమంటే ఏంపడుతుంది. పాపం! అందుకని వాత్స్యాయన కామసూత్రాలు సంపాదించిప్రణయ కలహ విధానాన్ని గూర్చి ఆ సూత్రము చదివాను. శాస్త్ర కూ స్త విషయంగాదిది. సత్యనారాయణ వ్రతానికి చేయా లిసి నంత పనిఉంది.

నాయకుడు పూర్వాహ్ణమందు భోజనమయిన తరువాత చిలుకలను, గోరువంకలను మాట్లాడించాలట! మా పేటలకు చుట్టూ పర్ర భూములవటంవల్ల, చుట్టు ప్రక్కల ఎటు చూచినా మైలు మైలున్నర, దూరంలో చిలుకలు గోరువంకలు కనిపించవు.

శాస్త్రకారుడు విధించిన నియమాన్ని వదిలేయటం నాకేమాత్రం మనస్కరించలేదు. ఎంత కష్టమైనా సరే, శాస్త్ర యుక్తంగా ప్రణయ కలహం నిర్వహించాలను కొన్నాను. ఏదో పెద్ద వాళ్ళమైపోతున్నాము. ఇకమళ్ళీ పట్టచ్చామా! అందుకని ఫిరంగికి భోజనమైన తరువాత మాఆవిడ

4

ఈ ఎండలో ఎక్కడికి పోతారు, వద్దు అంటుంటే కూడా వినకుండా, నెత్తిన గుడ్డ వేసుకొని, నాలుగు మైళ్ళ దూరంలో నున్న కరిమీదకెళ్ళి తోటల్లో తిరిగి, ఎట్లాగయితేనేమి చిలుకలను గోరువంకలను మాట్లాడించి సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాను.

అటు తరువాత జరుగవలసిన కార్యక్రమాన్ని గురించి విచారించాను. తదంతే.....సంమార్జన, పుష్ప ప్రకరము, శయన రచనము.........ఇవి జరగాలిసినవి.

ఇవన్నీ ఒక్కొక్కటే క్రమంగా చేసుకొచ్చాను. అందులో శయన గృహాము సంచారిత సురభి ధూపనులు కల్గుదానిగా ఒనర్చవలయునన్న నియమాన్ని అనుసరించి, అర్ధణా ఊదొత్తులు కొని ఉంచాను.

రాత్రి భోజనానికి కూర్చున్నప్పుడే ఈ ప్రణయ కలహ విధానాన్ని గూర్చి అంతా ఆవిడకు తెలియజెప్పి, అద్దాన్ని జయప్రదంగా సాగించమని చెపుదామని అనుకొన్నాను కాని, "ప్రత్త"కు అనగా వివాహాముచేయబడిన స్త్రీకి కామశాస్త్ర గ్రహణాధికారము లేదు. అంచేత మాట్లాడక ఊరుకొన్నాను.

ఒకటి రెండుసార్లు కాంతం "ఏమిటండీ భోజనం చేసేటప్పుడు కూడా ఒకటే ఆలోచన" అని అన్నది కాని నేను మాట్లాడలేదు.

ఇక శయన రచన చెయ్యాలి. పుస్తకం తెరిచి బల్లమీద పెట్టుకొని ఒక్కొక్కవిషయమే చదవటం, ఆ ప్రకా

రం చెయ్యటం!

శయన మందిరము "ఖట్వాశ్రయ ప్రతిపాదితాస్తరణ తూలికానులంకృతో ఒప్పియున్నదై యుండా" లన్నాడు. ఆవాక్యంలో ఒక్క ముక్క నాకర్థం కాలేదు. దగ్గరలో ఎవ్వరూ సంస్కృతం చదువుకొన్న వాళ్ళు లేరు. సరే ఏం జేసేది? ఆ విషయం వదిలేశాను.

హంసతూలికా తల్పముపైన శయనరచన చేయాలె. మా హంసతూలికా తల్పము—అంటే మా మామూలుపట్టె మంచంపైనే తెల్లటి దుప్పటి ఒకటి పరచాను.

ఇక శిరోభాగే కూర్చస్థానమ్—అని ఉంది, మొదట సరిగ్గా అర్థంకాలేదు. "కూర్చ" అన్న మాట ఎక్కడో విన్నట్లు జ్ఞాపకం. ప్రణయ కలహంలో కూర్చ ఎందుకబ్బా అనుకొని క్రింద వ్రాసిన టీకాలో చూద్దును కదా. ప్రాణం తేచొచ్చింది. కూర్చస్థానమ్ అంటే కుర్చీట! బతికించాడు బంగారు తండ్రి శాస్త్రకారుడు సరిగ్గా మా హంసతూలికా తల్పానికి శిరోభాగంలోనే ఉంది పేముకుర్చీ. ఇప్పటికి శయన రచన పూర్తి అయింది.

తరువాత శయనమందిరాన్ని అలంకరించమన్నాడు. ఒక వేదిక ఉండాలట! పాపం ఆ కాలంలో బల్లలు లేవు కామాలు, వేదిక అన్నాడు. మాకేం కర్మం మాగదిలో మంచి టేబిల్ ఉంది.

నిచోళావగుంఠితమైన వీణ, చిత్రఫలకం, పుస్తం,

పూలమాలలూ, ఉండాలట! అయితే వీణకు బదులు మా అమ్మాయి ఫిడేలుంది. చిత్రఫలకం లేకపోయినా, చిత్రపటాలున్నాయి. "పుస్తకం" అన్నాడు. ఒక పుస్తక మేమి కర్మం! ఒక వంద పుస్తకాలు, కాంపోజిషన్ పుస్తకాలతో కలుపుకొని ఉన్నాయి, మా గదిలో!

ఇంక ఒక అరగంటలో కాంతం ఇల్లు సర్దుకొని వస్తుంది. నేను కుర్చీలో కూర్చుని ప్రణయకలహ విధానాన్ని గురించి మరోమారు పఠించి ముఖ్య విషయాలను అనుక్రమణికగా కాగితం మీద వ్రాసుకొన్నాను.

ప్రణయ కలహంలో ప్రథమ ఘట్టం ప్రియురాలికి కోపం తెప్పించటం.....ఏదైనా. సవతిపేరు ఎత్తటము సవతి పేరు ఉచ్చరింపక పోయినా, సూచనగా సవతిని ఉద్దేశించి చేయునట్టి తత్ప్రశంసా పరమగు సంభాషణాదికమూ, లేక అట్టి సవతికి తాంబూలమును పంపుట మొదలగునవి ప్రియురాలు సహింప రానివనియు, ఇవియే ప్రణయ కలహాలకు కారణాలనియు, సూత్రార్థము.

కోపం వచ్చిన తరువాత, నాయక "వాచే" మాటలు చేతనూ, కార్యతః కార్యముల చేతను కలహ మొనర్చ వలయును. తల వెండ్రుకలను విదల్చుట, నాయకుని శిరోజములను పట్టుకొని కొట్టుట, శయనము నుండి లేచి భూమి మీదపడి దొర్లుట, ధరించిన పుష్పములనూ, మాలికలనూ, సొమ్ములనూ, విచ్చివేయుటా, ఇత్యాదులుచేయగా వలయు

ను అని రెండో సూత్రం. ఇది అంతకష్టమైన పనిగాదు కోపం ఉంటూ చెప్పాలిగాని ఇంతకంటె నెయ్యిగొల్లు విలువైన పనులు జేస్తుంది మా కాంతం.

ఇక మూడో ఘట్టంలో అనునయమూ శయనారోహణమూ, అపరాధ స్మరణా తదుపరి పాదతాడనం, అనంతరం అశ్రుకరణము, ద్వారదేశగమనం, యుక్తితోను నీయమూనమ్, ప్రసన్నత, ఆలింగనం, చివరకు సంయోగం ఇవి జరగాలిసినవిధులు. అన్నింటికీలోనూ, ప్రథమ ఘట్టంలో ప్రణయకలహానికి కారణం కల్పించటంలోనే ఉంది కష్టం అంతా. మహారాజులకు అష్టభార్యలో అష్టాదశ భార్యలో ఉంటారు. కాబట్టి సవతి ప్రశంసచేయటం సంభవమౌతుంది. ఏదో ఒక్కగాను ఒక్క ఆవిడతో దేవులాడుతూ ఉన్న ఈసామాన్యజీవికిఅదెట్లా సాధ్యంఅవుతుంది. పోనీ, ఒక పరస్త్రీని గురించి ప్రశంసించి, కలహాన్ని అంకురింపజేయ వచ్చునుగాని, దాని తరువాత మాఆవిడ జేసే హంగామాకు మాకు ఈ సూత్రకారుడు బాధ్యుడవుతాడా?

ఇది ఒక పెద్ద సమస్య అయిపోయిందే ఎట్లాగా అని ఆలోచిస్తున్నా. ఇంతలో గాజుల చప్పుడు వినపడ్డది గుండె ఝల్లుమన్నది. వచ్చిందికాంతం, ఒకచేత్తో వెండిమర చెంబుతో మంచినీళ్ళు రెండోచేత్తోపళ్ళెంలో రవ్వలడ్డూలూ పట్టకొని.........

కొంతమంది, ప్రియురాలిని రమా రమ్యాకారయనీ, చతుర వచనయనీ, చారు చికురయనీ, విమలాల్యాలంకార

యనీ, ఏమేమోవర్ణిస్తారు. కాని మా ఆవిడ మామూలుమా మిడిచిగురు చీరతోనేవచ్చేసింది. ఉజ్వల నయనాలు లేవు.మా మూలుకళ్ళే. చిక్కని చెక్కిళ్ళే. అయినా విరక్తిజెందక ప్రణయకలహం జరపటానికి నిశ్చయించుకొన్నాను.

ఆవిడ వచ్చేయటంతోనె నేనుఎదురుగావెళ్ళి. "ప్రియురాలా, నీకై పరితపిస్తున్నాను. నేనిట్లుందునని నీవెరంగియు, ఎందుకింత ఆలస్యము చేసినావు?" అనిచెప్పాలె! సరే అట్లాగే చెప్పాను.

కాంతానికి ఇంకా తెలియదు. ఆరోజున జరగాలిసిన కార్యక్రమము. అంచేత నామాటలు విని, "అట్లామాట్లాడుతున్నారేం? వెకిలి చేష్టలు చేయకండి ఎవరైనా వింటే నవ్వుతారు!" అన్నది.

"ఇంత ఆలస్యం చేశావేం?" అన్నాను.

"ఆలస్యం ఏముంది? మామూలుగా ఇల్లు సర్దుకొని పిల్లలను నిద్రపుచ్చుకొని, వచ్చాను."

"చిలుకలను, గోరువంకలనూ మాట్లాడించావా ? సాయింత్రం?" అన్నాను కామ సూత్రాలలో ప్రియురాలు సాయింత్రం చేయదగిన విధులను జ్ఞాపకం చేసుకొంటూ.

"చిలుక లేమిటి? గోరువంక లేమిటి? ఏమిటో అసందర్భం ప్రలాపాలు నాకర్థం కావటంలేదు" అన్నది.

"ఏంలేదు కాంతం. అల్లా తెల్లపోయి చూస్తావెందుకు?

నేనుమామూలు మనిషినే! ఊరికేనేనప్పుడూ అల్లాగన్నాను.''

''మన పిల్లలే మనకు చిలుకలూ, గోరువంకలూ, ఇప్పటిదాకా వాళ్ళతో మాట్లాడుతునే ఉన్నాను.''

''ఇటురా, కూర్చో.''

వచ్చి నాదగ్గిరే కూర్చుంది శయ్యపైన. ఇక ప్రణయ కలహానికి కారణం కల్పించాలి. ఉన్న కష్టమంతా అక్కడే. సవతిఅనిగాని పర స్త్రీతో పరిచయంఅనిగాని ప్రశంసించానో కొంప మునిగిందే. లేనిపోని రగడఎందుకని ఆలోచించిఇంకో విధంగా ప్రణయ కలహానికి కారణం కల్పించాను.

''కాంతం?...''

''ఊం......''

''మన సీతను చూడటానికీ...''

''సీత ఎవరు?.........''

''సీత నెరగవు? మా మేనమామ కూతురు.''

''ఆఁ...అయితే?''

''సీతను చూడటానికి రేపు వెళుతున్నాను.''

''వెళ్ళండి నా ఆజ్ఞ ఎందుకు?''

''ఆజ్ఞకోసం కాదు ఊరికే చెబుతున్నాను. సీతచాలా చక్కంది సుమా? దాన్ని నే నసలు పెండ్లాడుదా మనుకొన్నాను. దైవం అనుకూలించక పోవటంమూలాన పడింది కాదు.''

''ఇప్పుడు మటుకేం? నలుగురు పిల్లలతో కూడవస్తుంది కనుక్కోండి.''

"అదికాదు నేననటం అదిచక్కని దన్నమాట ఒప్పుకొంటావా?"

"అయ్యో, కాకేం! చక్కని చుక్క ఒక్కజాతిలో పుట్టిన వాళ్ళెగా మీరంతా."

సీత చక్కదనాన్ని గూర్చి ప్రశంసా వాక్యాలు పలికి కాంతం సౌందర్యవతి కాదని కాస్త ఎత్తి పొడిస్తేగా కోపం తప్పకవస్తుంది. తదనంతరం ప్రణయకలహం అవిచ్ఛిన్నంగా జరపొచ్చునని తోచింది.

"నలుగురిపిల్లలతల్లి అయినా, ఆమెశరీరచ్ఛాయఒక్కవన్నెకూడా తగ్గలేదు. చెక్కిళ్ళు చిక్కలేదు. కేశములూ...

"చాలు చాలు ఇక అక్కడ ఆగండి.

"ఆమె చంపల నునుపూ......ఆ ముంగురులు..."

"ఏం మాటలవి? పరాయి ఆడదాన్ని గురించి ఇటు వంటి మాటలు వింటుంటె నాకు అరికాలుమంట..."

"వచ్చిందా కోపం?..."

"ఆc..."

"అయితే చప్పున లేచి క్రిందపడు నేలపైన మెల్లగా సుమీ? ఇక జరిపేద్దాం ప్రణయకలహం" అన్నాను నేను తలపెట్టిన కార్యం అవిఘ్నంగా జరుగుతున్నదన్న సంతోషంతో పొంగిపోతూ.

"మీ కేమైన మతిపోయిందా? అట్లా తోస్తారేమిటి?

నాకేం కర్మం క్రింద పడ్డదాకా ?'' అన్నది కాంతం కరుకు కత్తి విదిలింపుల్లాగ మెరుస్తున్న కళ్ళతో.''

''అదికాదు సత్యభామ, వరూధిని, ప్రభావతి మొదలైన నాయికలు ప్రణయకోపం వచ్చినప్పుడల్లా క్రిందపడ్డారు. నీవు అల్లాగ పడకపోతే ప్రణయకలహం ఎట్లాజరుగుతుంది?''

''జరగకపోతే, ఇప్పుడేమి ఉపద్రవం? మతిపోయిన చేష్టలన్నినూ! తోస్తారేమిటి ? ...ఇవ్వాళ...మీకేదో... ఉండండి, నాపక్కమీదికి నేను వెళ్ళిపోతాను.''

''పోమరి.........''

''ఏమిటబ్బా ఇవ్వాళా!......ఆ దొరల సహవాసం చేస్తున్నారు? క్లబ్బులో పొద్దు పోయిందాకా ఉంటున్నారు. ఏం కర్మమో...'' అనుకొంటూ మరోప్రక్కమీది కెళ్ళి పడుకుంది.

ఇంతవరకూ ప్రణయకలహం జయప్రదంగా జరిగింది. రెండో ఘట్టంలో నాయిక వివృద్ధక్రోధయైనూలికలనూ, అలంకారాలనూ, విచ్చి వేయాలె. కోపం వచ్చిందిగదాఆ పనులు చేయకపోతుందా అనుకొన్నానుగాని, ముడుచుకొని మెదలకుండా పడుకొంది. ఆమె జుట్టులోనున్న గులాబి పువ్వు మాత్రంనన్ను జూచికన్నెర్ర జేసింది. నేనేవెళ్ళి ఆపువ్వునుతీసి ముక్కలు ముక్కలు జేసి, క్రింద వెదజల్లాను.

తదుపరి కాంతం ప్రక్కనే కూర్చుని, ''కాంతం చూడూ నాతప్పు క్షమించు, నీవే చక్కని దానివి. పిల్లల

తల్లివైనా, నీ చెక్కిళ్ళపై నునుపు తగ్గలేదు. రజితకేశములు అట్టేలేవు. శరత్కాలమునందలి పూర్ణచంద్రునితో సమానమైన ముఖముగల సుందరీ, ఓతరుణ వయస్సుగల విలాసినీ, లెమ్ము. శయనారోహణము చేయుము'' అని మళ్ళా పుస్తకంలో మాటలు అన్నాను. కాంతం, నావంక వెర్రిచూపులు చూడటం సాగించింది. ఆమె భయంచేత కంపిస్తూ ఉన్నట్లు నాకు తోచింది.

''ఏం భయములేదు కాంతం. నాప్రక్కమీదికిరా'' అన్నాను.

''ఏమిటో వికారం! నేనేం జేసాను. ఇందాక నెట్టివేయట మేమిటి? ఇప్పుడు మళ్ళీ ఈబ్రతిమి లాడటంఏమిటి?''

''అట్లా నేనెప్పటికీ చేయనులే. నా. లేచిరా. నా తప్పును గమనించక క్షమించు.''

''నేను క్షమించడం ఎందుకు ? ఏమిటూ గోలా ? సరే పదండి.

ఉండు...ఉండు. లేవబోకు. లేవద్దు. ! ఉంటే ప్రణయ కలహం క్రమరీత్యా జరగాలె. నీవిప్పుడో పనిచెయ్యాలె.''

''ఏమిటది ?...''

''నేను చేసిన అపరాధాన్ని తల్చుకొని, నావీపు నడుమ, ఏక్కడైనా ఒక్కతన్ను తన్నాలె కొంచెం మెల్లగా. అంతటితో ప్రణయ కలహానికి ముదురుపాకం వస్తుంది. అటు తరువాత నేను బ్రతిమిలాడటం, నీవు కొంతసేపు అనుకరణం

చేయటం తదుపరి శయనారోహణం ఇది జరగాలసిన విధి."

"ఇంతపనీ జరగాలసిందే ఇప్పుడు!"

"లేకపోతే ప్రణయ కలహం పూర్తిగాదు."

"ఇట్లా జరగాలని ఎక్కడుంది?"

"పుస్తకంలో ఇదిగో కామసూత్రాలు. అందుకనే ఈ అవస్థంతా నేను పడటం! ఊం...ఒక్క చిన్న మెల్లగా తందూ?"

"అదో, సంగతి మహారాజా? నేను వెర్రిబాగుల దాన్ని. ఇందాకటినుంచీ మీకు మతి చెడిందేమోనని హడలి పోతున్నాను. అడ్డమైన పుస్తకాలూచదివి నన్నేడిపిస్తున్నారా. వెధవ వెకిలి పనులన్నీ నన్ను చేయమంటూ?"

అయితే ఏమంటావు? ప్రణయ కలహం ఇందాక వచ్చింది. ఇక సగంలో ఉంది. పాడు జేస్తావా?"అన్నాను అప్రయత్నంగా జీరబోయిన గొంతుకతో.

"ప్రణయ కలహం జరపాలా? జరుపుతాను? జరుపుతాను! ఇల్లా రండి."

అని పిలిచి అల్లరి కుర్రాణ్ణి దండించే ఉపాధ్యాయుడు పోజులో నాచెవి తమ్మె పట్టుకొని నులేసి ఇక ఎన్నడూ?..."

"అబ్బా!..."

"ఇక ఎన్నడూ, ఈలా.............ఏం?"

"ఊం...హా...అబ్బ..."

"మరి యెన్నడూ చేయరు గద!"

"ఉహుఁఉహుఁ............వదులూ."

# గట్టినిశ్చయం.

కాంతం నేనూ కూర్చొని లెక్కలు చూచుకొనేసరికి ఆ నెల అయిన కర్చు ఏ నెలా కాలేదని తేలింది. కారణం, బంధువుల తాకిడి. కాంతం అన్నదీ "చూడండి మీరు ప్రతి వాడ్ని భోజనానికని యింటికి తీసుకొనిరాకండి! కాస్త మంచి మాట మాట్లాడితేసరి ఆయన మీకు పరమమిత్రుడౌతాడు. ఇక వాడికి అల్లుడిలాగ ఇంట్లో భోజనం, బయట కాఫీహోటలులో టిఫిన్! ఇదీ వరస. మీ కథలు బాగున్నాయని ఎవరైనా అనటం తరువాయి వాడి కాఫీ కర్చు అంతా ఆ పూటకు మీదన్నమాటే! ఇలా అయితే సంసారంగడవదు. తరువాయి మీయిష్టం. ఇక ఎవరినీ భోజనానికి పిలువకూడదని గట్టిగా నిశ్చయించుకోండి" అన్నది కాంతం నేను మేడమెట్లు ఎక్కుతుంటే.

ఇంతలో ఎవరో ఒక బ్రాహ్మణుడు మూట ఒకటి చంకను పెట్టుకొని "ఇదేనా కాంతమ్మగారి ఇల్లు" అని అడిగాడు మాయింటి ముందు నుంచుని. "ఈ యింట్లో వెంకట్రావుగారు అద్దెకున్నారు" అన్నాను నేను.

కాంతమ్మగారెవరు? వారిక్కడ లేరా అన్నాడు" ఆయన ఆతురతతో.

ఆవిడ నవ్వుకొంటూ "రండి. ఇదే లెండి. నా పేరే కాంతమ్మ. ఎందుకండీ" అన్నది.

అమ్మాయీ నువ్వేనా? నాడటంతోనే అనుకొన్నా. రత్నం చీకట్లో ఉంచినా మెరుస్తూనే ఉంటుంది.'

'తమరు ఎవరు? ఏమ్కావాలి?'

"చెబుతాలే అమ్మా. రామారావుగారు చెప్పారు. తమ సంగతి. మీరు సంపన్న గృహస్థులనీ, ఉదారవంతులనీ నడి శ్రావణమాసంలో కొత్తనీటితో నిండి, బెక బెక అరుస్తూ ఉన్న అనేకరకముల్లైన పశువంటి మండూకముల చే నిండియున్న ఒకమాంచి తటాకంలాగ తమ గృహం ప్రకాశిస్తూ ఉంటూందని విని.............."

మా ఆవిడ మొఖం చేటంతలయింది. సంతోషంతో తొణకసలాడుతూన్న ముఖంతో అల్లాగే నుంచుని చూస్తోంది.

"అమ్మాయీ, నేనేమో చెబుతున్నానని పొగుడుతున్నానని అనుకోకు. రామారావుగారి వలన మీ సంగతి అంతా విన్నాను. మీ అనుకూలదాంపత్యం, సిరి, సంపదా, మీ దైవభక్తి...అంతా బంగారానికి సువాసన అబ్బినరీతి... ఆ పరమేశ్వరుని అనుగ్రహం. అమ్మా" అన్నాడు.

"బాబుగారూ, మీరు సరేవచ్చారు? బాగానేవుంది. తమకేంకావాలె! బీదవాళ్ళం మాతో మీబోటి సద్బ్రాహ్మణులకు ఏంపనుందో నేనూహించ లేకుండా ఉన్నాను" అన్నది ఆవిడ.

"అమ్మాయి, నీవు అల్లా గౌరవించటం నీయొక్క సుగుణములు ఇటువంటివని చెపుతున్నానే కాని మరోటి కాదు. నమ్రత అనేదిఉన్నదే అమ్మా, అది ఎటువంటివారి కైనా భూషణమే అవుతూవున్నది. ఒక పుష్పవనములో మాంచి గోముగా పెరిగినదై కమ్మనివాసనతో కూడినపుష్ప ములూ తియ్యని ఫలములూ ఉండుటచేత, వంగినటువంటిదై యున్నా, వంగినా భారముచే కలిగిన విసుగునుగాక, కేవల మూన్నా, నమ్రత నేసూచిస్తూ, వివిధములైన పక్షిజాతులకు ఆశ్రయమిస్తూ, ఉన్న మామిడిగున్న ఏలాగంటి సౌశీల్యాన్ని వ్యక్తపరుస్తుందో, అల్లాటిది మీసౌశీల్యము" అన్నాడాయన.

ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ "బాబూ ఏదో పెద్దల ఆశీర్వాదము. అయితే నేను లోపలికివెళ్ళాలి. తమరు వచ్చినపనేదో సెలవివ్వాలి."

"ఏబ్బే ఏమీలేదండీ-మిమ్ములను ఏమీ కోరటానికి గాని యాచనకుగాని రాలేదు. రామారావుగారి ద్వారా సంపన్న గృహస్థులు మీరు, ఆమాటవిని మీదర్శనంచేసి వెడదాం అని వచ్చాను. అంతేకాని మరోటికాదు."

'బాబూగారూమీరు మధ్యాహ్నం భోజనానంతరం రండి. శాస్త్ర పురాణకాలక్షేపంచేద్దురుగాని. ఇప్పటికిసెలవ.'

"ఒక్కమాట అమ్మాయీ విన్నావామాంచి సౌంద ర్యాది విలాసములతో ఒప్పుతున్నటువంటి వస్తువును చూ శామాఅంటే పంచభక్ష్య పరమాన్నాలతో భోజనంచేసినట్లే ఉంటున్నది. ఇపుడు రామారావుగారి ఇల్లుచూడండి. భార్య

జబ్బుమనిషి. పిల్లలులేరు. పైగా ఆ గదిలో ముసలిది, ఆయన తల్లి కాబోలు. తల్లిని 'మాతృదేవోభవ' అన్నాడు. భ్రాజించచ వలసిందే కాని పిల్లజెల్ల లేని కొంపలో భోజనం అంటే అదే మిటో నట్టడవిలో కూడుతిన్నట్టుంటుంది. అప్పనా...... అమ్మాయీ అదీ సంగతి. ఇప్పుడు మీ గృహము చూడండి. ఎంత ఆహ్లాదకరంగా ఉందో. పేరుపొంది, కీర్తిని విస్తారం గడించినట్టి మాంచి చిత్రకారులచే చిత్రింపబడిన ఉత్తమమైన చిత్రములచే అలంకరింపబడిన దివ్య సౌధములాగ ఉంది కాదు మీఇల్లు."

'ఏముందండీ మాఇంట్లో, ఇంటినిండా గుడ్డపేలికలూ, పేడబొమ్మలూ, దిశిమొలతో నున్న ఆపిల్లలూనూ'

'ఆ ఆ. దిశిమొలలే సజీవమైన చిత్రాలు. అక్కడేఉంది, ఆపిల్లల వలననే ఈ యిల్లు సజీవమైన చిత్రశాల అయింది'

"ఏదోలెండి పెద్దల ఆశీర్వచనము. అయితే బాబూ తమ దేవూరు?"

'మాది తెనాలివద్ద కుంచవరం'

'తెనాలి తరుచూ వస్తుంటారా?'

"ఆ తరుచూ ఏమిటి, ప్రొద్దున లేస్తే తెనాలిరాకతప్పదు. ఆకుకూ, కూరకూ, మందుకూ, మాకుకూనూ."

'మందెవరికి బాబూ?'

"నాకు కాదమ్మా. మాముసలిది ఈమధ్య మాచెడ్డ జబ్బుపడ్డది. బ్రతుకుతుందనుకోలేదు. తెనాలిలో ఒక డాక్టరు

గారున్నారమ్మా. చిన్నవాడే కాని ఏమి అనుభవం ! ఏమి ఓపికా! ఆయన నేదానికి ప్రాణదానం చేశారు. గంపెడు సంసారం నాదీనీ! అది తప్పితే ఇంట్లో గంగపోశే వాళ్లు లేరు ! ఆ మహానుభావుని దయవల్ల మళ్ళీ బ్రతికి బట్టగట్టింది, ఆయనకు చెయ్యెత్తి దణ్ణంపెట్టని రోజు లేదు ! చల్లనివేళ జ్ఞాపకం వచ్చాడమ్మా శ్రీరామమూర్తిగారు !"

"ఏరా తమ్ముడే!...మా తమ్ముడేనండీ ఆయన !" అన్నది. మా ఆపడ పొంగిపోతున్న సంతోషాన్ని ఆపుకో లేకుండా.

ఆయనకూడా వెనక్కు విరుచుకొనిబడి నోరు తెరిచి ఒక్క అరనిమిషం అల్లాగఉండి "అల్లాగ అమ్మా" అని అన్నాడు, తెప్పరిల్లి. 'మా తమ్ముడే' అన్నది మళ్ళీ ఈవిడ.

"చిత్తం. ఇహ ఎందుకూ' తెలిసింది! గులాబీ మొక్క ఎక్కడవున్నా ఒకే మోస్తరు పూలు పూస్తుంది. ఒకేరకం సువాసన! నాతల్లీ...ఎంత సుదినం ఇవ్వాళ!........."

'అమ్మాయీ, నీవూ ఆయనా ఒక్కతల్లిబిడ్డలే కాదూ?'

'ఆ. ఒక్కతల్లి బిడ్డలం' అని అంది కాంతం గర్వంగా.

'ఆహా! ఆ తల్లి సుకృతం. యీలాంటి సంతానాన్ని కనటం. మీ అమ్మ కడుపు చలవదనమమ్మా ఇదంతా. ఆమె నిజంగా మహాపుణ్యాత్మురాలు.'

'కాబట్టే, పాతికేళ్ళకే పరలోకానికి.——'అన్నది.

"అల్లాగ అమ్మా పాపం.........ఇప్పుడు ఉండి మీ

తమ్ముడిగార్ని సర్వజనులూ మెచ్చుకొంటూ వుండడం, సర్వ వృద్ధులూ ఉండటం, ప్రతివాడూ కృతజ్ఞతతో బీదలపాలిట దేవుడని, ఆయనకు నమస్కారంచేస్తూ ఉండటం, ఆవిడవుండి చూస్తె ఆ మాతృ హృదయం ఎంత సంతోషించేదో! సి సంసారం—నీ ఆనందం కూడా చూడకుండా పోయింది కాబోలు ఆ తల్లి!'' అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

'ఆ' అన్నది కాంతం చెమ్మగిల్లిన నేత్రాలతో.

అప్పటికే తొమ్మిదైంది. ఆయన ఆ ప్తబంధువులాగ, పిల్లల అందరి పేర్లూ అడిగి తెలుసుకొని, అందరికీ దీవించి ''ఇక వెడతానమ్మా'' అన్నాడు,

'మీరు ఈ పూట ఇక్కడే దేవతార్చన చేయాలండీ' అన్నది కాంతం.

'ఎందుకులే అమ్మా. రామారావుగారు ఏమైనా అను కొంటారు.'

''ఏమనుకోరు లెండి. మీరు తప్పక ఇక్కడే ఉండి పోవాలె. మనమంతా గుంటూరుజిల్లా వాళ్ళము. అందులో మీరుసత్పురుషులున్నూ, చదువుకొన్నవారున్నూ, పెద్దలూ తప్పక ఇక్కడే దేవుతార్చన తప్పదు.''

''అమ్మాయీ'' నీవు బంధువులకంటే ఎక్కువగా కుమార్తెవలె ఆదరిస్తున్నావు. నీ మనస్సుకు కష్టం కలుగ జెయ్యటం ఎందుకూ. సరే—కాలువ ఎటువైపమ్మా? మూట ఇక్కడ పెట్టుకోనా?''

6

ఈ రోడ్డే వెళ్ళండి, కాలువ కనుపిస్తుంది. సంధ్యావందనం కాలువలో చాలసేపు చేయకండేం. వారుమళ్ళీ కచ్చేరికి వెళ్ళాలె.'

'ఎంతో సేపా, రెండు బుటకలువేసి రెండు నిమిట్లో రానూ!'

కాంతంపైన గెత్తుకుంటూ పైకొచ్చి, 'చూడండి, సద్బ్రాహ్మణుడు చదువుకొన్నవాడూ, వేదం అవీ చదువుకొన్నాడనుకొంటూ, మనవేపు వాడే, మనవాడినీ, మా చెల్లెళ్ళనూ అందరినీ ఎరుగునట!'

'అయితే...'

'ఆయన మన ఇంటికి వస్తే, దేవతార్చన ఇక్కడే చేసుకోవాల్సింది, అన్నాను.

'ఎవరో టోపి వేశాడు!'

'చాల్లే ఊరుకోండి, కళ్ళుపోతాయి. మంచిబ్రాహ్మణ్ణి ఏమైనా అనేరు. పిల్లలగలవాళ్ళం మనం...'

'సరే నే నిప్పుడు చేయాల్సిం దేమిటి ?'

''కొంచెం బజారు కెళ్ళి...శనివారమేగా—కూరలూ, అవీ, తమలపాకులు, వక్కలు ఇంట్లో ఉన్నాయి లెండి. చూడండి ఒక్క పరక నాజూకు పసంపు......ఆ...విన్నారా ?......కాస్త మంచిరకం తీసుకు రండి... ... ... .........చూడండి......మిమ్మల్నే...ఒక్కమాట దారిలో సోమాయితో, ఒకశేరు పాలు కావాలని చెప్పండి!''

"కూరలు తేవటానికి డబ్బులేదే!"

"ఎక్కడైనా అప్పుజేసి అయినాసరే ... తప్పదు."

"ఇందాక మనం అనుకొన్న మాట ఏమిటి? నీవు ఇల్లాగా......"

"ఆ నెక్కు మాట్లాడు కుందాం లెండి. నాకు వంటింట్లో పనుంది. మీరు వెంటనే బజారు కెళ్ళండి నా మాటవిని. ఏ స్నేహితుడితోనో మాట్లాడుతూ కూర్చోకండి. వేగిరం రావాలె. చూడండీ, పసిదాన్ని చంక వేసుకొని పోరాదూ బజారు కేగా! నేను ఇంట్లో పని వేగిరం చేసుకోవాలె."

ఈ మాటవినేసరికి వళ్ళు మండిపోయింది. ఉత్తరీయం ఝూడించి పైన వేసికొనితిరిగి చూడకుండా గుమ్మందాటాను.

## కోర్టులో కాంతం

ఇంటికి వచ్చాను. కోపైనా విడువలేదు. నలుగురు పిల్లలూ కమ్ముకున్నారు, ఒక్కసారిగా. "అమ్మకొట్టింది నాన్నా" అని చిన్నదీ, "అమ్మకొత్తింది" అని దాని తరువాత పుట్టిన నాలుగేండ్ల మగపిల్లవాడు, "అమ్మ ఊమ్ ఊమ్ ము, అ" అని వాడితమ్ముడు రెండేండ్ల వెధవ అనటమే కాకుండ ఆ పసిముండ కూడా చేతులెత్తి ఏదో పెద్ద ఫిర్యాదు చేసే దాని లాగా బొబ్బలు పెట్టటం సాగించింది.

నేను గుమ్మంలో కాలు పెట్టటంతోనే ఒక్కపెట్టున అందరూ ఇల్లా కంప్లెంటులు దాఖలు చేసే సరికి నాకు గుండె గుభేలు మన్నది. రోజూ ఈనాటకం మామూలే అయినా పది నిమిషాలలో పని తెముల్చుకొని పై ఉత్తరీయంతో బైట పడటానికి అవకాశం ఉండేది. ఆ రోజున అట్లా వీలు లేదు. "పైలు ఎక్కువైందిరా భగవంతుడా" అనికొని, బడిపంతులు వేషాన్ని మార్చి మేడపైకివెళ్ళి దిండుకు జేరగిలబడి చిరిచాపపైన కూర్చున్నాను.

అది మా కోర్టు. నేనే న్యాయమూర్తిని. న్యాయమూర్తి నేకాదు. నేను సామ్రాట్టును. చక్రవర్తిని. నాఆజ్ఞను తిరస్కరించేవాళ్ళు లేరు. నిరంకుశాధికారం చెలాయించే మహాప్రభువును, నా రాజ్యము ప్రేమ రాజ్యము. అల్లాంటి సమయంలో ఇటువంటి భావాలే నాజీవితాన్ని మధురంగా జేసేవి. మిగిలిన జీవిత మంతా బానిస జీవితమే. అయితే జీవితంలో అల్లాంటి ఒక్కనిమిషానికి ఇరవై ఏండ్ల సామాన్య జీవితానికున్న దానికంటె ఎక్కువ విలువ ఉన్నది.

ఊహాతో కూడిన ఈ మాధుర్యాన్ని వదలిపెట్టిఅసలు విషయానికొస్తే ఈ చక్రవర్తి చిరిచాప మీద కూర్చున్నాడేమాలంటే అనొచ్చు. మొగల్ చక్రవర్తులు అల్లాగే కూర్చునే వారని నా సమాధానం. అయితే వాళ్ళు రత్నకంబళములపై పట్టు పరుపులపై కూర్చున్నారు. నే నేదో ఈ చినిగి పోయిన చిరుచాప మీద కూర్చున్నాను.

ఈ న్యాయాధికారి వళ్ళో ఎడ పిల్లవాడు కూర్చున్నాడు. ఒకపక్కన చిన్నఅమ్మాయి కూర్చున్నది. వెనకాల పాలుతాగేది చేరి ఈ చక్రవర్తి నెత్తిమీద తన చిన్న చేతులతో దరవులాగ కొట్టుతున్నది. చేతులో వెండి గ్లాసుతో కాఫీ పట్టుకొని ముద్దాయి నిలువబడ్డది కోర్టువారి ఎదుట గ్లాసు అందుకొని కాఫీతాగేశాను.

చిన్నది ఏడుస్తూనే ఉంది ఇంత సేపూ. "ఏమిటే అమ్మా" అని న్యాయ విచారణకు ఉపక్రమించాను.

ఈమాట వినేసరికీ అందరికీ ఒక్కసారి మళ్ళీ దుఃఖం వచ్చింది. కాస్త ఊరుకోండని అందరినీ ఊరుకో బెట్టాను. పెద్దది దుఃఖాన్ని దిగమింగి బుడ్డమూతి పెట్టుకొని కొంచెం దూరంగా కూర్చుంది. చూస్తే ఏదో అందరికీ తలానాలుగూ తగిలి నట్టున్నవి ముద్దాయి శాస్త్రరీతిగానే పాలుతాగేదాన్ని ఎత్తుకొని కోర్టువారి ఎదుట నిలువబడి ఉన్నది. "ఎందుకు కొట్టిందే అమ్మనిన్ను" అని అడిగాను చిన్న దాన్ని.

"ఇవ్వాళ ఏంజేసిందో కనుక్కోండి" అన్నది ముద్దాయి.

"నీవు ఇప్పుడు మాట్లాడరాదు. ఫిర్యాది చెప్పేది అంతా ముందు వినాలె. తరువాత నీసంగతి" అని నేనన్నా కోర్టువారికుండే సహజమైన అధికారగర్వంతో.

'అదికాదు నాన్నా, నేనే, మరే, నేనే మల్లెపూలు కొనమన్నా నాన్నా......' అని కొంచెంఆగింది. దుఃఖంచేత మాటరాక, చెప్పూ,. కొనమనటం ఏమీ తప్పులేదు. అట్లా

అనటానికి నీకు సర్వహక్కులూ ఉన్నాయి. ఊఁ— అంటే''
అన్నాను నేను.

''కొనమంటే కొనలేదు నాన్నా'' అని అది పూర్తి
జేసింది.

ఫిర్యాదువిన్నతరువాత ఇది క్రిమినల్ కేసా, సివిల్ కేసా
అని నాకు సందేహం కలిగింది. పూలు ఆస్తే కాబట్టి ఇది
ఆస్తికి సంబంధించిన విషయంగా నిశ్చయించి సివిల్‌లాప్రకా
రం విచారించాలని తేల్చుకొన్నాను, ఆపళంగా, ముద్దాయి
వంక తిరిగి ''ఏమి! నీవు పూలు ఎందుకు కొనకపోవాలె?
పిల్లల పూల కోసమని జీతం వచ్చినపుడు ప్రత్యేకంగా తీసి
ఇచ్చిన రూపాయి ఏంజేశావు?'' అని కొంచెము బొంగురు
గొంతుకతో తీవిగా అనేశాను.

వాళ్ళమ్మను కోప్పడుతున్నానని మా అమ్మాయి
అనుకొంది కామాలు. కొంచెం ధైర్యంగా ''కొని ఇయ్యక
పొతే నేను ఏడ్చాను నాన్నా'' అన్నది. ''పెర్ ఫెక్ట్లి రైట్
నీతప్పు ఏమీలేదు.'' అని అది ఇంకేదో చెప్పవస్తుంటే ఉం
డమ్మా ఇంతవరకు విచారిస్తాను అన్నాను.

న్యాయవిచారణలో సాక్షులు కావాలె. సాక్ష్యంక్రింద
మా పెద్దఅమ్మాయిని తీసుకొన్నా—''ఏమే, అమ్మా! పూలు
కొనమంటే అమ్మకొననిమాట నిజమేనుటే'' అన్నాను—''కొన
లేదు నాన్నా'' అని అదిగట్టిగాఅనేసింది.

అప్పుడు ముద్దాయి వైపుతిరిగి—''విన్నావుగదా, నీ

మీద పెట్టబడిన కేసు. బలమైన సాక్ష్యంకూడా, చదువుకొన్న (మా పెద్దఅమ్మాయి మూడో క్లాసు) లేడీవలన నీకు వ్యతి రేకంగా ఉంది. ఏంజెపుతావు'' అన్నాను. ప్రతిమాటాకూడా న్యాయమూర్తికిఉచితమైన నొక్కుతో ఉచ్చరిస్తూ

ముద్దాయి జవాబు ఇయ్యక నవ్వింది. ''నవ్వటంపనికి రాదు. అట్టే నవ్వితివా అంటే కంటెంప్టు ఆఫ్ కోర్టుక్రిందనీకు శిక్షను ఎక్కువ చేస్తాను. పూలుకొని పెట్టక పోవటం నిజమా కాదా చెప్పు'' అని కొంచెం గర్జించాను.

''కొని పెట్టకపోతే ఏంజేసుందో కనుక్కోండి'' అని వెంకె జవాబు చెప్పింది. అదివేరేసంగతి. తప్పునీదని ఒప్పు కుంటావా?'' అన్నాను.

''డబ్బు లేక కొనలేదు'' అని ముద్దాయి జవాబు విని నేను కొంచం కోపం తెచ్చుకొని ''నీకిచ్చినడబ్బు ఏంజేశావు. ఆరూపాయిః పెట్టి అప్పుడే పూలుకొనేశావా?'' అన్నాను. నిజంగా కోపంవచ్చినవాడిలాగే.

''ఏదోచేశాను. పోనీ కొనలేదు. ఇప్పుడేం''—అన్నది. ఈ కోర్టులో ముద్దాయిగా నుంచున్న కాంతం—చాల్లే సరిగా జవాబులు చెప్పు అని కాంతంతో పిల్లలు వినకుండా ప్రైవేట్ కెపాసిటీలో అని, ప్రకాశంగా ''నువ్వో అట్టే మాట్లాడకు. పిల్లలు పూలు కొన మంటే కొనకపోవటం తప్పు నీది. నిన్ను కన్విక్టు చేసినాను'' అన్నాను.

''ఏడిస్తే కొట్టింది నాన్నా'' అని మాఅమ్మాయి తల్లి మీద నేరాలు కుప్పలు కుప్పలుగా పడేయటం సాగించింది.

"ఆ!, ఆ!, తప్పుడుదానా, ఎందుకు కొట్టానే? ఆసంగతి చెప్పవేం" అన్నది కోపంగా కాంతం. పిల్ల మాట్లాడలేదు.

మాకోర్టులో సంగతేమిటంటే మౌనము, నేరము చేసినట్లు అంగీకారసూచకము. కాబట్టి ఇదేదో చేస్తేనే వాళ్ళమ్మ కొట్టినట్లు స్పష్టము. ఇప్పుడు తల్లిఫిర్యాది, కూతురు ముద్దాయి అయింది.

ఇప్పుడు నేను ముద్దాయితో, 'ఏంజేశావే అమ్మా,' అన్నాను. మళ్ళా మాట్లాడలేదు చిన్నది.

"చూశారా! భడవా! మాట్లాడదు! దొంగ!, పరమ దొంగ! మాట్లాడదు!" అన్నది కాంతం

నీవు ఊరికేతిట్టకు. అదివేరే నేరమవుతుంది. సంగతేమిటో చెప్పు" అన్నాను నేను విసుగుతో.

"ఏముంది? దీన్ని ముందుగదిలో పెట్టి బైటగొళ్ళెం పెట్టాను. తెరువాత............"

"ఆగు ఆగు. నిన్ను గదిలోపెట్టి గొళ్ళెంపెట్టింది, అమ్మా" అన్నాను, "బైట గొళ్ళెం వేసింది నాన్నా" అని అది ఏడ్చింది

"ఎందుకట్లా చేశావు?" అని నేను ప్రశ్నించాను.

"ఏంజేయమంటారు? పూలుకోనమని ఎరిగి నానా గోలచేసి పీకి చంపుతుంటే ఏంజేసేది? అసలు సంగతి వినరేం?" అన్నది కాంతం.

"వింటానుండు. ఒక్కొక్క పాయింటే విచారించి తీర్పుఇస్తా" నన్నాను.

"తీర్పూ, జడ్జిమెంటూనూ, అవతల పనుంది. వెళ్ళిపోవాలె. మీకేమి?" అన్నది కాంతం.

"పోవటానికి వీలులేదు. కంటెమ్ప్టు ఆఫ్‌కోర్టుక్రిందఛార్జి చేస్తాను. జాగ్రత్త. చివరదాకా అట్లానుంచు. అయితే పిల్లలను గదిలో పెట్టి గొళ్ళెం ఎందుకు వేశావు? అట్లా వేయటం తప్పు. ఈ నేరాన్ని ఇంగ్లీషులో రాంగుఫుల్ కన్‌ఫైన్‌మెంటు అంటారే. దీనికిశిక్ష, జరిమానా ఆనెక చెపుతాను. నీవుచెప్పేదేమిటో చెప్పు" అన్నాను.

"అట్లా దాన్ని గదిలోపెట్టి గొళ్ళెంవేసి, చిన్నవాడు వంటఇంట్లో ఆడుకొంటూవుంటే వదిలేసి—పసిదానికి నీళ్ళు పోయటానికి దొడ్లోకివెళ్ళాను. కాసేపుండి ఇట్లావచ్చి చూద్దునుగదా ఆ చిన్న వెధవ ఉడుకుతూ ఉడుకుతూవున్న అన్నంలో బొగ్గులూ కచ్చికలూ పడేస్తున్నాడు. తవ్వెడుబియ్యపుఅన్నం దగ్ధమైపోయింది. వాడ్ని నాలుగు బాదాను. ఇంతలో అబ్బాయి కెవ్వున కేకేశాడు. ఇట్లాపోయి చూద్దునుగదా, హాలులో పిల్లలందరూ గంతులేస్తూ గోలచేస్తున్నారు. విడిచి పడేసిపోయిన చీరఒకటి భగ్గున మండిపోతున్నది. ఇల్లు తగలడిపోయేది. ఎంతగోలో చూశారా? ఆపళంగా నేను నలుగురునీ నాలుగేశాను. అదిగో, ఆచిన్నదే ఇంతపని జేసింది. దాన్ని వళ్ళు పగలగొట్టాను. కాస్త పెద్దదాన్ని అయినానని అయినా

జ్ఞానంలేకుండా వీళ్ళతో కలిసినందుకు ఆ పెద్దదాన్ని రెండు ఉతికాను. బట్టను ఎందుకు తగలబెట్టిందో కనుక్కోండి ఆ చిన్నదాన్ని" అన్నది కాంతం.

"ఏమే అమ్మాయి" అంటే ఆ చిన్నది బెల్లంకొట్టిన రాయిలాగ ఊరుకొన్నది.

సరే చిన్నది ఏదో చేసిందని తేలింది. అయితే ఇల్లు తగలబెట్టాలని పిల్లల ఉద్దేశంకాదు. కాబట్టి నేరంలో ఉండే సగంబలం తగ్గింది. అమ్మాయిని "అయితే,అసలు నిప్పుపుల్ల ఎక్కడిదే? ఎవరు గీశారు? ఎవరు ముట్టించారు." అని అడిగాను.

'తమ్ముడు తెచ్చాడు నాన్నా' అన్నది అమ్మాయి.

"నిన్ను బైటకు తీసిందెవరు?"

'అక్కయ్య గొళ్ళెంతీసి, దబ్బునరావే, అమ్మలేదు' అన్నది.

'నిప్పుపుల్ల గీచిందెవరు?'

'నేనే నాన్న, ఊరికేనేగీచి అక్కడ పారేశానాన్నా'

'ఊరికేగీచి ఎక్కడపారేశావు?చీరమీదా?'

'కాదు నాన్న అక్కడే పారేశాను.'

'అక్కడ పారేస్తే చీర ఎట్లా అంటుకుంది?'

'ఏమో నాన్న'

'మరి చీర ఎట్లా అంటుకుందే?'

'ఏమో, అది అంతట అదే అంటుకుంది.'

ఇట్లా ప్రశ్నోత్తరాలు జరిగినవి. ఇప్పుడు చిన్నది నేరస్తురాలా కాదా అని సందేహం. నిప్పుపుల్ల గీచివేయటం చీర తగులబడటానికి కారణంలాగ కనబడుతున్నా అదే కారణం అని మనం నిశ్చయించకూడదు. కాబట్టి చిన్నది నేరస్తురాలని స్పష్టంగా నిశ్చయించలేము. కాబట్టి పిల్లలు నేరమేమియు చేయలేదనే కోర్టువారి అభిప్రాయం.

ఇక తల్లిసంగతి నిప్పుపుల్లలపెట్టె చేతిలో ఉండటం మూలాన అదే ఇంతపనిచేసి ఉంటుందని తల్లి అభిప్రాయపడి వాళ్ళను తలానాలుగు కొట్టటం ఎస్సాల్ట్ నేరము క్రిందికి వస్తుంది. వాళ్ళు ఏడ్చి నానాగోలచేసి ఉంటారు. అప్పుడు బ్రీచ్ ఆఫ్ డొమెస్టిక్ పీస్ జరిగింది. ఇదివరకే ముద్దాయివైన నీపై రాంగ్ ఫుల్ కన్ఫైన్ మెంట్ కేసుఉంది. పిల్లలకు పూల కోసం ఇచ్చిన డబ్బును అపహరించావు. అదీగాక నీవు ఇటువంటి నేరములను తరుచూ చేస్తూఉండే ఓల్డ్ అఫెండర్ కాబట్టిన్నీ చేసిన నేరాలన్ని కలిపి కన్సాలిడేటెడ్ స్టేట్ మెంటు ఒకటి తయారుజేసి తగిన శిక్షను అనుభవించటానికై నిన్ను శెషన్సుకు కమిట్ చేస్తున్నాను. సెషన్సు కోర్టుకు నీవు మాత్రం రావాలె. పిల్లలు రానక్కరలేదు, వారివిషయమై ఉన్న రికార్డు చాలు అని తీర్పుజెప్పాను.

ఇక మాటలురానిఇద్దరు పసిపిల్లల కేసులు ఉండిపోయినాయి. అయితే పసిదానికి పాలు, ఎడబిడ్డకు పిప్పరమెంటు

బిళ్ళలూ దొరకటంచేత వాళ్ళు రాజీపడి తల్లిదగ్గరచేరారు. కాబట్టి కోర్టువారికి చేసేది ఏమీ లేకపోయింది.

,రండర్రా—అన్నాలు పెడతాను అన్నది కాంతం' అప్పటికి పూర్తిగా చీకటిపడటంచేత ఆరోజు జీలకర్ర వేసి కందిపచ్చడినూరి ఉంచడంచేత పిల్లలుఎప్పుడు అన్నంతిందామా అని చూస్తున్నారు. ఈమాట వినటంతోనే ఒక్కసారి లేచి తల్లివెంట వెళ్ళిపోయినారు.

కోర్టువారు ఒక్కరే మిగిలిపోయినారు ముందున్నబడి పంతులు తలగుడ్డ వెక్కిరిస్తూ బల్లమీద ఉంది. మాసినలాంగుకోటు వంకెన వేలాడుతున్నది. కాఫీతాగినతరువాత అక్కడపెట్టిన వెండిగ్లాసు అక్కడేఉంది. నిర్లక్ష్యంగా దొర్లుతూ దూరాన మబ్బులోనుంచి బాలచంద్రుడు వెకిలినవ్వులు నవ్వుతున్నాడు. పిల్లలను ఇంత అన్ డ్యుఇన్ ఫ్లూయన్స్‌తో స్వాధీనపరచుకొని ప్రపంచంప్రకృతి అంతా నన్ను వెక్కిరించేటట్లు, హాస్యాస్పదమైన స్థితిలోకి నన్నుతీసికొచ్చి వదిలిపెట్టిన కాంతానికి సెషన్సుతో కఠినశిక్ష విధించక మానను అని నిశ్చయించుకొన్నాను.

# ధర్మచక్రపరివర్తన

"నిన్నవచ్చిన జీతండబ్బులలో పాతికరూపాయలకంటె ఎక్కువ ఏమీ మిగలలేదు. చిల్లర కొట్లోఇవ్వాలిసిందాంట్లో సగమే ఇచ్చాను. బియ్యంవర్తకునికి ఇంకాఅయిదురూపాయి

లివ్వాలె. కాఫీహోటలులో ఇవ్వాలిసిన పదిరూపాయలు ఆవిడకు తెలియకుండా ఎట్లా సర్దటం? తెలిస్తే గోల పెడుతుంది. ఏ పత్రికకన్నా ఒక కథైనా వ్రాసి రహస్యంగా ఆ బాకీ తీర్చాలె. నెలంతా ఎట్లాగ గడుస్తుందబ్బా!" అనుకొంటూ తలొంచుకొని అడుగులో అడుగు వేసుకొంటూ ఇంటి కొస్తున్నాను.

గుమ్మంలోకి యింకా రాకముందే వినిపించింది ఇంట్లో అల్లరి. బుడగ బూరాల కీచు శబ్దం, ఈలలు, ఢమ ఢమలాడే బండిమోత అన్నీను. తిరుణాలల్లోను, తీర్థాలలోను వింటాము అల్లాంటి శబ్దాలు.

ఏమిటా సంగతి అనుకొంటూ ఇంట్లోకి కాలుపెట్టే సరికి చిన్న వెధవ చేతిలో చెక్క బొమ్మను ఒకదానిని ఆడిస్తూ పరుగెత్తుకొంటూ వచ్చి, "కోతినాన్నకోతి," అని దాన్ని పైకి క్రిందిలాగి ఆడిస్తూ, బాగుంది నాన్నా 'మంచి కోతి నాన్నా" అని ఆ బొమ్మను గురించి ప్రశంసావాక్యాలు కురిపించటం సాగించాడు. చిన్నదాని చేతులలోనుఅల్లాంటిదే ఉంది. పెద్ద పిల్లవాడు ఢడాఢమ బండి లాగుతున్నాడు. సుసీ, గింగురు మనేట్లు ఈల ఊదుతున్నది. ఇంతలో అందరూతలో కోతిని తీసుకొచ్చి నా ఎదుట నుంచున్నారు. ఈ వానర సైన్యానికి అధిపతి అయిన ఆవిడ యుద్ధభూమిని అర్జునుని ఎదిర్చి నిలిచిన 'చిత్ర' లాగ మేడమెట్ల నానుకొని నుంచున్నది, వాళ్ళ వెనకాల.

"ఎక్కడివే ఈ కోతులన్నీ?"

"మనవేనాన్నా" అన్నాడు పెద్ద అబ్బాయి.

"మన కిన్ని కోతు లున్నాయూ?"

"ఉన్నాయి నాన్నా, అమ్మసంపాదించింది" అన్నాడు.

"నేనురా? ఓరి వెధవా. నే నెక్కడ సంపాదించా నురా? మీరేకొనుక్కొని" అన్నది వాళ్ళమ్మ

"ఏమి కాంతం. ఈ కోతులన్నీ నీ సంపాదితములే!"

"సంపాదన అంతా మీదే కదండి. నా దేముంది?" అన్నది కాంతం, కొంచెం ముఖం ముడుచుకొని పొంగి పొర్లుతూ ఉన్న నవ్వును అణచి పెట్టుకొని నేనూ నవ్వక తప్పింది కాదు:—

ఆ రోజు సాయంత్రం ఒక్క "టీ" మాత్రం గుక్కెడు తాగి వచ్చేను. డబ్బు ఎక్కువగా కర్చు అవుతున్నద నే కారణం చేత సాయంత్రం కర్చు చాలవరకు తగ్గించాను. నా తాప త్రయము అల్లా ఉంటే కాంతం ఈ కోతులకై ఎంత పాడు చేసి దో అని మనస్సులో కొంత వ్యాకులత జనించింది. కాని పిల్లల ఆటలను చూచి లోలోపల మిక్కిలిఆనందిస్తున్న కాం తంతో ఇప్పు డేమన్నా అంటే మనస్సు చిన్న బుచ్చుకుంటుం దని అప్పటి కేంమాట్లాడక ఊరుకున్నాను...... ఇంతలో,

"పండ గొస్తుంది నాన్నా మనఇంటికి" అన్నాడు పెద్దఅబ్బాయి.

"వస్తేఏంరా?"

"పండగొస్తే.....ఇవన్నీ ఉంటాలేనాన్నా. పండుగ రోజున పాడాలె, నీకు పాట లొచ్చా నాన్నా" అన్నాడు.

"నా కేం రావు" అన్నాను

"ఏమని పాడాలెరా" అన్నది వాళ్ళమ్మ.

"నీవుకూడా పాడతావానాన్నా ?"

"నే నెందుకులే, నీవు మీ అమ్మా పాడండి" అన్నాను.

"ఎబ్బె ఆడవాళ్ళు పాడతారా ? మొగాళ్ళు పాడుతారు నాన్నా" అన్నాడు మావాడు ఛాతీ విరిచి మొగవాడ్ని అన్న గర్వం అంతా రొమ్మున అదిమి పెట్టుకొని.

"ఏమని పాడాలో చెప్పరా మీ నాన్నకు" అన్నది ఆవిడ దొంగనవ్వు నవ్వుతూ.

"నాన్నా ఇది పట్టుకొని, ధరచివమ్మాచనమై, అంటాను నీకు అను నాన్నా నే నన్నట్లూ"

"సరే. ధరసింహాసనమై ఇంకేం అనాలెరా?"

"చెపుతా నాన్నా, ధరసింహాచనమై లభంగుకొడుకై......అను నాన్నా"

"ఛా వెధవ ఎవరు చెప్పారురా ఈ పాట?"

"మాస్టారు చెప్పారు నాన్నా. బళ్ళో మంచిపాటలు చెపుతారు......విదిలించి గొడుగై........."

"అది కాదురా అబ్బాయి విధించి అనారా" అని వాళ్ళ అక్కయ్య తప్పు దిద్దింది శబ్దరూపం తెలిసిన దానికి మల్లే. వాళ్ళమ్మ ఒకటే నవ్వటం........చిన్నది గంతులు

వేయటం. సుసీ ఈల గింగురమని ఊదేసింది. వాడు బండి లాగాడు ఢమఢమ మని చెవులు గింగురు మన్నాయి "అబ్బా! ఏమి మోతమ్మ. కాసేపు ఊరుకోండే" అన్నాను. ఎవరు ఆ మాటలు వినుపించుకో నేది? "ఇంతకూ ఆవిడ దగ్గ రుంది ఏమున్నా ! ఎందుకు కొనియ్యాలె ఇవ్వన్నీనూ ? కాని ఆ నెక్కు చెబుతాను ఈవిడ సంగతి" అని అనుకొని మేడపైకి, వెళ్ళి పోయినాను. దాని తరువాత ఇం కో గంటకు మామూ లుగా భోంచేసి చదువుకుంటూ కూర్చున్నా, ఆవిడ వచ్చిన తరువాత గట్టిగా చీవాట్లేద్దామని దృఢంగా సంకల్పించుకొని.

రాత్రి తొమ్మిది కొట్టింది గోడపె నున్న గడియారం టాంగ్ టాంగ్ మని; అప్పుడే మా ఆవిడ కాళ్ళ అందెలూ ఘల్లుమన్నయి. తలెత్తి చూద్దును గదా ఎదుట నుంచున్నది నా కెదురుగా, ఒక చేత్తో వెండి చెంబూ, మరో చేత్తో జిలేబితో నిండి ఉన్న పళ్ళెమూ పట్టుకొని మా ఆవిడ.

"ఎక్కడదీ చీర?" అన్నాను చూసే చూడటంతోనే ఆవిడను. తెల్లని పూలు గల గులాబిరంగు సిల్కుచీర నేను ఎప్పుడూ కొనలేదు.

కాంతం, తలొంచుకొని, చీరమడతలు మెల్లగాసర్దుతూ ,,ఎక్కడిదేమిటండీ. నాదే, బాగుంది కాదూ" అన్నది నేను సంతోషిస్తానన్న గంపెడాశతో.

కొనేసింది గామాలు ఇంటి కర్చుకోసం దాచిపెట్టిన డబ్బెట్టి. గుండెల్లో రాయిపడ్డది.

సరదా పడి కొనుక్కొని కట్టుకొని మహానందంతో నావంక అట్లా చూస్తున్న మనిషి మనస్సును నొప్పించటం అన్యాయమే కాని ఏం జెయ్యనూ తప్పిందికాదు. అందుకని ముఖాన్ని ముడుచుకొని.

"బాగుంటం మాట అల్లావుంచు, ఎప్పుడు కొన్నా రండి ఈ చీర?" అన్నాను బొంగురగొంతుకతో. "అప్పుడే వచ్చినట్టుంది మహారాజులుంగారికి కోపం" అన్నది, పసుసుగా నూరి సానబెట్టిన చిరునవ్వును నాపై విదిలిస్తూ.

"ఎప్పుడు కొన్నావు?.........ఎంత?" అన్నాను అర్ధనిమీలిత నేత్రాలతో ఆకరకు చిరునవ్వును అవతలకు తోసేస్తూ.

"మధ్యాహ్నం......ఇరవై రెండు రూపాయలు" అన్నది వంచిన ముఖం ఎత్తకుండా, కుచ్చెళ్ళు దిద్దుకొంటూ ముందున్న అద్దంలో చూచుకొని.

"ఆ కోతులకూ?......" అన్నాను అంకెలు కూడు కుంటూ.

"అవెంతలెండి......అవో రెండు మూడు రూపాయలు"

"ఎక్కడిదీ ఇవన్నీ కొంటానికి డబ్బు నీకు?" అప్పటికి నా మనస్సులోని బాధంతా చూపుల్లో కెక్కింది.

"మనదే!" అన్నది ఆవిడ మళ్లీ నమ్మకంగా.

"అంటే......నేను నీకు ఇవ్వలేదే" అన్నాను చూపులు ప్రశ్నార్థకంగా అమర్చి.

"ప్రత్యేకంగా ఇవ్వాలా ఏమిటండీ..... పెట్టెలో నుంచితీశాను" అని అంటూంటే ఆవిడకళ్లలో తారలు తళ్కు తళ్కు మని మెరిసినవి.

"నన్ను అడక్కుండానే" అన్నాను ఆశ్చర్యంతో.

"అడగాలా ఏమిటండీ......"అంటూ దగ్గరగా వచ్చి మెత్తని గులాబి పూమాలవంటి తన రెండు చేతులను...నా బుజాలపైని వేసి ముఖంలో ముఖం పెట్టి నవ్వింది.

నేను నవ్వలేదు.........

డబ్బులేక నానా ఇబ్బందిపడుతూన్న సమయంలో పాతిక రూపాయలూ ఒక్కమారు వ్యయం జేసిందే అని కోపంతో...............

"చాల్లే......అల్లా ఉండు...చెబుతాను ఇవ్వాళ నాకు చాలా కోపంగా ఉంది" అన్నాను విని వినపడని సణుగుడు గొంతుకతో.

'ఓయబ్బ! ఇ. తమాత్రానికే కోపం ఎందుకండీ?' అంటూ ముందుకో అడుగు జరిగింది ముసిముసినవ్వులు నవ్వుతూ.

"అలా నవ్వితే నా కోపం పోదు. నవ్వేటప్పుడు నవ్వాలేగాని అదేపనా? నామనస్సు కనిపెట్టాలె" అన్నాను. ఆవిడ మనస్సుకు కష్టం కలిగితే కలిగింది లెమ్మనుకొని.

నవ్వటం ఆపింది. మల్లెమొగ్గలాగ ముడుచుకుపోయిన ముఖంతో అన్నదీ......"ఏం జేశానండీ, మీకంత కోపం

......పిల్లలు ఏడిస్తే అవ్వేవో కొన్నాను. నేనేమన్నా ......ఈచీర కొనుక్కున్నాను. ఎన్నాళ్ళబట్టో......... అనుకోటం ఈలాంటి గులాబిరంగు చీర కొనుక్కోవాలెనని నేను కాపరానికి వచ్చిన కొత్తలో."

"అవునవును. ఇప్పుడంతా ఎందుకు......ఇప్పుడిట్లా జరగటం నెలంతా?"

"గడవక కొడుతుంది లెద్దురూ. చూశారూ......ఈ రంగు పోదట! గట్టిరంగు—పూలు చూశారూ? ఎంచక్క ఉన్నాయో—" అన్నది అద్దంలో మరోమారు చూచుకొని పమిట సవరించుకొంటూ.

"అయితే ఉన్న డబ్బంతా కోతులకు కర్చు అయిందన్నమాట!...ఇక ఈ నెలంతా తల గోక్కుంటూ కూర్చోవాలె!......అంతే కదూ?" అన్నాను విసుగ్గా.

"ఏం మాటలండీ అవి? అంతా కోతులకే అయిందా పిల్లలు ఆడుకొంటారని ఓ రెండు రూపాయలకు అవికొన్నాను. అంతేగా?"

"మరి చీర నీవొక్కదానివే కొనుకున్నావేం?"

"ఇంకెవరికి కొనమంటారు?"

"ఆడకోతుల కన్నిటికీ బట్టలు కడతారు."

"మగవాటికి?"

"ఆడ...అనలేము. ఆట,......అన్నాను."

"చిత్తం"

"ఏమిటండీ బుద్ధమూర్తి పెట్టుకొని, అల్లా కూర్చున్నారు?" అన్నది ఆవిడ నాకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని ఉండి. ఒక పది నిమిషాలైన తరువాత.

"ఏమిటిచేయమంటావు?"

"సంతోషంగా ఉండమంటాను."

"పాతికరూపాయలూ ఇస్తే."

"రూపాయలు కాకపోతే అంత విలువైంది ఏదన్నా ఇస్తే పుచ్చుకోంటారా?" అంటూ కాంతం నా వెనక్కు వచ్చి రెండుచేతులూ కుర్చీపైన జార్చి ముందుకు వంగింది.

"అహా, అల్లా పనికిరాదు. నాకు రూపాయలు రూపాయలుగా కావాలె."

"దానికేం భాగ్యం అల్లాగేఇస్తాను.?' అన్నదికొంటెగాచూస్తూ.

"ఎల్లా ఇస్తావు! మీవాళ్ళ దగ్గర్నుంచి ఏమన్నా?...'

"ఆ, మళ్ళీ జీతంరాదూ అప్పుడూ......"

"నా జేబులోనుంచి తీసి నాకిస్తావూ? ఘనకార్యం చేస్తావు!......కాని ఇవ్వాళ నీవుచేసిన పని నాకు చాలా కష్టంగా ఉంది. అత్యవసరమైన కార్యానికి కాకుండా డబ్బు కర్చు చేయటమనే విషయం అల్లావుంచి, నాతో చెప్పకుండా డబ్బు పెట్టెలోనుంచి తీయటం ఎంత తప్పు."

"మనదేగదండీ......" అంటూ నాముఖంపై వ్రాలి నవ్రాపును పైకెత్తుతూ కూర్చున్నది కాంతం నాకెదటనే

కొంచెం ప్రక్కగా. ఇందాకటి కోపమూ, మనస్సులో కష్టమూ. తగ్గిపోయినయి. పోనిలే అనిపించింది. ఆముదురు రంగు గులాబీరంగుసిల్కుచీర, మెరుస్తున్న నీలాకాశంలాంటి కేశబంధం మనోహరంగా ఉన్నప్పుడు కోపం ఎట్లాగుంటుంది?

"మనదైతే మట్టుకు?...ఇద్దరం అనుకొని సాధకభాధకాలు చూచుకొని కర్చు చేయాలెగాని, నీ యిష్టప్రకారం నీవు కర్చుచేస్తే ఎట్లా గడవటం?"

"మీరు నాతో చెప్పే కర్చు చేస్తున్నారా?"

"చెప్పకపోయినా సంసారానికే కర్చు చేస్తున్నాను."

"నేనూ, అంతేనండీ........ఇంకోవిధంగా పాడు చేస్తున్నానని అనుకోకండి. మీరు చేసే వ్యయమంతా సంసార సౌఖ్యానికై తోడ్పడుతుందని ఎట్లా అనుకొంటున్నారో అల్లాగే చీరలూ, రెవికలూ, ఆటవస్తువులూ కొని, పిల్లలూ నేనూ సంతోషిస్తుంటే మీకానందంకాదండీ! నేనుఅందంగా కనుపించటం మీకు ఆనందం ఇవ్వటానికి కాదండీ? మీకు తెలియదా యీమాత్రం? నాచేత ఈ ఉపన్యాసం ఎందుకు ఇప్పిస్తారు?" అన్నది చెమ్మగిల్లిన నేత్రాలతో.

"పోనీ చీర కొంటే కొన్నావు అనుకో. ఆకోతులెందుకూ? డబ్బుదండుగ?"

"ముద్దుముచ్చటలు ఉండొద్దూ? పిల్లలు ఎంత సంతోషించారనుకొన్నారు. మీరుచూశారుగా వాళ్ళుఆడుకోటం..."

"అవును గాని అది అల్లావుంచు. నీవునాకు చెప్పకుండా డబ్బు తీయడం దొంగతనం......"

"దొంగతనమాండి...మీడబ్బు మీరు తీసికోటం దొంగతనమైతే ఇదీ దొంగతనమే..."

"నేను సంపాదిస్తున్నాను..."అన్నాను గర్వంగా

"మీరు సంపాదించటం నేను కర్చుపెట్టడం కోసమే" అన్నది కాంతం...నిండు విశ్వాసంతో.

"అవునవును మహాగొప్ప సిద్ధాంతం. సాయిబాబు సంపాదనంతా బూబు కట్టుపోగుల కేకదూ! బాగుంది.! ఇట్లాగు అంటే, ఇల్లా భర్తకు తెలియకుండా భార్య డబ్బును, దొరల సంఘంలో ఎప్పుడూ తీయదు. అట్లాతీసిందో......"

"ఆఁ తీసిందో చెప్పండి ఆకాస్తాను."

"తీస్తే ఇంకేముంది? ఆరోజుతో వారి దాంపత్యానికి నూరేండ్లు నిండుతాయి. ఆరోజుతో సరి. ఎవరిదారివారిదే!"

"వెళ్ళిపోవటమే?"

"సందేహంగా అడుగుతావేమి? తత్‌క్షణం విడాకులు పుచ్చుకోటం ఎవరి దారిని వారు వెళ్ళిపోవటం."

"పోయేవాళ్ళు వెళ్ళిపోక ఆ ఆకులు పుచ్చుకోటం ఏమిటి?"

"ఆకులు కావవి. విడాకులు పుచ్చుకోటం అంటే Divorce."

"డైవోర్సులంటే."

"చచ్చాం నీకువెల్లా చెప్పటం!"

"మీావృత్తే అదిగదండీ! ఈమాత్రం చెప్పలేరూ!"

"అదివేరు. బర్లో అయితే కుర్రాళ్ళకు తెలిసీ తెలియకుండా పెద్ద ఇంగ్లీషు మాటలతో వాదులకొట్టేస్తే మళ్ళీ నోరెత్తరు. నీకీ తెలుగులో చెప్పటం అంటే కష్టం ఏమిటంటే భార్యాభర్తలకు పొత్తుకుదరనప్పుడు వారు న్యాయస్థానంలో తమ దాంపత్యాన్ని విచ్ఛేదనం చేసుకుంటారు.

"సంబంధం తెంచుకుంటారు అన్నమాట."

"ఆ అది."

తెంచుకుంటే తెగిపోతుందన్నమాటే వాళ్ళ దాంపత్యం!"

"మహారాజులాగ, నిరభ్యంతరంగా ఠకీమని తెగుతుంది నిమిషంలో."

"పిల్లలుంటే?"

"వాళ్ళ కేదో ఏర్పాటుచేస్తారు. ఏ ఆసుపత్రికో ఇట్లాంటి పిల్లలను పెంచటానికి ఏర్పడ్డ ఏసంస్థకో ఇచ్చేస్తారు.

"ఓరివీళ్ళ అమ్మకడుపుమాడ.....ఎంతచిత్రం! ఆడదికూడా భర్తకు విడాకు లిస్తుందన్న మాట కోపం వస్తే?"

"ఓ....."

"అంటే పిల్లలనూ భర్తనూ నిక్షేపంలాంటి సంసారాన్ని వదిలేస్తుంది! వాళ్ళలో ఆపని ఎబ్బెరికంగానూ, ఉండదు! అంతేగదండీ."

"అదీ సంగతి."

"వాళ్ళ దుంప తెగిరి. వాళ్ళ సంగతి నాకు ఇక చెప్పకండి."

"అల్లాకాదు. మనము వాళ్ళవద్దనుంచి కొన్నివిషయాలు నేర్చుకోవలసి ఉంది. ఇప్పుడు నూాశావ్గాం, ఇల్లా విడాకు లివ్వటం అనేఅవకాశం ఉండటం మూలాన ఆడదానికి స్వేచ్ఛ ఏర్పడుతుంది. అదీ లేకపోతే భర్తతో ఇష్టం లేకపోయినా కాపరం చెయ్యాలె అంటే నీచమైన శృంఖల బద్ధమైన దాస్యవృత్తికి లోబడినట్టు."

"ఆగండి...ఇకచాలు" అన్నది ముఖాన్ని చిట్లించుకొని.

"ఉండు మరి...కొంసంటా విను. ఇష్టము కానపుడు విచ్ఛేదం చేసికొని.........'.

"తాడు తెంచుకొని అనండి" అన్నది తన ఈసడింపు నుసూచిస్తూ.

"అదేలే వాళ్ళకు తాడుండదు. అట్లా వెళ్ళిపోయి ఆడది దాని ఆత్మ గౌరవాన్ని వ్యక్తిత్వాన్ని సాధిస్తున్నది."

"దాని నెత్తిలెండి.....ఇక ఊరుకోండి. మనపురాణాల్లో ఎవరికి ఇటువంటివి లేవు. ఎదో కొట్టినప్పుడు కొట్టినా తిట్టినప్పుడు తిట్టినా, భర్తనే నమ్ముకుండుటయే తప్ప."

"ఆ విషయాలు, ఆ ఆదర్శాలు పాతవి. ఆ కాలం వేరు ఈ కాలం వేరు. నీవు ఈ కాలానికి సంబంధమైన ఆదర్శాలనూ తెలుసుకొని అయినా ఉండాలె."

'ఓ......... అల్లాగేనండీ ఊరకే తెలుసుకోటం ఏంఖర్మం. ఆచరణలో పెడతాను ఇక సరేనా?' మేఘాల వెనకాల మెరపు మెరసినట్లు ఆమె ముఖాంతర్భాగమున ఎక్కడో చిరునవ్వు ఒకటి తళుక్కు మన్నది. 'ఇప్పుడు నీవు చేసినలాంటి తప్పుకు దొరైతే ఏంజేసేవాడో తెలుసునా?'

'ఆఁ చెప్పండి...అదేనా...విస్తరాకులు, ఛీ. ఛీ' విడాకులూ.

'అవును అయితే నేను దొరను కాదనుకో...''

'కాదనుకోటం...ఏం ఖర్మం అవునే అనుకుందాంఅను కోటంలో అయితేమీరుకూడా నన్ను వెళ్ళిపొమ్మంటారా?'

'అంటాననుకో అపుడు నీవేం చేస్తావు ?......అట్లా చూస్తా వెందుకు అప్పుడే? నీవు ఇట్లాంటి పనులు చేయరాదని నీతిని బోధించటానికి మాటవరసకు అంటానెలనుకో. అపుడు ఏంజేస్తావూ, అంటా?' అన్నాను.

కాంతానికి మృదువైనమాటలతో నేమాంచి నీతిపాఠం బోధించానని సంతోషించినాను.

'ఏంజేస్తానంటారా? ఏమిటి చేసేది?' అంటూ ఉండగానే గది అవతల పసిపిల్ల కెవ్వున కేక వేసి ఏడ్చింది. చప్పున నేను అవతల కొక్కగంతేసి పిల్లదాన్ని చేతుల్లోకి తీసుకొని వస్తుండంగా.

'వెళ్ళిపొమ్మంటే ఉంటానా ఏమిటండి... మాట వరుసకు అన్నా నిజంగా అన్నానూ వెళ్ళిపోతాను' అని తకీమని తలుపు వేసుకొన్నది.

పసిపిల్ల ఉలిక్కిపడి తల్లికోసం ఒక కేక వేద్వటం తేలు కుట్టినట్లు.

'తలుపు తీయి...'

'.........'

ఇదిగో నిన్నే...'

'...........'

సరేలే...పిల్ల చేతుల్లో నిలవటం లేదు.

'అబ్బహా! దబ్బున తలుపు తీయాలె.'

## లేచి పోవాలనుకొంటే

తలుపు నెట్టుకొని విసురుగా, ఇంట్లోకి ప్రవేశించి అన్నాను. నేను వెడుతున్నాను. ఇక మనసు కుదరదు లే'అని

'నేనేం జేశాను? మీకంత కోపం రావటానికి! ఏదో సంసారంలో, భార్యాభర్తలన్న తరువాత పోట్లాట లంటూ వస్తే సద్దుకు పోతారుగాని తెంచుకు పారిపోతారా?'

'...........'

'మాట్లాడరేం ఎక్కడైనా ఉందండీ ఇల్లాంటి వైపరీత్యం? సంసారం గుట్టు, రోగం రట్టు అన్నారు. మీరు నన్నిల్లా అల్లరి పెట్టడం ధర్మం కాదు. అయినా ఇంతకూ నాతప్పేముంది?'

మళ్ళీ యాగీ పెట్టుమంటావా మొదటినుంచీ?'

"వద్దు, బాబూవద్దు. మళ్ళా మొదటికి తీసుకురాకండి."

"అయితే నీవు మాట్లాడక...సుశీ, అట్లా రోడ్డు మీద కెళ్ళి ఒక బండి తీసికొనిరా!"

"ఉండవే, అమ్మాయ్, అయితే ఎక్కడికీప్రయాణం ఒక్కమాట చెప్పండి?"

"ఎక్కడికైతే నీకెందుకు ? ఎక్కడకో వెళ్ళిపో తాను."

"బండి తేనా, నాన్నా."

"ఇంకా, ఇక్కడే ఉన్నావుటే!"

"అయితే వెళ్ళి పోవటం నిశ్చయము అన్నమాటే!"

"నిశ్చయమా అని మెల్లగా అడుగు తున్నావేమిటి ? వెళ్ళిపోతుంటే," అన్నాను దుఃఖాన్ని దిగి మ్రింగుకొని,

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

" నీకేం వేళాకోళంగా ఉందా ఏమిటి ? ఇదే ఆఖరు సారి ఈ ఇంట్లో..............."

అనేసరికి అప్రయత్నంగా నా గొంతుకులోకి సన్నని వణుకు వచ్చింది. ఆ రోజున నేనన్న మాటలు హాస్యానికి కాదు. అట్లా ఒకనాటకం ఆడానని అనుకోలేదు.

నిజం. దైవ ముఖాన చెబుతున్నాను. నిజంగాసంసారం త్యజించి పోదామనే ప్రయత్నం. సౌఖ్యం లేకపోయిన తరు వాత జీవించటంవల్ల ప్రయోజనం ఏముంది ! అల్లా అని ప్రాణత్యాగం చేసుకోలేము. ఏదో ఇదివరలో సంపాదించి,

పెద్దలు ఇచ్చిపోయిన బాపతు ఆస్తివలన జీవనం గడుస్తుంది మా సంసారానికి నేనున్నా లేకపోయినా.

కాంతం సంగతా అయి పోయినవి సౌఖ్యదినాలు.

ఇకముందు నా జీవితానికి అంతా అమావాస్యే గాని వెన్నెల దినాలు రాబోవు.

పిల్లల సంగతో, భగవంతుడే ఉన్నాడు! ఎందుకు జీవిస్తున్నట్లు నేను! సంపాదించి మేడలూ మిద్దెలూ కట్టటం లేదు. సాహేబు సంపాదన బూబమ్మ కుట్టు పోగులకు సరి, అన్నట్లుంది నా సంపాదన. నే జేసే లోకోప కారమా, సున్నాకు సున్నా హళ్ళికి హళ్ళి. ఇంకెందుకు ఈ గంపెడు సంసారాన్ని ఈదటం ? నేను లేకపోయినా గడచి పోతుంది. అంచేత దుఃఖ జనకమై 'కేవలము మిథ్యయైన ఈ సంసారాన్ని వదిలేసి ఇతర దేశాలలో అజ్ఞాతంగా తిరుగుతూ భక్తిని అలవ రించుకోవి, ముక్తిని సాధిద్దామని ఆరోజు నిజంగా అనుకొన్నాను. నిజమంటే నిజం.

"అయితే? ఆవిడకు మాత్రం నా సిజోద్దేశం చెప్పినా నమ్మలేదు.

"నిజంగా వెడతారా,"

"ఆ..........."

"సరే! వెళ్ళేవాళ్ళను పట్టుకుంటే మట్టుకు ఆగుతారా? వక్కమాట ఇలా చూడండి. పసిదికూడా నస్తుందట! ఎట్లా దూకుతుందో చూడండి! ఒక్కమాటు తీసికోండి!"

"ఒక్కసారి కాదుగదా. అరసారైనా తీసుకోను. తెంపుకు పోతున్న వాడిని ఈ ప్రేమ బంధాలతో ఎందుకు కట్టేస్తా? పొయ్యేవాడ్ని పోనీ, అడ్డురాకు."

"............"

"నవ్వుతావూ! నీకేం తెలుస్తుంది నాజదువుల్లో పుట్టిన ఆందోళన, నాకు వద్దు ఈ సంసారం...నరకం...

సంఘం, శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

బుద్ధం శరణం గచ్ఛామి

"అబ్బ, ఎంత కఠినమండీ, సాక్షాత్తు బుద్ధదేవుళ్లై పోతున్నారే! బుద్ధదేవుడు కూడా మహాభినిష్క్రమణానికిముందు భార్యా పుత్రులవంక ఒక్కసారి ప్రేమద్రుక్కులు ప్రసాదించాడు. తెలియదండీ!"

అయితే సరే, ఒక్కసారి ఇయ్యి. ఒకసారే. ఒక గాఢాలింగనం......ఒక్క చుంబనం......సరి తీసుకో... నన్ను బంధించక......బుద్ధం శరణం గచ్ఛామి......"

"రావటం లేదు. మీదగ్గరనుంచి."

"తీసుకో...ఇంద...ఊఁ."

"రానంటుంటే...దాన్ని కూడా తీసికెళ్ళండి. జాగ్రత్తగా పెంచండి. శిష్యురాలౌతుంది!"

"మరేం అక్కర్లేదు...ఇంద"

"నిజంగా వెడతారా?

"వెడుతుంటేనే...పిల్లలను జాగ్రత్తగా పోషించుకో. అవున్నది చాలు, లేదనకుండా గడవటానికి, అని గిరుక్కున తిరిగాను. ఇటుచూద్దునుగదా పిల్లలంతా ఎక్కడికో ప్రయాణసన్నాహంలో ఉన్నారు." కాంతంతో అన్నాను.

"వీళ్ళను నామీదికి తోలేవేమిటి? వీళ్ళనుతీసుకుపో. నేను వెళ్ళిపోతాను. ఈ చివరరోజుకూడా నీవు నాకు అనుకూలవతివి కావూ?" అన్నాను కంపిత కంఠంతో.

"వారు నామాట వినరు. మీరేచూచుకోండి ఆవిషయం." అంటూ కాంతం చెరచెర నడచిపోయింది.

"ఒరేయి ఏమిటి బూద్సులు తొడుగుతున్నావెందుకు?"

"నేనూ, వస్తానాన్నా."

"అదేమిటే అమ్మాయి?"

"........."

"నువ్వెక్కడికే సుసీ?"

"........."

"నువెందుకురా, అట్లా చిందులేస్తావు?"

"నేనూ, వస్తాను నాన్నా.

"నేనూ......"

"నేనూ...నాన్నా"

"నేనో......"

"ఉ...ఉ...ఉ...ఉ..."

"ఓరి వెధవల్లారా. ఎక్కడికి వస్తారు. ఎక్కడికిరా వస్తారూ అంటా? అమ్మ ఉష్మా చేసింది. పొండి?"

"ఉహు . ఉహు ఉహు"

"ఎక్కడికి వస్తావురా?"

"నీవు ఎక్కడికి వెళుతున్నావు?"

"నేను వెళ్ళిపోతున్నాను"

"ఉ . ఉ "

"నేను వస్తా నాన్నా "

"ఓరి వెధవా నేను సంసారం వదిలేస్తున్నా."

"నేను వదిలేస్తా నాన్నా "

"ఓరి గాడిదా, సన్యాసం పుచ్చుకొంటానికి వెడుతున్నానురా" అన్నాను విసుగ్గా "

"నేనూ, పుచ్చుకొంటా నాన్నా" అన్నాడు మా అయిదేండ్ల చిన్న వెధవ.

"నేనో నాన్నా అని బిక్కముఖం వేసింది సుశీ"

ఈచిన్న వెధవలంతా నాతోపాటు సన్యాసం పుచ్చుకుంటామంటూ బయలు దేరారు బుద్ధదేవుడికి ఒక్కకొడుకు కాబట్టి పెంచుకు పారిపోయినాడు అదీ నిద్రపోతున్నప్పుడు! అదీ అర్ధరాత్రి! అసుర సంధ్యవేళ అరడజను పిల్లలను వదలించుకొని వెళ్ళవలసి వచ్చినట్లయితే తెలిసేది ఈసంసారానికి మానవుడు ఎట్లా కట్టబడి ఉన్నాడో!

కుర్చీలో కూలబడ్డను కదలకుండా మెదలకుండా.

పిల్లలు నా ముఖంవంక చూశారు. నేను నవ్వకుండా, గంభీరంగా ఉండటం చూచి పెద్దపిల్లలు ఒకరొక్కరే జారారు.

చిన్నవాళ్ళు ఏడుస్తూ, తల్లిదగ్గరకు పోయినారు. కళ్ళు మూసికొన్నాను.

చెన్నుడు కోటవెలపల గుర్రాన్ని తయారుచేసి ఉంచి సిద్ధంగా ఉన్నట్లూ, బుద్ధదేవుడు గంభీర వదనంతో, భార్యాపుత్రాదులను, ధనసంపదలనూ, సర్వమూ త్యజించి. ఆతురలో వస్తూ ఉన్నట్లు, నాకొక దృశ్యం కనపడ్డది. బుద్ధదేవుణ్ని ప్రార్థనచే, నేనూ, ఒక్కమూరు, ఇంటిని నాల్గుదిక్కులా చూచి, నిట్టూర్పు విడిచి, గుమ్మందాటి బైటపడ్డాను ఈవిశాలమైన ప్రపంచంలోకి.

వీధి మలుపు తిరిగాను బుద్ధదేవుణ్ని ధ్యానిస్తూ వెనకాలనుంచి కెవ్వన కేకేసి పరుగెత్తికొని వస్తున్నారు రాధా విజయులు. పెద్దవాడు లాగూ, చొక్కా, కోటూ వేసికొని, బూడ్సులు తొడుక్కొని, చెమ్కీటోపి పెట్టుకొని నాకు నాల్గుగజాల దూరంలో ముందు నడుస్తున్నాడు,—నేను రావటాన్ని గమనిస్తూ, మాటిమాటికి వెనక్కు తిరిగిచూస్తున్నా. పెద్దపిల్లలిద్దరూ కొత్తపరికిణీలు కట్టుకొని కొత్తచొక్కాలు తొడుక్కున్నారు. వాళ్ళమ్మ నడిగి తీసుకొన్నారు కాబోలు బంగారు గొలుసులు మెడలో మెరుస్తున్నవి. దూరంగా రోడ్డుమీద నుంచిని నేను పోవలసిన దారినే ముందుగా గబగబ నడుస్తున్నారు. పంచరత్నాలను నేను మరోసారి స్మరించి

కొన్నాను.

వీళ్ళంజూచి నేను తెల్లబోయినాను. అమ్మాయిలను పిల్చి 'వెళ్ళండే యింట్లోకి' అన్నాను. వాళ్ళు 'మేము వేరే పనిమీద వెడుతున్నాము ఇంకో చోటికి. సినిమా రావటం లేదు' అని కిలాకిలా నవ్వుతూ దూరంగా నుంచున్నారు.

నువ్వెక్కడికిరా పోరా' అన్నాను దగ్గరనున్న వెధవతో

'నేను వస్తాను నాన్నా' అని మళ్ళీ అన్నాడు వాడు బిక్కముఖం వేసి.

'నేను ఎక్కడికి వెడుతున్నా ననుకొంటున్నావురా', అన్నాను.

'అమ్మ చెప్పిందిలేనాన్నా. అక్కయ్యలు రావటం లేదేం? అదుగో వాళ్ళునీకంటె ముందే అక్కడుంటారు.'

'ఎక్కడుంటారురా?'

అక్కడే!...'

'ఎక్కడరా! ఏమని చెప్పింది అమ్మ.'

'......'

'నేను వస్తాను నాన్నా, మొన్నకూడా రాలేదూ'

'ఎక్కడికి వెడుతున్నా ననుకుంటున్నావు చెప్పవే?'

'అమ్మ చెప్పిందిలే నాన్నా నీవు సినిమాకు వెడుతున్నావని'

'ఆ...ఆ...'

తెల్లబోయినాను పిల్లలిద్దరూ కాళ్ళకు చుట్టేసుకొని ఏడుస్తున్నారు. ఆవీధిలోని ఆడవాళ్ళు కిటికీలోనుంచి చూస్తున్నారు. అసహ్యమనిపించింది. పసిదాన్ని, చిన్నవాణ్ణి, రెండు చేతుల్లో యెత్తుకొని మళ్లీ గుమ్మంలోకి వచ్చేను. పెద్దవెధవ ఇష్టంలేక మెల్లగా అడుగులో అడుగు వేస్తున్నాడు నా వెనకాల. గుమ్మందగ్గరకు వెళ్ళి తలుపు కొట్టాను.

'ఎవరది? చెయ్యి ఊడుకోలేదు. వెళ్ళండి.'

తలుపు, తలుపూ'

.........'

తలుపూ, అయ్యో, తలుపుతియ్యవే!'

'ఎవరా, తలుపూ'

'నేనే...'

'అంటే...'

'అబ్బ... నేనే'

'ఎందుకూ?'

తీయి, చెబుతా?'

'ఏమిటి చెప్పేది? సంసారంపైన విరక్తి పుట్టిపోయిన వాళ్ళకు అప్పుడే ఇదేం వికారం?'

కాదులే, చెబుతా, తలుపుతీయి'

కాదేమిటి? చెప్పేదేమిటి! మళ్ళా ఎందుకొచ్చారు' ఈకూపంలోకి; వెళ్ళండి, వెళ్ళండి.'

'ఒక్క మాట'

"మాంటా, లేదూ, గీటా, లేచూ, వెళ్ళండి."

"మాటా, మాటంటుంటే."

"ఇంకేం మాటలు లెద్దురూ?"

"అబ్బ చాల్లే! తలుపుతీయి, చేతులు పీకుతున్నాయి" అన్నాను.

మా అబ్బాయి "వద్దు నాన్నా, వెడదాం రానాన్నా అమ్మ తీయకపోతేఏం? భయమా?" అన్నాడు.

"ఇంకేం, వెళ్ళండి, కొడుకు చెబుతున్నాడుగా సలహా" అంటూ తలుపుతీసింది కాంతం.

"ఎందుకూ, మళ్ళీవచ్చారు?" అన్నది అణచిపెట్టుకొన్న నవ్వు ముఖం అంతా కలయజారింది.

"మరి వీళ్ళంతా?"

"నన్నేమి చేయమంటారు?"

"నువ్వు చేసిందేకాదూ, ఇదంతా?"

"ఈమాత్రం జయించలేని వాళ్ళేనా, ప్రపంచాన్ని జయించటానికై బయలుదేరారు?" అన్నది ఈసడింపుతో దాన్ని అందుకొంటూ.

"నిజమేలే! ఇకలే అడ్డం...అన్నాను విసుగ్గా."

"ఉహు..."

"అదేమిటి అల్లాగ నుంచుని లేవవు...పేరు చెప్పిస్తావా ఏమిటి?"

"అటువంటిదే..."

"ఏమిటది?"

"ఒప్పుకోండి, ఓడిపోయినానని."

"సరే, ఓడిపోయినాను. ఇక లే! వీధిలో ఆడవాళ్ళం దరూ కిటికీలలోనుంచి చూస్తున్నారు."

"లేకాదు. హ్యాండ్స్ అప్, (Hands up) నెపోలియన్ ఓడిపోయి ఆంగ్లేయుల ఎఱ్ఱ పతాకానికి సలాం చేసుటెట్లా! అట్లా!"

"చిత్తం", అని సలాంచేశాను. గాలికి కాంతంపమిట విప్పారి టపటప కొట్టుకొన్నది.

.............

"ఏమిటది?"

"ఏం లేదు, పక్షులు గూండ్లకు చేరుతూ కిచకిచలాడుతున్నాయి"

"కాదు, కాంతం, ఎవరో నవ్వుతున్నారు."

"కాదు రండి."

ధభీలుమని తలుపు వేసింది కాంతం.

## కిటికీకి అవతలా ఇవతలా

ఆవిడా...అదె మాయింటి ప్రక్కావిడ నిజంగాచక్కనిది. మామిడి పండులాగ ఉంటుంది. మిగలపండిన తమలపాకు. పచ్చనిశరీరచ్ఛాయ. లేకపోతే పండిన జామపండులాంటి

దనండి. కిటికీ అవతలదూరాన ఉన్నా కూడా, నిమ్మపై సుందరమైన ఆముక్కూ ఆ కోలముఖమూ అద్దంలో లాగ నాకు కనిపిస్తున్నాయి. బుజాలపైకి రైక తొడుక్కుంది కాబట్టి నున్నగా నిగనిగ లాడుతూ ముట్టుకో తగినట్టి మార్దవముకనిపించే ఆచేతులనూ, మామిడి చిగుళ్ళలాగున ఆమె పాదాలనూ, మరచి పోయినా, విశాలమై తళతళ లాడుతూ ఉన్న ఆమె వినీల నేత్రాలనూ, చూస్తూ, అలా ఉండి పోయినాను.

వెనకనుంచి చూస్తే నిగనిగలాడే ఆ జుట్టు ముడీ దానిపై అర్ధచంద్రాకృతిగా ఉన్న, పూలూచూస్తే నల్లటి ఆకాశంలో అష్టమిచంద్రుడు ఉదయిస్తూన్నట్లుంది.

ఇట్టి సుందర రూపాన్ని చూస్తూ ముగ్ధుడనై ఆలాగ ఉండి పోయినాను ఆవిడతో మాట్లాడుతూన్నట్లే ఉంది చూస్తున్నంత సేపూ. ఆవిడ నాకేసి చూస్తే తాంబూల రాగంతో కెంపెక్కి ఆచిరు పెదవులు నాతో మాట్లాడేవి. వెనక్కు తిరిగితే, ఆజుట్టుముడీ. ముడిపై వలయం కట్టిన పూలు, నన్ను పల్కరించేవి.

నేను బడినుంచి వచ్చి కిటికీవద్దనున్న కుర్చీలోకూర్చుని పుస్తకం ఒకటి తెరిచి చదువటం ప్రారంభించేసరికే సరిగ్గా ఆసమయానికే ఆమె వాళ్ళ దొడ్లోకివచ్చి జామ చెట్టుక్రింద నుంచుని ఎవరితోనో మాట్లాడుతూ ఉండేది మా మేడమీద కిటికీలోనుంచి నేనూ చూస్తూవుండేవాడ్ని. నేనిలా చూస్తున్నానని మాత్రం ఆమెకు తెలియదు.

ఆమె అలా కనబడటం, ఆమె వెనకాల నిలబడి తల లూపుతూ ఉన్న ఆతాడిచెట్టూ, ఆ వెనకాల అస్తమయ కాంతుల సుందరమైన ఆకాశం, ప్రొద్దు గూకులూ, పని చేసిన ఈజీవికి మహా ఆనందం ఇస్తూఉండేవి.

నాలుగు రోజులన్నా గడవలేదు. ఐదవరోజు నే నల్లా చూస్తూఉండి బాహ్య ప్రపంచాన్ని మరచిన స్థితిలోనుండగా ఎక్కడనుంచి వచ్చిందో వచ్చింది కాంతం. నా వెనకాల నుంచుని కాపేసి గమనిస్తున్నది కామాలు. పక్కా మనిషి నాకు తెలియనే తెలియదు.

'చూడండి' అన్నమాట విని ఉలిక్కిపడి చూశాను. మాఆవిడే నుంచున్నది. నాకెదురుగా చంకలో పసిదాన్ని ఎత్తుకొని. పసిది బోసినోటితో వరహాలు వలకబోసి చేతులు చాచింది ఎత్తుకోమని.

ఎంచేతో వళ్ళుఝల్లుమన్నది. పిల్లను అందుకోలేదు. కళ్ళజోడుమట్టుకు తీసి తెల్లటి గుడ్డతో తుడుచుకొని మళ్ళీ పెట్టుకొన్నాను.

నేను ఆమెవంక చూచి దొంగనవ్వు నవ్వి, పుస్తకం వంక చూస్తూ, ఒకఅరనిమిషంలో పేజితిరగేశాను. ఆమె నావంక అదేదో ఒకవిధంగా చూచి, తనను తాను చూచుకొని పసిదాని కనుపాపలలో పలకరించుకొన్నది.

'ఎంత కఠినముండీ, పసిది ఎత్తుకోమని చేతులెత్తుతూ ఉంటే' అన్నది చంటిబిడ్డను ముద్దాడి దాని మెత్తని పాదా

లను పొంగిన ఎదురు రొమ్మున ఆన్చుకొని, దానిపువ్వులాంటి చేతులతో తన ముంగురులను సవరించుకొంటూ.

"అవును. చదువుకొంటున్నాను" అన్నాను. విశ్వామిత్రుడు శకుంతలాని ఆకర్షించాలని చూపిన చూపులతో.

"అవునవును. చూస్తూనేఉన్నా మీచదువు" అన్నది. కాంతం అదోవిధంగా తల ఊపుతూ.

"చదవటంలేదా మరి"—అన్నాను.

కాంతం మాట్లాడలేదు. కిటికీలోనుంచి జామ చెట్టు వైపునకు చురచుర చూచి "అటుచూస్తూనేకదూ చదవటం" అన్నది.

"ఇప్పుడే. అటూ, సూర్యాస్తమయాన్ని చూచి ఆనందిస్తున్నాను. పశ్చిమ దిక్కంతా ఎర్రబడి మనోహరంగా ఉంది. సూర్యుడు బంగారం బంతిలాగ ఎల్లాగ మెరుస్తున్నాడో చూడరాదూ నీవుకూడా?"

"మీరుచూడండి కావాలంటే నాలుగు వైపులానూ, ఎనిమిది దిక్కులానూకూడా. నాకు వీళ్ళే సూర్యచంద్రులు, మా చిట్టి సూర్యచంద్రుడు. చూడండి ఎట్లా నవ్వుతుందో?"

"............"

"మిమ్మల్నే.........ఏమిటాపుస్తకంలో. ఏముంది? చిట్టే నాకో పెద్దపుస్తకం చూడండి ఏముంది ఆ పుస్తకంలో అంటే."

"చదువుకోవాలె మాట్లాడించక"

అబ్బ! ఈ చదువు ఎప్పుడూ ఉన్నదే. ఇంకా నాలుగు నెలలైతే ఇది పెద్దదౌతుంది. ఈముద్దుకాస్తా వుండదు" అన్నది నవ్వుతూ.

"మరేం భయంలేదు. అప్పటికి ఇంకొకత్తె తయ్యారు!" అన్నాను కొంటెతనానికి.

"చాల్లెండి. ఏంమాటలవి, ఏముద్దు కాముద్దే!" అన్నది పసిదాన్ని గట్టిగా అదుముకొంటూ,

ఇంతలో నేను అప్రయత్నంగా అటూ, ఆజామచెట్టు వైపునకు చూశాను. ఆమె అక్కడే ఉంది అటు పశ్చిమాన అస్తమయ కాంతులతో ఆకాశం, ఇటు తూర్పున జీవితానికి ఆనందం ఇయ్యటానికై అమృతభాండంతో చంద్రుడూ ఉన్నారు.

"ఏమిటంటావు కాంతం? ఏముద్దు కాముద్దేననా? అవును. ఏముద్దు కాముద్దే" అని అన్నమాటే రెండుసార్లు అనుకొంటూ తలవంచుకొని పుస్తకంవంక చూస్తూ కూర్చున్నాను కాంతం గిరుక్కున తిరిగి చరచర నడిచిపోయింది.

వేసగికాలపు రోజులు కావటంచేత ప్రొద్దుగూకటంతో పిల్లలు అన్నంతిని వేగిర నిద్రపోయినారు. పెద్దది మాత్రం ఫిడేలుమీద రెండుకీర్తనలు పాడి ఆవలించి నిద్రపోయింది. నేను ఇంకా చదువుకొంటూ వుండంగానే అరగంటలో ఇల్లు సద్దుకొని వచ్చింది మా ఆవిడ.

ఏదో అనుకోటమే కాని, నిజానికి ఏం తక్కువ మా

కాంతానికి? సన్నగా తీగలాగ లేదు. కాని తగుపాటి వలయం కలిగి గున్నమామిడి లాగుంది. ఒక రకం మామిడి చిగురు చీర కట్టింది. పెదవులు ఎరుపెక్కి కెంపుల్లాగ మెరుస్తున్నవి. ఆమె మామూలు సంసార స్త్రీల వలెనే అలంకరించుకొంది అని మాత్రం అంటాను. ఎందుకంటే మాఆవిడను నేను అంతగా పొగుడుకోటం ప్రశస్తం కాదు కాబట్టి.

భోజనానంతరం ఒక అరగంట పిచ్చాపాటి మాట్లాడుకోటం మా యింట్లో మామూలు. ఆ రోజు ఎంచేతనో కాని ఆమె ముఖాన్ని చూడటానికే నాకు భయం వేసింది. నిజానికి నేనేం దుర్మార్గం చెయ్యలేదు. హాస్యాలు చేసేవాళ్లు చేస్తున్నారు. కొంపలు తీసేవాళ్లు తీస్తున్నారు. వాళ్లంతా తగుమని తలెత్తుకొని తిరుగుతూ వుంటే ఏపాపమెరుగని నాకీ బాధ ఎందుకో నాకు తెలియటం లేదు. నరాలు బిగువు తగ్గి గుండె జారిపోయి నట్లుయింది.

కాంతం ఈనెల తీసిన తమలపాకులు ఒక చేత్తోనూ, వక్కపొడి మరోచేత్తోనూ, పట్టుకొని కుచ్చెళ్ళు జారొత్తుకుంటూ హంసలాగ నడుస్తూ ప్రవేసించింది గదిలోకి. నేను కిటికీ ప్రక్కన గదిలో కూర్చుని ఉన్నాను.

ఒక చిరునవ్వు ఆ గదిలో తళుక్కున మెరిసింది మామూలుగా నా హృదయానికి ఉల్లాసాన్ని, సంతోషాన్ని కలుగజేసే, ఆమె చిరునవ్వు ఆరోజు నాకు ఎలక్ట్రిక్ షాక్ లాగ తగిలింది. తలొంచుకు కూర్చున్నాను.

"ఏం? అట్లా ఉన్నారు" అన్నది, బల్లమీద తమలపాకుల మడుపులు పెడుతూ.

నేను తలెత్తి చూచాను మా కాంతం ముఖం కేసి, గుండెలు చీల్చేసే చిరునవ్వు. ఆ తాంబూల రాగంతో ఎరుపెక్కిన ఆ చిరు పెదవులపైన కాపేసుకుని కూర్చున్నది నా చూపును ఆహ్వానించటానికి. ఆ నవ్వును చిల్లర క్రిందమారిస్తే, అరడజను భావగీతాలు, నాలుగు ఖండ కావ్యాలు, ఒక బంధకవిత్వంతో కూడిన ప్రౌఢ కావ్యం అవుతుంది. శబ్దంలోకి మారిస్తే ఒక పెద్ద దండయాత్ర సాగించటానికి ముందు పేల్చిన ఫిరంగి శబ్దం అది. తేజస్సులోకి మారిస్తే కలుష హృదయాలను కాల్చేయగల మహాతేజస్సు అది.

వంచిన మొఖం ఎత్తకుండానే "చూడూ, కాంతం ఇవ్వాళ్ళ నాకు తలనొప్పి ఎక్కువగా ఉంది. ఈ కాస్త చదివి పడుకొంటాను. నన్ను అట్టే మాట్లాడించకేం" అన్నాను, మొహం చిట్లించి బాధను నటిస్తూ.

"అయ్యో, అల్లాగండి పాపం! కాస్త అమృతాంజనం రాయనా" అన్న మాటలు ఆ మెరుపును వెంబడించినాయి.

నిజంగా అమృతాంజనం కణతలకు రాస్తే అరగంట దాకా పోదు మంట. అందుకని అమాంతం తెచ్చి ఎక్కడ పట్టిస్తుందో నా కణతలకని చప్పున "వద్దు, వద్దు, ఏమాత్రం వద్దు. అదే పోతుంది" అన్నాను.

"అలా కాదు. కొంచెం రాయనీయండి దేనికైనా మందు వేయండి పో''దని విరగబడి నవ్వుతూ అన్నది. ఆ నవ్వు మళ్ళీ వెలుగులోకి మారి కరకు కత్తి మెరుపులాగ మెరిసింది నా కళ్ళముందు.

ఇవ్వాళ నాకేదో మందు వేయటానికే సిద్ధపడ్డదిగా బాబూ, అన్న భయంతో చలించిపోయిన మనస్సును కుదుట బెట్టుకొని "వద్దువద్దులే, ఇంకా ఎక్కువైతే రాద్దువుగానిలే" అన్నాను, నరాలు బిగబట్టి.

"అలా కాదు; నామాట వినండి. మొదటనే సరియైన చికిత్స చేస్తే మంచిది కాని వ్యాధిని ముదరబెడితే శస్త్ర వైద్యానికైనా కుదరదని, మా తమ్ముడు నాకెన్నో సార్లు చెప్పాడు. డాక్టర్లకంటె ఎక్కువ తెలుసా మీకు'' అన్నది ఎత్తుకు ఎత్తు వేశానన్న బ్రహ్మాండమైన సంతోషాన్ని కుదించుకుని ఉన్న మరో చిరునవ్వుతో. కాంతం ఎందుకు ఇట్లా మాట్లాడుతున్నదో ఎందుకిట్లా చిరునవ్వులతో కోస్తున్నదో నాకు తెలుసు. కాని ఏం జేసేది?

"అయితే పెద్దది సంగీతం సాధన చేసిందా ఇవ్వాళ" అన్నాను. విషయం మార్చేద్దామన్న ఊహతో.

"ఎల్లాగో పిల్లసంగతి విచారించేరే! పెద్దదీ చిన్నదీ బుల్లిదీ, పెద్దవాడు—చిన్నవాడూ అయిదుగురు పిల్లలతండ్రి నన్న విషయం కాస్తజ్ఞాపకం వస్తూ ఉందీమీకు!'' అన్నది చెవిదగ్గరగా జేరి మాటామాటా సాగించి సన్న రాగచ్ఛాయతోను.

"ఏం? అల్లా అంటావేమిటి? అంత జ్ఞాపకం లేకుండా సంచరిస్తున్నా నన్నావా?"

"ఏమో లెండి? బళ్లోనుంచి రావటం, కిటికీవద్ద కూర్చోటం, పుస్తకం దగ్గర పెట్టుకొని చదవటమే చదవటము కాని పిల్లల సంగతి విచారిస్తున్నారా? ముద్దులుమురిపాలుచూచి ఆనందిస్తున్నారా?" అన్నది. చదవటమే చదవటం అన్నమాట ఎట్లా ఉచ్చరించిందో గాని నా చెవులో అది సీసమైపోయింది ప్రతిధ్వనులు పలికింది.

"అంతమాత్రం తెలియక కాను........."

"అప్పన్నెండి. తెలియక కాదు మధ్యమధ్య మత్తు వస్తూంటుంది" అన్నది మళ్ళీ వికటంగా నవ్వుతూ.

"వస్తే వచ్చిందిలే......—చస్తున్నాను. నీనవ్వుతో కోసేస్తున్నావు" అన్నాను కోత పడలేక.

"ఇల్లాచూడండి నా కళ్ళెంత......"

"ఏం! నీకళ్ళేమైనా, ఆకర్ణాంత విశాల నయనాలా? వినీలకాంతి నిలయాలా, నీలి నీలాంబర నిధులా? వెన్నెల కుప్పలా!........."

"ఆగండి—ఆగండి. ఎవరి కళ్ళన్నా......ఈ ప్రపంచంలో ఎవరివైనా, అట్లా ఉంటయ్యా? కర్ణాంతాలదాకా కళ్ళున్న మిడిగుడ్ల పెద్దమ్మగాని నీలమైపోయిన కంటిజబ్బు మనిషి గాని మహా అందంగా ఉంటుంది కావాలు మీ ఊహకు. అడ్డమైన పుస్తకాలు చదివీ మతిలేని రాతలన్నీ..."

'ఆగు......అయితే కళ్ళల్లో అందం అంటూ లేదంటావా? అమ్మాయి కళ్ళు జూడు ఎంత కాంతిగా ఉంటయో, అన్నాను సూటిగా తగులుతుంది అనుకొని పోటు అన్న ఊహాతో పోయిన యౌవనాన్ని తల్చుకొని కాంతం సిగ్గుపడుతుందన్న ధైర్యముతో ఆమెవంక చూశాను తలెత్తి.

ఒక అరక్షణం మాత్రం ఊరుకొని అల్లాగా అండి; అమ్మాయి కళ్ళు అచ్చంగా నాకళ్ళే అంటారే అందరూనూ' అన్నది.

ఇక మాట్లాడలేక పోయినాను. ఇక బైట పడదామని 'సరే' ఆమాట అట్లా వుంచు. ఏమిటి ఇవ్వాళ ఈ సూటీపోటీ మాటలు? మనస్సులో సంగతి విప్పి చెప్పు' అన్నాను ఏదో ఒకటి తేల్చుకుంటే మంచిదని.

'విప్పి చెప్పేందు కేమున్నది? అయినా నేనేమన్నాను' అన్నది కాంతం మళ్ళీ నవ్వుతూ.

'కాదు లే, నే చెబుతాను పట్టు. నేనా కిటికీవద్ద కూర్చుని ఆపిల్లవంక చూశానని కాదు నీకు కోపం?'

'అవును' అన్నది కాంతం చురచుర చూస్తూ,

' అట్లా బైటకురా, నిన్ను నిమిషంలోకి ఒప్పిస్తా నేను జేసింది ఏమీ తప్పుపనిగాదని.'

సరే చెప్పండి! చూద్దాం.'

'మరేమి లేదు. పరస్త్రీవంక దురుద్దేశంతో చూస్తే తప్పు అంటావు గదూ?'

అవును.'

'నేను ఏదుద్దేశం లేకుండానే ఆవేపు చూశాను. ఇక సరేనా?'

'ఏదుద్దేశంతో' లేకపోతే......ఎందుకు చూట్టం'

ఊరికేనే! అందమైన మనిషి కాబట్టి''

'అయితే ఆవిడ మన పెద్ద పిల్లకంటె అందమైన మనిషా? దాని కళ్ళు చూడండి ఎట్లా మెరుస్తుంటాయో? దాని చేతులు ఎట్లా మెత్తగా ఉంటాయో! చిట్టి తల్లి నవ్వులలో వరహాలు కలబోస్తుందే! అబ్బాయి వచ్చి దానిమాటలు వీణెల మీటువలె ఉంటుందని మీరే అంటారే! సౌందర్యానికి అట్టే చూడాలా?' అన్నది కాంతం తన ప్రతిబింబాలను చూస్తూ తానే సౌందర్యాధి దేవత అయినట్లూ, తన్నే నేను ఉపాసించాలిసినట్లూ చూస్తూ,

పిల్లల మాటెత్తి సౌందర్యానికిఅట్టే చూడాలా?అనే సరికి మనస్సు చివుక్కుమన్నది. ఎదుట నున్న కాంతాన్ని చెయ్యి పట్టుకొని దగ్గరగా రమ్మన్న వుద్దేశాన్ని వెలిపుచ్చాను.

''అబ్బ! లాగకండి. చిన్నదానికి జబ్బుచేసినపుడు రాత్రింబవళ్ళు కంటిమీద రెప్ప వాల్చకుండా కనిపెట్టుకుండటం మూలాన వళ్ళు నీరసించి పోయింది. మీరో మృదుత్వ......నిగనిగ కోమలత్వం పోయిందని...'

కంపితకంఠంతో ఆమాటలు అంటున్నపుడే రెండు వేడి కన్నీటి బొట్లు ఆచిక్కి సన్నగిల్లిన చెక్కిళ్ళపై నుండి క్రిందకి జారినై.

తప్పు......కాంతం......వద్దు ఇటు చూడు... తలనొప్పి పోయింది......మాట......మాటంటుంటే ఇదే పెంకెతనం......ఏదీ?......"

"అబ్బ!.........పోయిన......"

"అలాగ కాదు......ఇటు......ఇటు......"

"ఎందుకండీ

"అదేమన్న మాట......ఏముద్దు కాముద్దే."

# ఎండ—వాన

"ఇదిగో? చూడు! కాస్త అట్లా వెళ్ళొస్తా"అన్నాను. దొడ్లో పని చేసుకుంటున్న కాంతాన్ని పిలిచి. అప్పటికి ఇంకా బాగా చల్లబడలేదు. సాయింత్రం మూడు గంటలై ఉంటుంది. శనివారం ఆరోజు. స్నేహితులంతా సముద్రపు ఒడ్డుకు పోతుంటే నాకు వెళ్ళాలని సరదాపుట్టి బయలుదేరాను. సముద్రపు ఒడ్డు కెళుతున్నా నంటే ఆవిడ ఏమంటుందో ఏమోనని, అట్లా అన్నాను.

"ఇదుగో చూడండి, వెళ్ళొద్దు ఇవ్వాళ. నాలుగు రోజులనుంచీ పిల్లలు ఏమైనా పెట్టమని మారాం చేస్తుంటే ఈవాళ కాస్త పప్పు నానపోశాను. మీరు పిల్లలను పటు

కొంటే నేను అవి వండుతాను. నామాట విని మీరుఇవ్వాళ ఇంట్లో ఉండండి. రేపు మీఇష్టం'' అన్నది కాంతం తలెత్తి నావంక చూచి నవ్వుతూ.

కాళ్ళకు బంధం సంకెళ్ళేస్తున్నదిరా భగవంతుడా అనుకొని ''అట్లా కాదు. నేనిప్పుడే వస్తాను'' అన్నాను వినయపూర్వకంగా.

''అయ్యో! పాపం, రాకేం రోజూ రావటంలేదూ? సోమవారం మీటింగు వచ్చింది. మంగళవారం అర్జంటు పని విరుచుకు పడ్డది. బుధవారం ఏదో అధికార్లతో మాట్లాడాలిసి వచ్చింది. గురువారం ఇంకో టేదో దొరికింది. శుక్రవారం మొఖం తేలేసి రేపటినుంచి రాకపోతే చూడు! అని బిక్కముఖం వేశారు. మీరు రాకేం! మీ మాట నమ్మకం లేకేం!'' అన్నది ముక్కు మూతి విరుస్తూ

''ఇవ్వాళ చూస్తావుగా నామాట నమ్మకం. ఆరు గంటలకల్లా రాకపోతే అప్పుడను.''

''ఆరింటికల్లా తప్పక వస్తారా!''

''తప్పకుండా వస్తాను.''

''పిల్లలకు తల దువ్వి నీళ్ళు పోసి సిద్ధంగా ఉంటాను.

''సరిగ్గా ఆరింటికల్లా రావాలెసుమండీ!''

''నీవు ఇంతగా చెప్పాలా? ఆరయ్యేటప్పటికల్లా వస్తే సరిగద.''

''చూడండి; వస్తానంటే కాదు. తప్పక రావాలె.''

రోజూ మోస్తారు గాదు. తీరా పప్పు నానపోశాను. తమకు బయటికి వెడితే పెళ్ళాం బిడ్డల మాటుండదు'' అనికచ్చితంగా చెప్పింది.

"అబ్బ! నామాట నమ్మవుగదా? తప్పక వస్తానని ఎన్నిసార్లు చెప్పాలె? ఎందుకింత అపనమ్మకం" అని గట్టిగా మాట మాటనూ నొక్కుతూ చెప్పేశాను. వీధి గుమ్మం దాటి రెండడుగులు వేయగానే,

"ఇదిగోనండోయి, ఒక్కమాట" అని మళ్ళీ పిలిచి, "తప్పక వస్తారు కాదూ. ఇవ్వాళ రాకపోతే నాకు ఇదిగా ఉంటుంది. నేనూరుకోను" అని గట్టిగా చెప్పింది.

ఎట్లాగయితే నేం బయట పడ్డాను. నేను వెడుతూ ఉంటే, మలుపు తిరిగేవరకు చూస్తూనే ఉంది కాంతం నా వంక. నా హృదయంలో ఉన్న దొంగతనం నడకలో ఎక్కడైనా కనిపిస్తుందేమోనని కామోసు. నేను మట్టుకు తిరిగి చూడకుండా వెళ్ళిపోయి, ఇన్ని కాఫీనీళ్ళు త్రాగి స్నేహితులను కలసికొని సముద్రానికి బయలుదేరాను.

* * * *

సముద్రపుటొడ్డున ఇసుకలో కూర్చున్నాము. అచ్చటి చల్లగాలి, సముద్రపుటలల వంపులు, విరుగుళ్లు సాయం సమయాన ఆకాశంలో కనబడే చిత్రవిచిత్రమైన రంగులూ, సముద్రపు పక్షుల రవరవలూ, మనస్సును మహా ఆనందంలో

ముంచేసినాయి. అప్పటికప్పుడే ఉదర పోషణార్థమై ప్రొద్దు గూకులూ శ్రమ పడ్డ పక్షులు ఇంటికి చేరుకొంటున్నవి. ఇంటికి వేగం రాకపోతే మగపక్షులను, ఆడవీ, ముక్కులతో పొడుస్తవి గదా! అని జ్ఞాపకం వచ్చింది. సూర్యుడు కూడా సరిగ్గా ఆరింటికే వెళ్ళిపోతున్నాడు! ఆయనకి కూడా పెళ్ళాముంది కాబోలు.

నా స్నేహితులలో కొంతమందికి పెళ్ళాలున్నారు కాని వాళ్ళు యింటికి పోదామనే అనరు. ఆ ఊసే ఎత్తరు ఒకడు రాగాలు తీయనూ, ఒకడు ఆకాశంవంక, ఊ, చూడనూ! ఇంకొకడు నక్షత్రాలవంక అట్టె వెఱ్ఱిచూపులు చూస్తూ ఆనందం పొందనూ! ఇట్లా వాళ్లంతా ఆనందంలో మునిగివున్నారు. నాకుమాత్రం ఇంటికి వేళకు వెళ్లకపోతే ఎట్లాగా అన్న విషయం తప్ప మరోటి తోచటంలేదు. ప్రపంచమంతా ఒక్క భార్య అయింది నాకు.

ఇంతలో మాలో పెద్దవాడు, కవి, ఆయన "ఏమోయి, ఈ రాత్రి అంతా ఇక్కడ ఉండి పోదామా" అన్నాడు. ఆ మాట వినేసరికి నా గుండెల్లో గుభేలు మన్నది. సరే నంటే సరే నన్నట్టున్నారు వాళ్ళు. ఆ ప్రక్క పల్లెలో పెరుగు పాలు కూర నార అన్నీ దొరుకుతాయనీ, అన్నం వండుకొని తినే సదుపాయాలున్నాయనీ, తెల్లవార్లు ఆ పండు వెన్నెలలో సరదాగా కాలం గడపొచ్చొనీ అనుకోటం, ఆమోదించు కోటం, జరిగి పోతున్నాయి. నా గుండెల్లో

ఇంజను గబగబా వర్కు చేస్తున్నది!

చివరకు సూర్యనారాయణగారు నావంక తిరిగి, ఏమిటోయి, ఆలోచిస్తున్నావు' అన్నాడు. నేనుమాట్లాడ లేను. కవిత్వంలో పడ్డాడని ఒకరూ, ప్రకృతి వైభవాన్ని చూచి ఆనందిస్తున్నాడని ఒకరూ అనటం మొదలుపెట్టారు. నాగోల వాళ్ళకేం తెలుసు?

చివరకు వాళ్ళతో నేను కవిత్వమూ కాదు గడ్డా కాదు నాకోసం ఒకాయన ఆరుగంటల బండికి వస్తాడు. అతనితో అవసరంగా మాట్లాడ వలసిన విషయం ఉంది ఎట్లాగా అని ఆలోచిస్తున్నా' నన్నాను.

వాళ్ళు ఎన్నో అడ్డువాట్లు వేశారు, అవసరం ఉంటే ఆయనే వుంటాడనీ, ఒకపూటలో మునిగి పోయే దేమీ ఉండదనీ, ఏమేమో తోచినట్లు తలోమాట అన్నారు.

'అది కాదర్రా, నేను ఈమధ్యకొన్ని పుస్తకాలు వ్రాశాను. వాటి బాపతు సైకం నాకియ్యాలసి ఉంది. ఆవిషయమై మాట్లాడ డానికే ఆయన వచ్చాడు. ఆయనను కలుసు కోకపోతే నాకు చాలానష్టం' అని వెధవ అబద్ధా లన్నీ ఆడి వాళ్ళను నమ్మించి ఇంటికి లేవతీశాను.

నాబ్రతుకు బండలైతే అన్నీ అబద్ధాలేకద! ఇంటి దగ్గర ఆవిడతో ఆడింది అన్నీ అబద్ధాలే! ఇక్కడ వీళ్ళ తోనూ అబద్ధాలే! వెధవ జీవితం అనిపించింది. నిజానికి నేనీ మధ్య వ్రాసింది రెండు ప్రామిసరీ నోట్లుతప్ప ఇంకేమీలేదు.

ఎట్లాగో వాళ్ళను కదిల్చానన్న మాటేగాని వాళ్ళు వేగంగా నడవరే! కబుర్లు చెప్పుకొంటూ చల్లగాలి అనుభవిస్తూ పెళ్ళి నడకలు నడుస్తారు వాళ్ళు నా మనస్సు ఊహ ముందుకు పరుగెత్తుతుంది. కాంతం నాకోసం ఎదురు చూచి చూచి విసుగెత్తిపోయి ఉంటుందనీ, అన్నిసార్లు చెప్పినా మోసగించారే అని మనోవ్యధ పడుతుందనీ ఆలోచన. వేగమే వెళ్ళకపోతే మానె, మామూలు వేళకైనా వెళ్ళకపోతే ఏమి సాధిస్తుందో అని నా ఆందోళన.

కాని వాళ్ళగోలలో వాళ్ళున్నారు. వాళ్ళతోపాటు నేను సరదాగా లేకపోవటం మూలాన 'ఛీ, వీడ్ని ఎప్పుడూ తీసికొని రాకూడ' దని వాళ్ళలో వాళ్లు విసుక్కొనే ఉంటారు. నేనూ కని పెడుతునే ఉన్నా. ఇంటికి వచ్చేసరికి పది గంటలైంది.

తలుపుతీసింది లోపలికెళ్ళాను. నేను ఇంటికి రావటంతోనే తలుపుదగ్గరే,. తీయటంతోనే, అనాలిసినవి రెండూ అనేస్తుంటం మామూలు. తలుపు తీయటంతోనే ముఖం మీాద ముఖంపెట్టి, నవ్వుతోనో, కోపంతోనో ఇంత ఆలస్యంగా వచ్చారేం అనో రోజూ ఇంతేనా అనో ఎవరు మేలుకు కూర్చుంటారనో ఏదో ఒకటి అనటం మామూలు ఆలస్యంగా వచ్చినరోజున పడాలసినవి నాలుగు పడకపోతే కష్టంగావుండే స్థితికొచ్చింది నాసంగతి.

ఆ రోజున అంత ఆలస్యంగా రావటం మూలాననాకు

కొంచెం ద్విగుణంగా లభించాలిసింది. కాని తలుపుతీసే తియ్యటం తోనే, కాంతం ముఖం నాకు కనపర్చకుండా తిప్పేసుకొని గదిలోకి పోయి పండుకొన్నది.

పిల్లలు అంతా నిద్రపోతున్నారు. చిన్నది మాత్రం మేలుకున్నది. సాధారణంగా కాంతం నాకు అన్నం పెట్టి తానుఎదురుగా కూర్చోటం మామూలు ఆరోజున నాదగ్గ రకే రాలేదు.

వంటఇంట్లో వెండికంచం పెట్టి ఉంది. పీట వేసిఉంది కావలసిన వన్నీ అక్కడే సిద్ధంగా ఉన్నవి నెయ్యి లాంతర మీంద కరుగుతూ ఉంది. నిద్రమత్తు చేతనో లేకపోతే పట్ట రాని కోపంచేతనో ఇట్లా చేస్తున్నదిగదా అను కొన్నాను. చిన్నది నాదగ్గరకు వెడతా నంటూంటే దాన్ని అదిమిపెట్టి తన దగ్గరే పడుకో బెట్టుకున్నది. అది నాన్నదగ్గరకుపోతా నవి తన్నుకోటం 'ఇవ్వాళ మధ్యాహ్నం నిద్రబోయినావు కాబోలు, మేకులాగ కూర్చున్నావు. పడుకో' అని ఆమె కసరుకోటం నాకు వినపడుతునే ఉంది. పోనీ, దాన్ని రాని య్యవే కాసిని మంచినీళ్ళయినా అందిస్తుంది' అని నేను కేకేశాను. పిల్ల నా మాట విని లేవబోయింది కామాలు కాంతం దాన్ని గదమాయించి నిద్రపొమ్మని కసురుతూ ఉంది.

ఇదంతా ఏదో కొత్త శిరస్తాగా కనుపించింది నాకు. ఆవిడకు కోపంవస్తే పిల్లలచేత నాకు కావలసినవి ఇప్పించటం,

కావలసిన పని చేయించటం, ఇదివరకు జరిగే ఆచారం. ఇవ్వాళ ఇట్లా చేస్తున్న దేమా అని అనుకొని సరే తెలుస్తుందిగా ఇంకాసేపట్లో అని సమాధానం చెప్పుకొని భోజనం పూర్తి చేసి తమలపాకుల పళ్ళెంముందు మామూలు రాజీనామా, జరుగుతుందిగదాఅని ఆశపడుతూ గదిలోనికి వెళ్ళాను.

లేదు. జరిగేటట్లు లేదు. తమలపాకుల మాటేలేదు. ఆవాసనేలేదు. పిల్లముట్టుకు నానొస్తాయి' అని ఏమో చెప్పబోతుంటే కాంతం పిల్లనోరు మూసి అదిమి పెట్టి మాట్లాడ నియ్యటంలేదు.

'దానిని మాట్లాడ నియ్యవేం' అన్నాను.

'ఏమిటి మాట్లాడేది అన్నది' కాంతం కోపంగా.

'పోనీ నీకుకోపంవస్తే మాట్లాడక దానిని మాట్లాడ నియ్యి' అన్నాను.

జవాబు లేదు........

'తమలపాకులో' అన్నా.

'లేవు' అన్నది.

'సరే జరుగు' అన్నా వక్కపలుకు కటిక్కిన కొరుకుతూ. కాంతం మెత్తని బూరుగదూది పట్టుదిండులోకి తల దూర్చి బోర్లపడుకొంది. నేను కూర్చున్నా. ముఖం ఎత్తనైనా ఎత్తలేదు. పిల్లమాత్రం తల్లి పట్టు వదలినప్పు డల్లా 'నానొస్తాయి' అని ఏమిటో చెప్పబోతుంది. కాంతం మట్టుకు దానినోరు నొక్కేస్తున్నది.

సిగ్గు బిడియము, అసలే తక్కువ మా ఆవిడదగ్గర. అయినా కాపరానికొచ్చి ఏడెనిమిదేండ్లయింది. కాబట్టి ఆ మనిషి ఇల్లా ప్రవర్తించటం, నావంక చూడలేనంత సిగ్గు పడటం ఎందుకో నాకు బోధపడలేదు. పిల్లనోరు నొక్కేయటం ఎందుకో అది మరి చిత్రంగా ఉంది.

మనిషినిచూద్దామంటే సరిగ్గా వుంది. పూలు అర్ధచంద్రాకారంగా నల్లని జుట్టులో ఉండటం ముద్దుగా ఉంది. కట్టుకొన్న నల్లచీరనూ, తొడుక్కొన్న ఖాదాసిల్కు రెవికను చూస్తే శరీరంలో అస్వస్థతగా ఉందనిగాని అనుకునేటట్లు లేదు.

అయినా మా కాంతం, కోపం వస్తే, ఇల్లా ప్రవర్తించే మనిషి కానేకాదు. అత్తవుండేది మామవుండేది, చిన్న వుండేది పెద్దుండేది అనదలచుకొన్నమాట అనేయటమే ఆమెమతం. ఒక రోజు కాదు రెండు రోజులు కాదు ఎనిమిదేండ్లనుంచీచూస్తున్నా. ఆవిడకు కోపంవస్తే చేసే హంగామా వేరు. కొత్తగా కాపురానికివచ్చిన పిల్లలాగ కన్నెత్తి చూడలేనంత సిగ్గు పడటానికి కారణం కనపడదు.

మరేమిటివికారం? ముఖకవళికలు చూద్దామని గడ్డం పట్టుకొని నావైపుకు త్రిప్పుకుందామని చూస్తే ససేమిరా తిరగదే! తన్నుకొంటుంది గాని నన్ను చూడదే! విచారం అయితే నిక్షేపంలాగ ఏడిస్తేమట్టుకు అడ్డొచ్చే వాళ్ళెవ్వరున్నారు? విరహం కాదు. మరెందుకూ ఈసిగ్గు? పైగా పిల్లను మాట్లాడనివ్వదేం?

ఇవి నాసందేహాలు. నాకేంతోచింది కాదు. మనస్సు పాపిష్టిది. ఎంత దుర్మార్గాన్నన్నా ఊహిస్తుంది. ఏదైనా తప్పుపనిని చేస్తేపిల్లనూరాచింది కాబోలు. అది చెప్పేసెయ్యాలని చూస్తుంటే ఈమనిషినోరు నొక్కి పెడుతున్నది అని అనుకున్నాను.

ఈమాట అనుకోనేసరికి నరాలపట్లన్నీ సళ్ళిచ్చినా[illegible] ఛా, పిల్లల తల్లినిగురించి నేనిట్లా అనుకోవటం అసహ్యం అని నాకే తోచింది మళ్ళా. కాని ఈప్రవర్తన ఏమిటా? పిల్ల దాని నోరు నొక్కటం ఎందుకా? అన్న సందేహాలు బాధిస్తూనే ఉన్నాయి.

ఇంతలో అమ్మాయి మళ్ళీ ఇంకోసారి "నాన్నోయి, అమ్మో, మరే, ఎవరో నీకోసం......ఆయన......నీకోసం వచ్చాడునాన్న. అప్పుడే......అమ్మో......మరే, ...... అమ్మో......" అని మాటకోసం తడుముకొంటూంటే తల్లి "హుంయ్, ఊర్కో" అని దాని నోరునొక్కి మాట్లాడనీయక పోవటం నాసందేహాలకు తోడై అనుమానంలోకి చటుక్కున దించేసింది.

ఈ మాటలు వినేసరికి ఆ అనుమానం నన్ను దయ్యంలా పట్టుకొన్నది.

ఎవరో నిజమే అని చెప్పినట్లయింది, చెవులలో రైళ్ళు కూసినాయి. తలకాయలో కోతులాడినై.

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

రైళ్ళు పరిగెత్తుతున్నాయి. బండ్లు మోటార్లు బజారు, మేడ, గోడ, అద్దం, గడియారం, త్రాగుబోతులు, సముద్రంలో పడవలు అన్నీ ఊగుతున్నవి. ఒకటే ఊగుడు ఎగిరి పడ్డయి. మేడ, గడియారం, అద్దం, పెట్టెలు, అన్నీ లేచి బోర్లపడ్డాయి.

ఇంతలో ఎవ్వరో అన్నారు "నీకేమైనా వెర్రి ఎక్కిందా? ఆవిడ సంగతి తెలియదా? పొద్దస్తమానం పిల్లలతో సతమతం అవుతుంటే ఈలాంటి తలంపులు రావటానికైనా అవకాశం ఉందా? విషం పుచ్చుకోవటానికైనా తీరిక ఉందా ఆమెకు! అయినా చిన్నపిల్లా చితకపిల్లా అనుమానించటానికి. పాపిష్టి వూహాలు" అని ఎవరో చీవాట్లు వేశారు.

మళ్ళీ క్రమంగా పడవలు నీళ్ళ మీద తేలినయి. గడియారం కుదురుగా నిలబడ్డది. బజారులో మనుష్యులు సరిగ్గా మామూలుగా నడవటం కూడా కనబడ్డది.

ఇంతలో అమ్మాయి స్ప్రింగులాగ పక్కలోనుంచి లేచి, "నాన్నా, నాన్నా... ..అమ్మ...బుగ్గలు సాగతీసింది నాన్నా" అని చటుక్కున అనే అనటంతో నే కాంతం దాన్ని ఒక్కటి వేసింది. ఇంకా ఎవరో వచ్చారనీ, ఇంకేమో జరిగిందని ఆసంగతి అంతా చెప్పబోయినందుకు దాని బుగ్గలు తల్లిసాగదీసిందికామాలునని నేను విచారపడ్డాను. ఆ దెబ్బతో అది కాసేపు ఏడ్చి నిద్రపోయింది.

నేను పక్కమీద ఒదిగికూర్చుని 'కాంతం' అన్నాను. నామనస్సులో ఏదో చెప్పలేని బాధ ఏర్పడ్డది. నాగొంతు మారిపోయింది. నాకు కలిగిన వికారం నాకళ్లలో కనపడుతున్నదని నాకు తెలుసును. నాపళ్ళు, ముక్కు అన్నీ బహుశః వణికిపోతున్నవి. కాంతం బాగా తల యెత్తి చూచివిరగబడి నవ్వేటంతటి నవ్వును అణచుకొని మళ్ళీ దిండులో తలదూర్చ నవ్వటమో, ఏడ్వటమో తెలియకుండా వికారాలు చేయటం సాగించింది.

నాకు అంతా అయోమయంగా ఉంది నేను ఆవిడను అనుమానిస్తున్నానో లేదో నాకే తెలియదు. పరాయి మొగవాడు ఇంట్లోకివచ్చాడనీ ఏమిటో జరిగిందనీఅనుకొన్నప్పుడల్లా దేహం కంపించి పోతున్నది. అయినా అనుమానపడటం బుద్ధి తక్కువని నన్ను నేనే మందలించు కొన్నాను.

చివరకు ఆవిడ లేచి కూర్చుని 'మీరు అన్నిచెప్పినా ఇవ్వాళ ఆలస్యంగా ఎందు కొచ్చారు? అన్నది చురచుర చూస్తూ.

వస్తే నేం? ఏం ప్రమాదం' అన్నాను లేచికోపం తెచ్చుకొని.

'ఏమా? ప్రమాదాలే జరుగుతాయి' అన్నది పకా పకా నవ్వుతూ. వాన కురిసి వెలిసిన తరువాత ప్రకాశించే చంద్రుని కాంతులు ఆమె కళ్ళలో ప్రకాశించినవి

ఈమాటలు వినేసరికి చీకట్లు క్రమ్మినాయి చెవులు గింగిరుమన్నాయి.

'జరిగితే నేం' అన్నాను నేను లేనిపోని నిర్లక్ష్యాన్ని అభినయిస్తూ,

'జరిగితే నేమిటా! మీ కేమీ లేదు. నాకేగా ఆఅప్రతిష్ఠ' అని అక్కినావంక నిదానంగా చూచి ఏడ్వటం మొదలు పెట్టింది. నాకు కొంచెం భయంకూడా వేసింది. ఆ నవ్వూ ఏడ్పూ చూస్తే ఆవిడ కేమైనా దయ్యం పట్టిందా అని అను మానంకూడా వేసింది. ఆమాట అనుకోనేసరికి నాగుండె ఝల్లుమన్నది.

'శాంతం. ఈఏడ్పు ఏమిటి? ఈనవ్వు ఏమిటి? ఎక్కడైనా చీకట్లో భయపడ్డావా' అన్నాను.

'భయపడటం కాదండీ...'

'మరేమిటి'

'ఏమిటా భ్రమ?'

'ఆయన ఎవరో వచ్చారండి' అని మళ్ళీ పకాపకా నవ్వింది

'ఎప్పుడు? ఏమిటి సంగతి? ఏమిటి—ఎండా—వానాను!' అన్నాను.

'సాయంత్రం ఎనిమిదిగంటలకు ఎవరో వచ్చి మీరు మామూలుగా సైకిల్ బెల్ కొట్టినట్లే కొట్టాడండి. మీరే గదా అని నేను పోయి తలుపుతీసి పక్కగా నుంచున్నాను. చీకటిగా ఉన్నా ఆయన గబగబా లోపలికి వచ్చాడు. అట్లా

వస్తుంటే? అదీగాక మీనాన్నోస్తారే ఉండె!' అని మళ్ళీ విర గబడి నవ్వటం మొదలు పెట్టింది.

'వస్తే ఏమయిందేం?' అన్నాను కొంచెంఆదుర్దాతో

'ఇంకేం గావాలె!' అన్నది. విరగబడి నవ్వుతూ.

'నాకేమీ బోధపడలేదు. అంతా అయోమయంగా ఉంది. మతిపోతున్నది. దేహం తేలిపోతున్నది పిచ్చెక్కుతుంది కూడాను' అన్నాను ఆవిడవంక చూస్తూ.

ఏమిటండీ మీదంతా చిత్రం. చెప్పమంటూరా? చెప్తాను వినండి చెప్పకపోతే ఎట్లా?......'

'అదికాదండీ. మీకు సాయంత్రంవెళ్ళేటప్పుడుఅతగా చెప్పానా రమ్మని, మీరు తప్పకుండా వస్తారనుకొని పిల్లలకు తలలు దువ్వి నీళ్ళుపోసి చీర కట్టుకున్నాను, ఇంతలో ఆరూ అయింది. మీరు రాలేదు సరే ఇంకా కాసేపట్లో వస్తారనుకొని చిన్న పిల్ల పాలిచ్చి మిగతా వాళ్ళకు అన్నం పెట్టాను మీరు అప్పటికి రాలేదు. ఏడయింది. ఇంక ఎప్పటికొస్తారో అని ఆపిండి పాడైపోతుందని తునకలు చేయటం మొదలు పెట్టాను. మొదలు పెట్టానన్న మాటేగాని పిల్లలు చేయనిస్తారా కోతులూ కొండ ముచ్చులూనూ!

'అసలు విషయం చెప్పమంటే ఈసోదంతా ఎందుకూ?' అన్నాను.

చెబుతున్నా వినండి. పసిది మాట్లాడితే కొరువులు లాగుతుంది. ఆకుదుపుకు నూనె గిన్నె ఎక్కడ మీద

పడుతుందో అని భయం ఏం చేసేది? మీారు వస్తున్నా రేమోనని బైటకెళ్ళి చూడనూ, మళ్ళీ లోపలకెళ్ళి ఒక తునక బాణీలో వెయ్యనూ! ఇట్లా విరిగి తునకలైనాయి అవన్నీ.''

''ఇంతలో పసివాడు నిద్రొచ్చి పెద్దవాడు చమట పోసిందని ఏడ్వటం మొదలుపెట్టేరు. అవతల పిండి పాడై పోతుందాయె! చంకలో పిల్లాయె! ఇద్దరు పిల్లలూ చెరోవై పునా కాళ్లకు చుట్టేసుకొని ఏడుస్తుండిరి? ఎట్లా ఉంటుంది చెప్పండి! విసుగేమిటి? తలబద్దలు కొట్టుకుందామా అనిపించింది. మీారుండి వాళ్ళను కాస్త అవతలకు తీసికెడితే ఎంత సుఖంగా నేను పని చేసుకొనేదాన్ని! ఏడ్పు వచ్చిందంటే నమ్మండి.''

''అయ్యో! ఎంతా అవస్థపడ్డావు?......''

''చాల్లెండి, ఈ ఉత్తుత్తి సానుభూతి మాటలకేంలెండి అసలు సంగతి వినండి. ఇంతలో మన పొరుగింటి నరసమ్మ గారు కోడలితో పోట్లాడి ఆవిడమీాద నేరాలు చెప్పటానికి మన ఇంటికొస్తే, ''అమ్మ,అమ్మ'' అని ఆమెను బ్రతిమిలాడి ఆ కాస్తపిండి నూనెలో వేయించాను. ఈ సంగతి అట్లా ఉంచండి''

''పిల్లలుఏడిపిస్తున్నపుడు నాకుమీామీాదనమిలిమింగేద్దామన్నంత కోపం వచ్చింది. ఇంతలో సైకిలు గంట వినపడ్డది. సరే రానే వచ్చారు, తగిన శాస్తి చేయాలనుకొన్నాను

తలుపు తీసి తలుపు వెనకాలే నుంచున్నాను. చీకట్లోనా కైవ్వారైంది తెలియలేదండి. ఆ గిరజాలు అవీ అంతా మీ మోస్తరే ఉన్నాడాయన. ఆ బూట్సుల చప్పుడు కూడా అంతా మీ బూట్సుల చప్పుడులాగే ఉంది."

"ఇంకేం మీరే అనుకొన్నాను తెలివితక్కువ చచ్చిందాన్ని, ఆయనను గడపలోనికి రానిచ్చి రెండు బుగ్గలూరెండు చేతులతో పట్టుకొని గట్టిగా పిండాను. రక్తం వచ్చేటట్లు నొక్కాలని అనుకొన్నాను గాని ఆ కోపంలో,తీరా చెయ్యిచ్చేసరికి చేతులు రాలేదు, గట్టిగానే నొక్కాననుకొంటా. కాని చెయ్యి తగిలేసరికి ఏమిటో భయం వేసింది.చేతికి ఉన్న జ్ఞానం మతికి లేకపోయింది. మీరు గాదని నా చేతులే చెప్పాయి."

"వళ్ళు వణకెత్తిపోయింది. కంపమెత్తింది. తేళ్ళు జెర్రులు వళ్లంతా పాకినవి. ఇంక ఏం జెప్పేది? సిగ్గేమిటి? చచ్చిన చావు అయింది. కొయ్య బారిపోయినాను. ఇంట్లోకి ఎట్లా వచ్చానో నాకే తెలియదు, అమ్మాయి మట్టుకు అక్కడ నుంచుని మా నాన్న లేరన్నది."

"పాపం ఆ మానవుడు మాట్లాడకుండా"

"అమ్మా నేను సుందరాన్ని అని చెప్పండి."

"అని చెప్పి వెళ్ళి పోయినాడు. ఎంత అప్రతిష్ఠ!ఎట్లాగండీ ! ఎవరాయన? నాకిట్లా దుర్బుద్ధి పుట్టిందేం!" అని దీనంగా చూచి మళ్ళీ, కళ్ళనీళ్ళు పెట్టుకొన్నది.

సంగతి తెలిసిన తరువాత నాకూ నవ్వు వచ్చింది. 'అదా! అమ్మాయి 'బుగ్గలు సాగదీసింది నాన్నా' అని చెప్పింది సరే సరె......

'ఈమాత్రానికి సిగ్గుపడవలసిన పనిలేదు. వాడి బుగ్గలు సాగదీశావా? పోనీలే. ఆశాస్తి నాకు తప్పింది.'' అన్నాను నేను.

'చేసిన పని తలచుకొంటే నవ్వొస్తుంది, అప్రతిష్ఠ మాట జ్ఞాపకం వస్తే ఏడ్పొస్తుంది' అంది కాంతం.

'కాంతం. మరేం ఫరవాలేదు. ఏదో ప్రమాదాలు వస్తూ ఉంటవి. సుందరం పరాయివాడు కాదు. నా దగ్గర చదువుకొన్న కుర్రాడు. మొన్న మధ్య వచ్చి నాతో మాట్లాడి పోలేదూ? ఆయనే?'

'అల్లాగుటండీ, ఆయ నెవరో మేష్టరంటిరే?'

'ఇప్పుడు మేష్టరయినాడు. మనం గుంటూరులో ఉండంగా, మన ఇంట్లో ఉండి చదువుకొన్న అబ్బాయే. పేరు జ్ఞాపకంలేదా? మన ఇంట్లో మూడు వారాలు భోంచేస్తూ, నిన్ను 'పిన్ని' అని నన్ను 'బాబాయి' అని పిలుస్తుండేవాడు'

'ఆ అబ్బాయి శివం కాదూ.'

'అవును వాడే వీడు. వీడి పేరు అసలు శివసుందరం. మనం శివం, శివం అంటూ పిలిచేవాళ్ళం'

'నిన్న సుందరం అంటే ఎవరో అనుకొన్నాను ఆ అబ్బాయేనా? అయినా పెద్దవాడైనవాడిని ఇల్లా జేస్తే ఏమ

నుకొంటాడో, ఎంత అసహ్యం అయిపోయిందండీ?'

'మరేం ఫరవాలేదు. నీవు ఏమీ అనుకోనక్కరలేదు నేను అతనికి గురువును నీవు గురువు భార్యవుతల్లితో సమానం'

*　　*　　*　　*　　*

'సరేలెండి, ఎప్పుడూ అదే ఎత్తిపాడువా? ఇన్నిరోజు లయినా. ఆసంగతి జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా ఎల్లాగో వుంటుందండి. మీరు ఎన్ని చెప్పినా నాకా వికారం పోదు.' అన్నది కాంతం.

'ఏదెట్లా ఉన్నా నాకుమట్టుకు ఒక మహోపకారం జరిగింది ఇందు మూలంగా'

'ఏమిటండీ'

'ఏదో ఒకటి'

'చెప్పండి'

'చెప్పమంటావా?'

చెప్పండి నాకేం కోపం?'

'ఆ, ఏంలేదు. స్నేహితులేం అప్పు ఇచ్చిన వాళ్ళేం ఎవరూ నాగున్యంలోకి కాలెట్టడంలేదు!!'

'ఏంచేత?'

బుగ్గలు పిండేస్తావని భయం'

చాల్లెండి!'

'......'

# సముద్రస్నానం

"చూడండీ."

"........."

"మిమ్మల్నే....."

"ఊఁ—ఎందుకూ, రేపు నాకు బడిలేదు...లేపకు...నిద్రపోనీ."

"మాట;—ఇల్లా చూడండి...రేపు మీరు కార్తిక సోమవారం ఉంటూరా?"

"సోమవారం ఉండటమూ? ఎక్కడ?"

"ఎక్కడేమిటి—ఇంకా మీరు మెలుకువ రాలేదూ? కార్తిక సోమవారం ఉపవాసం ఉంటూరా?"

"ఉండను."

"పోనియండి, నేను సముద్ర స్నానానికి వెళ్ళివస్తాను......కాస్త పిల్లలను చూస్తుండండి. ఇక్కడున్నట్లుగా వస్తాను."

"వద్దు..."

"అల్లాగంటే ఎల్లాగండీ...మహా పర్వదినం...ఇట్టే వస్తానుగా! తెల్లవారే టప్పటికి వస్తాను. పెద్దపిల్లనుతీసుకొని పోతాను. చిన్నవాళ్ళను కాస్త చూస్తుండండి."

తరువాత నిద్రమత్తులో ఏమన్నానో జ్ఞాపకంలేదు.

ఆమె బండెక్కి వెళ్ళటం నేను తలుపు వేసుకొని మళ్ళీ వచ్చి పడుకోటం నాకు జ్ఞాపకమే.

కాంతం ఇల్లు దాటిన పావుగంట కల్లా పసిది లేచి తల్లి పక్కలో లేకపోవటం మూలాన కెవ్వున కేకేసి 'అమ్మా' అని పిలిచింది. నేను లేవక తప్పిందికాదు. ముక్కుకుంటూ, మూల్గుకుంటూ వెళ్ళి "అమ్మా లేచావు తల్లీ పడుకో" అన్నాను. నా మాటలు దానికి అర్థం అయితే గద! అది అట్లాగే మేకలాగ కూర్చున్నది నడిమంచంమీద "అమ్మా, అమ్మా" అంటూ.

కాసేపు నాలుగు వైపులా చూచి, అమ్మ రాక పోవటం మూలాన మెల్లగా లేచి మేడ దిగటానికిపోతున్నది.

మెట్లు పసిది దిగలేదు. అందుకని దాని ఉద్దేశాన్ని గ్రహించి ఎత్తుకొని మేడక్రిందికి దింపాను. అది ముందు వంట ఇంట్లోకి వెళ్ళింది "అమ్మా"అని ఏడుస్తూ. అక్కడ ఎవ్వరూ కనబడలేదు. తరువాత దొడ్డితలుపు దగ్గర నుంచుని ఏడ్చింది. తలుపు తీశాను. దొడ్లోకి వెళ్ళింది ఆ మసక మసక చీకట్లోనే, దొడ్డంతా వెతికింది. ఎక్కడా అమ్మ కనబడలేదు.

ఇక అమ్మ ఇంట్లో లేదన్న విషయాన్ని గ్రహించి అది నన్నే నమ్ముకొని నేను చెప్పినట్లు వింటుందని నా నమ్మకం. అందుకని దాన్ని ఎత్తుకొని మళ్లీ మేడపైకి వచ్చాను. అది ఏడ్పు ఏమాత్రం ఆపలేదు. పెద్దగా ఏడ్వటం సాగించింది.

అమ్మ ఇంట్లో లేదని పూర్తిగా గ్రహించి కూడా అది

అట్లా మొండితనంగా ఏడ్వటం నాకు ఏమీ సమంజసంగా కన పడ లేదు. తరువాత స్పష్టంగా చెప్పి చూద్దాము నా తప్పు లేకుండనని,

"తల్లీ ఇదిగో చూడు . మీ అమ్మ ఇట్లా సముద్రానికి పోయింది. ఒక గంటలో వస్తుంది. అందాకా నేను ఎత్తుకుం టాను. నీవు ఊరుకో-ఏడిస్తే లాభంలేదు" అని స్పష్టంగా చెప్పాను.

దాని కాసంగతి బోధపడ లేదనా? కాదు. చక్కగా బోధపడ్డది. "అమ్మ—ఓ పోయి"అన్నది.

"ఆ . అదీ సంగతి" నీవు ఏడ్వవద్దు. కావలిస్తే బిస్కట్లు పెడతాను" అన్నాను.

మరి ఇక ఊరుకో వలసిందేనా, న్యాయంగా ? ఊరు కోదే! ఒకటే ఏడ్వటం.

పైగా ఎత్తుకున్నా నిలవక పోవడం, ఎగిరి పడటం, బుజంమీద పడుకో బెట్టుకొని చిచ్చి గొట్టినా జారి పోవ టానికి ప్రయత్నం చేయటం, ఇదీ దాని ప్రవర్తన.

చెయ్యి గట్టిగా అదిం పెట్టి బుజంమీద పడుకో బెట్టాను. కాని, చెయ్యి తీసేసి కెవ్వున కేకేసి తాచుపాములాగ చివ్వున లేచి "అమ్మా"అంటూ ఏడుస్తుంది.

"ఎట్లాగే నితా, న్యాయం లేకుండా ప్రవర్తిస్తావు ? అమ్మాయీ, కోపం వస్తోంది! కొడతాను" అని చెయ్యి ఎత్తి చూపి భయపెట్టాను. ఇంకా ఎక్కువైంది ఏడ్పు.

"పిల్లలైతే మట్టుకు గ్రహింపు ఉండొద్దు" అనుకొని విసుక్కొని, ఏడిస్తే ఏడ్వనీ...నాతప్పలేదు అనుకొనిఅట్లాగే దాన్ని బుజంమీద పడుకో బెట్టుకున్నాను.

ఇంతలో "అమ్మా" అంటూ లేచాడు చిన్నవాడు. వీడు దానికంటె పెద్దవాడు. నాలుగో ఏడు. మాటలుఅర్థం అవుతాయి.

"నాయనా పడుకో"అన్నాను.

"అమ్మేది" అన్నాడు.

"అమ్మ సముద్రస్నానానికి వెళ్ళింది. ఇంకాసేపుట్లో వస్తుంది. పడుకో నాన్నా. ఇంకా తెల్లవారలేదు. నిద్రపో."

"నేను పడుకోను నిద్రరాదు."

"పోనీ......ఆడుకో...అ...దిగో ఆ పుస్తకంలో బొమ్మలు చూచుకో."

"వద్దు."

"పోనీ గంతులెయి."

"ఉహుఁ."

"మరి ఏం జేస్తావు?"

"అమ్మ పోతా."

"ఓరి వెధవా—అమ్మ సముద్రానికి వెళ్ళింది.సముద్రం ఇక్కడికి నాలుగు మైళ్ళుంది. నీవు నడవలేవు. నీకేమైనా మతి పోయిందా? అమ్మ ఇంకాసేపటి కల్లా వస్తుంది ఉండు" అన్నాను.

'రాదు...అన్నాడు' నిస్సందేహంగా.

అన్నవాడు ఊరుకోక మేడమెట్లుదిగి సముద్రానికి పోతానంటూ ప్రయాణ గట్టాడు. ఈచీకట్లో ఏమిటి? సముద్రానికి నాలుగేండ్ల వెధవ వెళ్ళటం ఏమిటి? వీళ్ళకు తెలివి ఎందుకుండదో అనిపించింది

గబగబ మెట్లుదిగి పోతున్నాడు. వెధవ ఏమిటి వీడి! సాహసం!

'ఒరేయ్' అంటూవాడ్ని రెక్కపుచ్చుకున్నాను. చిన్న దానికంటే చెప్పినా అర్థంకాదు వీడికన్నా చెప్పితే వింటాడని.

'నాయనా, ఒరే.....ఏడ్వకూ...ఎందుకూ...... ఏడ్పు?'

'అమ్మ......'

'సరే...అమ్మకోసం ఏడుస్తున్నావు...అమ్మ సముద్రస్నానానికై వెళ్ళింది; వస్తుంది. ఏడ్వటం ఎందుకూ? అన్నాను సహేతుకంగా నచ్చచెప్పాలన్న ఆశతో.

వాడు మళ్ళ 'అమ్మ' అన్నాడు.

'వస్తుంది కాసేపట్లో' అన్నాను.

'రాదు......'అన్నాడు బిక్కముఖంతో.

వస్తుందిరా నాయనా, తెల్లవారేటప్పటికి వస్తుంది.'

రాదు......అని ఒకటే ఏడ్వటం అమ్మ వస్తుంది అని ఎంత నచ్చ చెప్పినా వినడు. అమ్మరాదు అని వాడికి గట్టి

నమ్మకంతో అంటాడు.

'వస్తుందిరా నాయనా, ఈపోవటం పోవటం ఇక రాకుండా పోతుందనిరా నీవుద్దేశం?'

'అట్లా ఎప్పటికీ పోదు. పిల్లలనూ, నన్నూ వదలిపెట్టి లేచిపోయే మనిషి కానేకాదు మీ అమ్మ నాకు బాగా తెలుసు. ఆమాట అనుకోటమే తప్పు నామాట నమ్ము. తప్పక వస్తుంది.' అని ఎన్నివిధాల నమ్మకం చెప్పినా వాడికి వీసమంతయినా నమ్మకం కలగదు.

'అబ్బబ్బ...చంపుతున్నావురా నాయనా; తప్పక వస్తుందిరా మీఅమ్మ' అని పెద్దగా అరిచాను కోపంతో. ఊహు...ఏమాత్రం నమ్మకంలేదు వెధవకు...అమ్మ రాదు అనివాడు మళ్ళీ అనడం ఏడ్వటం.

మహాప్రభూ—ఎట్లా వీ డ్ని నమ్మించడం! వాళ్లమ్మ ఇకరాదనే వాడి గట్టి నమ్మకం

పోనీ ఏదో అల్లాగ ఏడుస్తూ ఉన్నా ఒక సుగుణమే. కాళ్ళొచ్చిన వెధవ, వీలైతే మేడదిగి సముద్రానికి పోతానంటూ బయలుదేరుతున్నాడు మాటిమాటికి! చిన్నది ఎత్తుకున్నా ఏడ్వటం మానలేదు. అందుకని దాన్ని దింపేసి, వీడి దగ్గర చేరి ఎట్లాగయినా సమదాయిద్దామని కూర్చున్నాను.

చిన్నది నాపడకగదిలోనికి వెళ్ళింది అక్కడ చూచింది. ఇంకో గదిలోకి వెళ్ళింది. అక్కడ చూచింది. అమ్మ కోసమూ ఈ వెతకడం! వాళ్ళమ్మను నేను దాచేశానని

కాబోలు దీని నమ్మకం.

చిన్న గదిలో సుశీ పడుకొని ఉన్నది. వాళ్ళమ్మచీర కప్పుకొని. చిన్నది ఆ చీర గుర్తుపట్టి అదే అమ్మ అనుకొని వెళ్ళి అమాంతం దానిమీద పడ్డది. కెవ్వున కేకేసి "అమ్మా" అంటూ లేచింది సుశీకూడా.

కాస్త పెద్ద పిల్లగదా అని దానితో "అమ్మాసుశీ, పసిదాన్ని కాస్తపట్టుకొని సముదాయించు. అది అమ్మకోసం ఏడుస్తున్నది," అన్నాను.

"అమ్మ ఎక్కడికి వెళ్ళింది. ?" అన్నది సుశీ.

"సముద్రానికి స్నానానికి..." అన్నాను నేను.

"నన్ను తీసు కెళ్ళలే దేం?" అని ఒక్క పెట్టునఏడ్చింది.

"ఓసభడవా? నీవుకూడా ఏడిస్తే ఎల్లాగే? వీళ్ళతో నే సతామతం అవుతుం టేను! వళ్ళు పగల గొడతా ఏడిస్తివా అంటే!" అని భయ పెట్టాను. ఇది పుట్టుకు భయపడి ఊరుకుంది.

పసిదిమాత్రం వెక్కి వెక్కి ఏడ్వటం మానలేదు. చిన్న వాడు ఒకే స్థాయిలో అమ్మ రాదనే నమ్మకంతో ఏడు స్తున్నాడు. అమ్మవస్తుంది ఉండరా అని నేనూ రాదనివాడూ వాదన.

తలబద్దలు చేసుకుందామన్నంత విసుకు పుట్టింది. ఈ లోపున సుశీ మెల్లగా వెళ్ళి నిద్రపోతున్న తమ్ముణ్ణి లేపింది. అమ్మ వెళ్ళిపోయిందని చెప్పేసింది.

వాడోఏడ్పు ఏడ్చాడు. వాడ్ని భయపెడితే బిక్క ముఖం వేశాడు.

నాయనా, మొగపిల్లలు ఏడ్వకూడ''దని అప్పీలు చేశాను. ఎట్లాగయితేనేం ఏడ్పు దిగమ్రింగి మొగతనాన్ని నిలబెట్టాడు మా వాడు.

వాళ్ళ యిద్దర్ని ఎట్లాగో ఆపానుగాని పసివాళ్ళనే ఊరుకో బెట్టడం నాతరం గా లేదు. ఎట్లాసముదాయించాలో, ఏం జెయ్యాలో, నాకు తెలిసింది కాదు. సామదాన దండో పాయాలవల్ల ఏమీ ప్రయోజనం కనుపించ లేదు.

ఇద్దరికీ బిస్కట్లు పెట్టాను. ఇద్దరూ విసిరి పారేశారు.

కర్జూరపండు ఇచ్చాను. నా మొఖాన కొట్టారు.

ఆట వస్తువులు చూపాను. కాళ్ళతో తన్నేశారు.

వాళ్ళమ్మ ఫోటో చూపి, "అదిగో అమ్మ,' అన్నాను.

అయినా ఏడ్పు మానలేదు పసిది. వాడు మాత్రం ఆ బొమ్మ అమ్మ కాదన్నాడు. అమ్మేరా, అని నేనూ, కాదని వాడూ. మళ్ళీ మొండివాదన.

చిన్నదానికి ఏమీ తెలియక ఏడ్పు. వాడు మొండి తనాన ఏడ్పు. వాళ్ళమ్మ ఫోటోకూడా 'కాదని' వాదిస్తుంటే ఏం జెయ్యాలె వెధవని? ఇక వాడితో వాదన లాభం లేదు, రెండు తగిలిస్తేనేగాని ఊరుకో డనుకొని, వీపుపైని చెళ్ళున వేశాను నోరు మూయమని. వాడు కెవ్వన కేకపెట్టి, పెద్ద గుక్కపట్టి ఏడుస్తూ మేడ మెట్లు దిగాడు.

వెధవ, చీకట్లో భయపడతాడనిపసిదాన్ని, దింపివాడి వెంటబడి గిలగిల కొట్టు కుంటూన్న వాడ్ని పట్టుకొస్తున్నాను.

ఈలోపున పసిది మేడమెట్లు రెండుదిగి దొర్లటానికి సిద్ధమైంది. మహాప్రభో వీళ్ళమ్మ ఎట్లా వేగుతున్నదో రోజూ వీళ్ళతో ననిపించింది.

పసిదాన్ని, వాడ్ని, ఎట్లాగయితే నేం లాక్కొచ్చి మంచంమీద కూలేసి, సముదాయించటానికి ఏమాత్రం ప్రయత్నం చేయక చూస్తూ ఊరుకొన్నాను. శత్రుసేనలు కోట తలుపులు బద్దలు కొట్టుకొని వస్తూంటే, ఏమి చేయ లేక నిలబడిపోయిన రాజులాగ.

అంతలో అరుణోదయం అయింది. చీకట్లు పోతే స్నేయి ఈపాటికి ఆవిడ వస్తూ ఉంటుందన్న ధైర్యంతో— అమ్మాయీ, సుశీ, మీ అమ్మ వస్తున్నదేమో చూడూ వాకిట్లో కెళ్ళి అన్నాను.

ఏదీ?–సుశీ లేదు. దాని తమ్ముడూ లేడు! ఎక్క డికో వెళ్ళిపోయినారు. గుండె గుభేలు మన్నది, ఎక్కడికి వెళ్ళారోనని.

నేను ఈపసి పిల్లలతో అవస్థ పడుతుంటే వాళ్ళిద్దరూ ఎప్పుడో జార్నారు. వీధి తలుపుతీసిఉంది వీధిలోకెళ్ళి చూశాను. పెద్దగా కేక వేశాను.ఎక్కడజాడ లేదు. వీళ్ళెక్కడి కెళ్లారో, ఎంతదూరంపోయినారో అని దిగు లేసింది. ఆపిల్ల

చేతులకు బంగారపు గాజులున్నాయి అవి కాజేస్తారేమో ఎవరన్నా?

లేకపోతే వాటి కాశపడి పిల్లదాన్ని ఎవరేం జేస్తారో? ఎక్కడ నీళ్ళిద్దరు నూరు పడతారో? అని గుండెల్లో గుండెలు లేవు. పోనీ వాళ్ళకోసం వెతుకుదామంటే వీళ్ళిద్దరిని వదలి ఎల్లాగ కదలటం!

ఇంతలో పసిముండ ఏడ్చి ఏడ్చి అలసిపోయి ఏడ్వలేక సొమ్మసిల్లింది. దీని కెక్కడ నోరెండిపోయిందోనని, బుజాల మీది దాన్ని బుజాలమీదే ఉంచుకొని, పాలడబ్బా తీసి కొంచెం పాలుకలిపి, 'అమ్మా తాగ'మని ఇచ్చాను గ్లాసు. పుచ్చుకొని గుక్కెడు కామోలు తాగి చూస్తుండగనే ఆ గ్లాసు విసిరి నామీద కొట్టింది. బట్టంతా తడిసింది. మొఖం నిండా పాల చుక్కలు. జుట్టునిండా పాల చుక్కలు.

'ఛీ—దీని దుంప తెగ......అవస్థ'......అని విసుక్కొని ఇటుచూద్దునుగదా, ఆచిన్న వెధవ సందు దొరికింది గదా అని, సముద్రానికి ప్రయాణం గట్టి వాకిట్లోకి పోయి నాడు. అపుడు తెల తెల వారుతుంది.

వీడుకూడా ఎక్కడికి వెడతాడో మరీ చిన్న వెధవ అని 'ఒరే వెధవా, నీవుకూడా వెళ్ళిపోతావా ఏమిట్రా' అని పరుగెత్తుకొని వెళ్ళాను వాడ్ని పట్టుకొందామని. నాకుచిక్క కుండా పారిపోవాలనే ప్రయత్నంలో వాడు పరుగెత్తి కాలు జారి సైడుకాల్వలో పడ్డాడు. ఠకీమని దిగాను. మోకాలు లోతు మురుగునీళ్ళలోకి. పిల్లవాడి నోట్లోకి ముక్కి నీరుపోతా

యేమౌనని, వాడ్ని చప్పున ఎత్తుకొని చంక నేసుకొన్నాను. వాడిమొఖం, వళ్ళూ, అంతా బురద. నాబట్టలన్నీ బురద. వాడు ఏడుస్తూ నన్ను కావిలించికొని నామొఖంనిండా ఆ దుర్గంధద్రవ్యం పూశాడు.

ఇంతిలోకే చిన్నదికూడా అకుగులేస్తున్నది ఆవేపే. ఇదికూడా వెళ్ళి ఎక్కడ పడుతుందోనని దాన్నికూడా ఇంకో చంకలో కెత్తుకొన్నాను.

అప్పుడు చూడాలి నన్ను. బిడ్డలు చెరోచంకనా ఉన్నారు నామఖంనిండా సైదుకాల్వలోని బురద మోకాలు దాకా కూడా దట్టంగా ఉంది ఆబురద సాక్స తొడుక్కున్నట్లుగా. తలపైన పాలచుక్కలు.

ఈ స్థితిలో నేనుండగానే వాకిట్లో బండీ ఆగటంఆవిడ దిగటం తటస్థించింది.

నన్నుఆస్థితిలో చూచి నేను పడ్డ పాట్లన్నీ గ్రహించి, కాంతం నాపై జాలిపడి నాయందు సానుభూతి చూపి, తాను సుఖంగా సముద్రస్నానం చెయ్యటానికి వీలుకల్పించేందు కోసం, ఇంత అవస్థా నేను పడ్డందుకు నాయందు ఎంతో కృతజ్ఞత కలిగి, నన్ను ఎంతో thank చేస్తుందన్న ఆశతో అక్కడే నిలబడ్డాను.

వచ్చిందో, అమ్మగారు నిప్పులు గక్కుతూ "ఇద్దరు పిల్లలనూ వదిలేశారేం? వంతెనమీద కూర్చుని ఏడుస్తున్నారు" అంటూ,

నేనేం మాట్లాడలేదు. చూడు నా అవస్థ—అన్నట్లు అక్కడే నుంచున్నాను.

చూచింది...ఒక్కనిమిషం. గ్రహించింది. నాఅవస్థ. ......కొంచెం విచారం కళ్ళలో......మళ్ళీ చిరునవ్వు... ...అంతే!

పసిది తాచులాగ జారిపోయింది తల్లిదగ్గరకు.పసివాడు పోయి కావలించుకొన్నాడు.

కాంతం కూర్చుని పిల్లదానికి పాలిస్తూ"అమ్మా నా తల్లే, ఎంత ఏడ్చిందో! వెక్కి వెక్కి ఏడ్చిందా! నోరెండి పోయిందా?......ర నాన్నా...... నాతండ్రీ...చచ్చి పోయినారా.........నాన్నా......నిన్ను వదిలేసివెళ్ళాను! ......ప్రాణాలన్నీ మీమీదే ఉన్నాయి. ఎంత ఏడ్చావురా? ఈమురికంతా ఏమిట్రా నాయినా పడ్డావా? నాతండ్రే. పిల్లలను ఏడ్పించాను" అని మాటమీద మాట అంటూ దాన్ని ముద్దెట్టుకోనూ, వీడ్ని ముద్దెట్టుకోనూ, దాన్ని పలక రించనూ, వీడ్ని పలకరించనూ, తన్నుతాను నిందించుకోనూ ఎంతసేపూ ఇదే వరస!

ఈమానవుడు పడ్డ కష్టానికి ఒక్క సానుభూతి వాక్యం......కృతజ్ఞతను సూచించు ఒక్కచూపు...ఒక్క మంచిమాట లేదు!

పిల్లలకు తల్లే లోకమైంది! తల్లి ప్రేమంతా పిల్లలకే ఇచ్చింది—ఇక నాకు స్థానం ఏదీ!

అల్లాగ సూర్యుని కెదురుగా నిలబడిపోయేను వెర్రి మొహాలుచూసూ.

# కాంతమ్మగారి ఆవు

"పాలకనీ పెరుక్కనీ నెలకు పది పన్నెండురూపాయలు ఖర్చు కావటమే కాని, ఏంలాభం లేదండీ పిల్లలు పెరుగు కోసమని పూటపూటా ఏడ్వటమే,"అన్నది. మాఆవిడఓరోజున—

"అయితే...నన్నేమి చేయమంటా వమ్మా—?"

"ఈడబ్బు పెడితేమనమోపాడి గొడ్డును పెట్టుకోవచ్చు. అదీ నేననటం" "ఆ పోనిద్దూ. అదికూడా ఎందుకు అదో బరువూ!" "ఆ,అదేం మాటండీ? పసిబిడ్డా పాడికుండా అన్నారు. పాడిగొడ్డు మహాలక్ష్మి కాదుటండీ!"

మహాలక్ష్మే కాని...రొచ్చు మహాలక్ష్మి...అదీగాక వున్న మహాలక్ష్మికే చాకిరి చేయలేకుండా ఉన్నాను, ఇంకో దాన్ని భరించగలనా?"

"అబ్బో, మీశక్తి మీకు తెలియదుగాని,ఎంతమందినైనా భరించ గలరు"అని నవ్వింది,ఆవిడ. "సరేలే ఊరుకో" అన్నాను నేను. మా ఆవిడ ఊరుకోలేదు. పాడిగొడ్డును ఒక దానిని కొంటే పెరుగూ పాలూ సమృద్ధిగా వాడుకోవచ్చునని, మాంచికమ్మని నెయ్యి వేసుకోవచ్చునని, దానివలనమాకేమీ ఎక్కువ కర్చు లేదనీ మా ఆవిడ నాకు నచ్చ జెప్పింది.

"అయితే గేదెను మటుకు నేను కొనను అది రొచ్చు చేస్తుంది. దానికిచచ్చేంత చాకిరీ—చేయాలె,"అన్నాను నేను.

"పోనిండి,మీకంత ఇష్టంలేక పోతే ఆవునే కొనండి. నేనొద్దు అన్నానా? ఏదో ఒకటీ. కాకపోతే కాస్త నెయ్యి తక్కువ అవుతుంది. అయితే అయింది. దాని వార పాలల్లో మనకు లాభిస్తుంది. ఆవుపాలుతాగితేపిల్లలకుబలంకూడానూ,. అని దీర్ఘాలు తీస్తూ మాఆవిడ ఒక్క తీరానపోరింది'

"ఆరాత్రి కొంచెం తీవ్రంగానే ఆలోచించాను ఆవును కొనటమా, మానటమా" అనీ, ఆవు గోమహాలక్ష్మి కదా. శుభప్రదమైన సంగతి. ఆవుపాలు పిల్లలకిస్తే బలమూ సరే ఎట్లాగూ పెరుక్కూ పాలకూ పదిరూపాయిలు అవుతూనే ఉన్నాయి. ఆఖర్చుతో ఆవును మేపవచ్చు. గృహస్తు అయిన వాడికి పాడీ పంటా వుండాలన్నారు. ఇదీ బాగానేఉంది. అని ఆలోచించి చివరకు సరేననుకొన్నాను.

"అట్లాగ చేస్తేనే బాగుంటుంది"అన్నానుకాంతంతో. ఆమె చాలా సంతోషించింది. ఆరాత్రి పిల్లలు మళ్ళీ పెరుగు కోసం ఏడ్చినపుడు— ఓ రేయి నాయినా మీనాయిన రేపు ఆవును కొనబోతున్నారు. ఇక మీకు కావలసినంత పెరుగూ తాగినన్ని పాలూనూ"అంది. "అమ్మా; ఆవుకు తువ్వాయి ఉందా" అని అడిగింది పసిద. "తువ్వాయిలేక పోతే ఆవు పాలెల్లా ఇస్తుందే" అన్నది వాళ్ళమ్మ. "తువ్వాయితో నేను ఆడుకొంటానే" అని జయ తన నిశ్చయాన్ని వెలిపుచ్చింది.

"పాలు నేను తీస్తానే అమ్మా"అనిచినపిల్లనుసీ అన్నది.

"నీవా ఆవుపాలు తీసేది—ఆతీసినట్టే! ఆఆవు ఒక్కపోటు పొడుస్తుంది తెలుసునా? అసలు ఆడవాళ్ళు పాలుతీయరు. నేను తీస్తాను" అన్నాడు మా అబ్బాయి ఛాతీ విరిచి.

"నిన్ను మొదటకు పొడవదా ఏమిట్రా మహా పెద్ద మొనగాడిలాగ మాట్లాడుతావు". అని అంటూ ముక్కు పుటాలు ఎగరేసింది సుసీ.

"నన్ను అసలుఆవుపొడవరాదు. ఒక వేళపొడవొచ్చినా దాన్ని నేను స్వాధీనం చేసుకోగలను" అని మా అబ్బాయి అన్నాడు ఉరిమి చూస్తూ.

"అన్నీ ఏడ్చావులే" అన్నది సుసీ.

"తంతా నేను" అన్నాడు ఈచిన్ని వెధవ అన్నం దగ్గరనుంచి ఎంగిలిచేత్తో లేస్తూ.

"ఆవును కొననూ లేదు, పెట్టనూ లేదు ఈచిన్ని సన్యాసులు అప్పుడే పోట్లాడుకొంటున్నారు, చూశారా" అంటు వాడ్ని కూర్చోబెట్టింది తల్లి.

ఆ భోజనాలైన తరువాత ఆవుకు పాకా ఎక్కడ వేయాలిసింది, గడ్డివాము ఎక్కడ పెట్టాలిసింది. మొదలైన విషయాలన్నీ చర్చించుకొంటూ చాలాసేపు మాట్లాడుకొని నిద్రపోయాము. ఆ రోజు తెల్లవారుఝామున ఆవిడ నన్ను లేపి—"శనిఉషస్సులో బయలుదేరి వెళ్ళటం, చాలమంచిది, బయలుదేరండి, సుళ్ళుగిళ్ళూ ఉంటవి. మీకు తెలియవు,

రామరాజుగారిని కూడా వెంటబెట్టుకెళ్ళండిసంతకు'' అని చెప్పి అయిదు పదిరూపాయలనోట్లూ. పదిరూపాయలరొఖంచేతిలో పెట్టి జాగ్రత్తసుమండీ అనిచెప్పింది. మా ఆవిడ.

౨

ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంట అయింది ఆవును ఇంటికి తోలుకొని వచ్చేసరికి. ఆవునుజూచిమాయింటి ఆవిడ చాలా సంతోషించింది. దాన్నిచూస్తే నేకడుపునిండేటట్లుంది దృఢంగాఉంది పెద్దపొదుగు నేనుచూస్తూఉండగానే వాడు రెండుశేర్ల పాలూ తీశాడు. ఖరీదైనా అట్టే పెట్టలేదు. యాభై రూపాయలకే కొన్నాను. ఈవిషయాలన్నీ తెలిసికొని మా ఆవిడఉప్పొంగి పోయింది. ఆవును దొడ్లోకట్టేసుకొని దాన్ని చుట్టూచేరిచూసి ఆనందించాము. దానికి మేత నీళ్ళుచూసేం దుకు ఒక నౌకరినీకూడా పెట్టాము.

అన్నీ విధాల బాగానేఉంది కాని, దానికి కొంచెం కోపం ఎక్కువ. పాలు తీయటానికి దగ్గరకు వెడితేమట్టుకు బుస్సు మంటుంది. పొడవస్తుంది. మొదటిరోజున పాలు తీకదూడకే వదిలేశాము. రెండోరోజున అంతేఅయి... దకుపాలు ఎక్కువై జబ్బుచేసింది. దానికి చికిత్సచేయి... ఆవుకు పాలుతీయటమనేది ఒక పెద్దసమస్య అయిపోయి...

''మూతిని తాడుతో కట్టేసి, నాలుగు కాళ్ళకు

క్రింద పడేసి, అప్పుడు పాలుతీస్తే సరిపోతుందేమో అన్నా'' న్నది మా పెద్దపిల్ల.

ఎద్దులకూ గుర్రాలకూ, గిట్టలకు నాళాలు కొట్టే సమయంలో. దాన్ని పడేశే పద్ధతిలో మాఆవునుకూడా పడేయాలెనన్నమాట. అదే సరియైన పద్ధతీ అని తోచింది. ఇంకోవిధంగా మాకు అది స్వాధీనమయ్యేట్లు లేదు. కాని అల్లాగ పడేయటానికిఇద్దరు ముగ్గురు మనుష్యులసాయం కావాలె. అదీగాక అల్లాగ జేస్తే అదిపాలుఎగ జేపుతుందనిరామరాజు గారు చెప్పారు, ఇక మాకుఏమీ ఉపాయం తోచింది కాదు. [illegible]టా భగవంతుడా అని అనుకొన్నాము. ఎంత తంటాలు పడ్డా అది పొడవరావటం మానటంలేదు. రామరాజుగారూ నేనూ; కర్రలు పుచ్చుకొని యమకింకరులలాగ దాని కట్టెదుట నుంచోటమూనూ, మాఆవిడ పాలుతీయటమూనుఇదీవరస.

ఎన్నాళ్ళని ఇల్లాగ తంటాలు పడగలము. కాని ఏం జేస్తాము? అట్లాగే గడుస్తున్నది. కాని దాని కడుపుచల్లగా అది రెండుశేర్ల పాలూ ఇస్తున్నది. నెయ్యికూడాఅవుతున్నది. అందుకు దాన్నివదలలేక ఇల్లాగే ఇద్దరుముగ్గురు కర్రలతో [illegible]ని ముందునుంచునే వాళ్ళము గదాయుధాలను చేతపూని.

అప్పటికి ఆవునుకొని నెలరోజులైనా దాన్ని ఇంట్లోనే మేపాముగాని, బీడుకు తోలలేదు. గొడ్లకాసేవాడు [illegible] తోలుకెళ్ళాడు. ఎప్పుడూకట్టేసి ఉంచితే [illegible] జబ్బు [illegible]న్నారు. అందుకని వదిలాము. సాయంత్రం

అందరిగోడ్లూ ఇళ్ళకు చేరినా ఇది రాలేదు. ఆవెధవనడిగితే అది పారిపోయిందండీ బాబూ అన్నాడు.

ఎట్లా ఊరుకోము. రెండురోజులు సెలవుపెట్టి రామరాజు గారు నేనూ వెళ్ళి చుట్టుప్రక్కల ఊళ్ళన్నీ తిరిగి వెదికి దాన్ని పట్టుకొచ్చాం. ఎందుకొచ్చిన అవస్థరా ఇదీ అనిపించింది. మాటి మాటికి అది అల్లాగ వెళుతుంటే మాగతి ఏం కావాలా అని అనిపించింది.

మర్నాడు నేను సాయంత్రం ఇంటికొచ్చేసరికి, దాని మెళ్ళో ఒక సిల్కు త్రాడు. దానినుంచి వ్రేలాడుతున్న ఒక పెద్ద అట్టముక్క కనిపించినవి "ఈ ఆవు ము॥ వెంకట్రావు గారిదిబుట్టయ్యపేట. మచిలీపట్నం—అని దానిపై వ్రాసిఉంది రామరాజుగారిచేత మాఅబ్బాయి, ఆ అట్టముక్కను దాని మెళ్ళో కట్టించాడట. ఎందుకురా అంటే ఎప్పుడైనా అదిపోకిరీగా లేచిపోయినా, ఆ అట్టముక్కపైనున్న అడ్రసుప్రకారంమళ్ళీఇంటికొస్తుందట! సరే బాగానే ఉందీ అనుకొన్నాము.

నేనే దానిని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నంచేయసాగాను. దువ్వటం మొదలుపెట్టాను. గంగడోలు గోక్కి దాన్నిమంచి చేసుకోవాలెనని చూశాను. ఎన్నిజేసినా ఊరుకోనేదేగాని పొదుగుదగ్గరకు వెళ్ళేసరికి బుస్సుమనేది "ఏమండీ ఏమైనా స్వాధీనానికివస్తుందా" అన్నదిమాఆవిడ ఒకరోజున. "లేదు కాంతం" అన్నాను. "దువ్వండి దువ్వి స్వాధీనం చేసుకోండి, మీరుమగవాళ్ళు ఎట్లాగయినా మీరే స్వాధీన

చేసుకోవాలె" అన్నది ఆవిడ గారు. "ఈఆవు అంతా నీమోస్తరేనే కాంతం ఎంత దువ్వినా లొంగటం లేదు,. అన్నాను. "అల్లాగా, దువ్వేతీరున దువ్వితే అదేలొంగుతుంది చేతకాక పోతే" నరి అన్నది ఆవిడ ఈసడింపుగా. కాని ఎంతదువ్వినా ఆఆవు మరుకు మాకు లొంగిందికాదు.

రోజూ అదేవిధంగా పాలుతీసే సమయానికి నేనూ రాజుగారూ పిల్లలూ అంతా, కర్రలుపుచ్చుకొని దానిముందు నిలబడేవాళ్ళం. ఆవిడఎల్లాగో కష్టపడి పాలుతీస్తున్నంతసేపూ నాప్రాణాలు అరచేతిలోఉండేవి. ఎక్కడపొడుస్తుందోఎక్కడ తగలరానిచోట దెబ్బ తగులుతుందో అని భయం ఒకరోజు మాటకానాయె ఇది!! నిత్యం ఇంటిల్లి పాదీ సర్కసులో వాళ్ళలాగ తయారు కావాలాయె! చివరకు విసుకెత్తి నేను అన్నాను మాఆవిడతో—"కాంతం—ఈఆవును అమ్మేసి అయిన కాడికి సొమ్ముచేసుకొందామూఅని' కాంతం ముఖం ఇంతజేసుకొని రుసరుసలాడుతూఅన్నది, "పాడిగొడ్డునుఅమ్ము కొంటా•రా ఏమిటండీ" అని, "అయితే ఈపోట్లగొడ్డును పెట్టుకొని ఎన్నాళ్ళనీ...కాపరంచేయటం" అన్నాను నేను చీకాగ్గా "ఎన్నాళ్ళైనానూ, ఏం? ఎన్నాళ్ళైనాకాపరంచెయ్యొచ్చునండీ!' అని దీర్ఘాలుతీసింది ఆవిడగారు.

"అయితే ఈపోట్లగొడ్డుతోనా" అని నేనురెట్టించాను

అయితే నేమండీ, నేను మిమ్మల్నుపెట్టుకు కాపరం చేయటంలా? అన్నది కాంతం. విదిలించినట్లు

"నేను......కూడా...పోట్లగొడ్డునేఅంటావా?నువ్వ చెప్పినట్టల్లావింటున్నాను. నిన్నేమన్నా కొడుతున్నానా? తిడుతున్నానా? పల్లెత్తుమాట నిన్ను అంటంలేదూ" అన్నాను నేను విచారంగా "ఇప్పుడూ అదంతా ఎందుకు మీరు మటుకు మొదట్లో ఒక్కతీరాన స్వాధీనమైనారా! ఇంతకంటే ఎక్కువగానే బుసలు కొట్టారు మొదట్లో, ఇంతకంటేగానే ఎక్కువ పోడవొచ్చారు! ఏమిటో! మొదట్లో అందరూ అంతే ఎల్లాగే ఓపిక పడితే ఎంత పోట్లగొడ్డు అయినా స్వాధీనానికి రాకమానదు. అమ్ముకుంటారటండీ!!" అన్నదిమాగృహిణి కాంతయ్యమ్మారావు వేగం ఆ నిండిన పాలచెంబు చేత్తోపట్టుకొని చీర కుచ్చెళ్ళు జీరాడకొంటూఇంట్లోకి పోతూ,పోతూ పోతూ వెనక్కుతిరిగి నన్నుజూచి ఒక చిరునవ్వు నవ్వింది, నేనుమా ఆవువంక చూశాను మాఆవు నావంక జూసింది, ఇంతింతకళ్ళతో—దీనంగా.